ఈనాటి
PRGI-NO-APTEL/25/A2739
# తెలుగోడు
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com
సంపుటి-1 | సంచిక - 33 | శనివారం 1 నవంబర్ 2025 | పేజీలు - 12 | వెల - రూ.. 5
Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati

సంజన లైఫ్‌కేర్ ఫార్మసీ +


మా వద్ద అన్ని రకాల ప్రముఖ కంపెనీల మందులు లభించును..
ఎమ్మార్పీ ధరలకంటే ప్రతి మెడిసిన్‌పై 10శాతం నుండి 30శాతం వరకు ధర తగ్గించి అమ్మబడును..
అత్యవసర పరిస్థితిలో డోర్ డెలివరీ కూడా ఇవ్వబడును...
బస్టాండ్ సర్కిల్, మెయిన్‌రోడ్, నల్లమాడ.. శ్రీ సత్యసాయి జిల్లా..
సెల్ - 8886920715

# చరిత్ర సృష్టించిన సర్దార్



- ఏక్ భారత్, శ్రేష్ట భారత్ సర్దార్‌జీ నినాదం..
- భారతీయులంతా ఐక్యంగా వుండాలి..
- దేశ వ్యాప్తంగా ఏక్తా దివస్ నిర్వహించాలి..
- పటేల్ చరిత్ర సృష్టించారు.. మనం కూడా చరిత్ర సృష్టిద్దాం రండి....
- ఏక్తా దివస్‌లో ప్రధాని మోదీ పిలుపు....

**గాంధీనగర్, అక్టోబర్ 31 :**

చరిత్ర రాయడంలో సమయం వృథా చేయకూడదని, దానిని సృష్టించాలని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విశ్వసించారని, అందుకే ఆయన దేశాన్ని ఏకం చేశారని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. దానికి తగ్గట్టే భారతదేశాన్ని ఏకంచేసి ఆయన చరిత్ర సృష్టించారని మోడీ కొనియాడారు. గుజరాత్‌లో ఐక్యతా విగ్రహం వద్ద పటేల్ 150వ జయంతి వేడుకల్లో ప్రధాని మోడీ పాల్గొని ప్రసంగించారు.స్వాతంత్ర్యం తర్వాత 550 సంస్థానాలను ఏకం చేసి అసాధ్యమైన పనిని సుసాధ్యం చేశారు. ఆయనకు ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ దార్శనికత అత్యంత ముఖ్యమైంది. దానిని మేం సమర్థిస్తాం అని అన్నారు. స్వాతంత్య్ర, గణతంత్ర దినోత్సవాల మాదిరిగానే ఏక్తా దివస్‌ను జరుపుకొంటున్నాం. భారతీయులంతా ఐక్యంగా ఉండాల్సిన



# ఎన్టీఆర్ వైద్యసేవలకు ఊపిరి

- ఆసుపత్రుల అసోసియేషన్‌తో చర్చలు సఫలం..
- వైద్యసేవలు పునరుద్ధరణకు యాజమాన్యాలు అంగీకారం
- రూ 250కోట్లు చెల్లింపులకు ప్రభుత్వం అంగీకారం
- నవంబర్ ఆఖరులకల్లా పెండింగ్ బకాయిలు చెల్లింపు
- వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్..



**అమరావతి, అక్టోబర్ 31 :**

ప్రైవేటు ఆస్పత్రుల అసోసియేషన్‌తో ఏపీ ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ఆందోళన విరమించిన యాజమాన్యాలు.. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్ వైద్యసేవల పునరుద్ధరణకు అంగీకారం తెలిపాయి. వెంటనే మరో రూ.250 కోట్ల బకాయిల చెల్లింపునకు ప్రభుత్వం అంగీకరించింది. ప్రైవేటు ఆస్పత్రుల అసోసియేషన్ ప్రతినిధులతో ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం సమావేశమయ్యారు.(మిగతా 2లో)

# మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణం

- రాజ్‌భవన్‌లో ప్రమాణం చేయించిన గవర్నర్..
- అల్లా సాక్షిగా ఇంగ్లీషులో ప్రమాణం...
- ఎమ్మెల్సీ ఎంపిక కానప్పటికీ మంత్రిపదవి..
- మరో ముగ్గురికి మంత్రుల అవకాశం..
- శుభాకాంక్షలు తెలిపిన సిఎం, గవర్నర్..



**హైదరాబాద్ అక్టోబర్ 31 :**

తెలంగాణ మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయనతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పాల్గొన్నారు. హైదరాబాద్ రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అజారుద్దీన్‌తో ప్రమాణం చేశారు. అల్లా సాక్షిగా ఇంగ్లీషులో ఆయన ప్రమాణం చేశారు. అంతరం గవర్నర్, సిఎంలు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలియచేశారు. (మిగతా 2లో)

# ప్రశ్నిస్తే..దుష్ప్రచారమా..!


- నకిలీ మద్యంపై ప్రశ్నిస్తే తప్పా..!
- సిబిఐ విచారణకు డిమాండ్...
- ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రశ్నిస్తా.. జోగి రమేష్..



**తాడేపల్లి, అక్టోబర్ 31 :**

చంద్రబాబుని నారా లోకేష్ ని ప్రశ్నిస్తే తనపై దుష్ప్రచారం చేశారని మాజీ మంత్రి జోగి రమేష్ ధ్వజమెత్తారు. కూటమి సర్కార్ తనని ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రశ్నిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.బాధ్యత కలిగిన ప్రతిపక్ష నాయకుడిగా ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇబ్రహీంపట్నంలో కల్తీ మద్యం ఫ్యాక్టరీని (మిగతా 2లో)

# వైభవంగా కృష్ణమ్మకు హారతి


2వ

# ఆరేశ్యామలపై కేసు

- బస్సుప్రమాదంపై దుష్ప్రచారం చేశారని 27మందిపై కేసులు..
- ఆరేశ్యామల, సీవీరెడ్డి పలువురిపై కేసు...



**కర్నూలు,, అక్టోబర్ 31 :**

ఆంధ్రప్రదేశ్ కర్నూలు జిల్లాలో జరిగిన కావేరి బస్సు దుర్ఘటనలో దుష్ప్రచారం చేశారని 27మందిపై పోలీసులు కేసునమోదు చేశారు. వారిలో వైసీపీ నాయకులు ఆరేశ్యామల తదితరులున్నారు. (మిగతా 2లో)

# తుఫాన్.. తక్షణ సాయం

## బాధితులందరికీ తక్షణ సాయం చేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్, అధికారులకు పవన్ ఆదేశం



**అమరావతి, అక్టోబర్ 31 :**

మొంథా తుఫానుతో నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని అధికారులకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. కాకినాడ జిల్లా కలెక్టర్, వివిధ శాఖల అధికారులతో ఏపీ సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పవన్ కల్యాణ్ శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుఫాను అనంతర ఉపశమన చర్యలపై అధికారులకి కీలక ఆదేశాలు జారీచేశారు డిప్యూటీ సీఎం. కాకినాడ జిల్లా పరిధిలో (మిగతా..2లో)

# ఎమ్మెస్ రాజుపై చర్యలేవీ

## టిటిడి మెంబర్‌గా మడకశిర ఎమ్మెల్యే అనర్హుడు భగవద్గీతను కించపరచడం హేయం.. రాజాసింగ్

**హైదరాబాద్, అక్టోబర్ 31 :**

టీడీపీ మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుపై తెలంగాణ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుద్ధిలేని ఎమ్మెల్యేని టీటీడీ మెంబర్గా నియమించడమేంటి అని ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడ్ని నిలదీశారు. ఎమ్మెస్ రాజు ఓ బుద్ధిలేని వ్యక్తి. భగవద్గీత పై నోటికి ఏది వస్తే అది మాట్లాడు తున్నారు. ఇలాంటి వ్యక్తులను టిటిడి బోర్డు మెంబర్ గా పెట్టొచ్చా. టీటీడీ బోర్డు మెంబర్ గా నియమించేముందు ఆ వ్యక్తికి హిందూ ధర్మం పై నమ్మకం, జ్ఞానం ఉందో లేదో చూడాలి. (మిగతా 2లో)



# రాజధానిపై జాప్యం వద్దు

- జాప్యం లేకుండా రాజధాని నిర్మాణ పనులు ...
- నిర్దేశించుకున్న సమయానికి పనులు పూర్తి ...
- నిర్మాణ సామాగ్రి సరఫరాలో ఇబ్బందులు కలగకూడదు..
- పెండింగులో ఉన్న రిటర్నబుల్ ప్లాట్లను త్వరగా రిజిస్ట్రేషన్...
- సీఆర్డీఏ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు..



**అమరావతి, అక్టోబర్ 31 :**

రాజధాని నిర్మాణ పనులు జాప్యం లేకుండా జరగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నిర్దేశించుకున్న లక్ష్యానికి నిర్మాణాలు పూర్తి కావాలని చెప్పారు. రాజధాని నిర్మాణ పనుల పురోగతి, బ్యూటిఫికేషన్, రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ వంటి అంశాలపై శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఏయే నిర్మాణాలను ఎంత వరకు పూర్తి చేశారు..? వర్క్ ఫోర్స్ ఏ మేరకు ఉంది..? నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్, మెషినరీని ఆయా సంస్థలు ఏ మేరకు సమకూర్చుకున్నాయనేదానిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏయే భవనాలను ఎప్పటిలోగా పూర్తి చేయాలో నిర్దిష్ట సమయాన్ని నిర్దేశించుకున్నామని... ఆ మేరకు పనులను పూర్తి చేయాల్సిందేనని సీఎం (మిగతా 2లో)

# చరిత్ర సృష్టించిన సర్దార్



(మొదటి పేజి (తరువాయి)

అవసరం ఉంది. విభజన శక్తులకు దూరంగా ఉండాలి. దేశ సమగ్రతకు నక్సలిజం ముప్పుగా పరిణమించింది. నక్సల్స్ ఏరివేత కోసం ఎన్నో ఆపరేషన్స్ చేశాం. నక్సలిజం మూలాలను సమూలంగా పెకిలిస్తాం. కశ్మీర్ మొత్తాన్ని భారత్‌లో కలపాలని పటేల్ ఆకాంక్షించారు. దానిని నెహ్రూ గౌరవించలేదు. పటేల్, అంబేద్కర్‌ను కాంగ్రెస్ అవమానించింది. ఆయన దూరదృష్టిని మరిచిపోయిందని అన్నారు. కాంగ్రెస్ చేసిన తప్పు వల్లే కశ్మీర్‌లో కొంత భాగాన్ని పాకిస్థాన్ ఆక్రమించింది. దానివల్ల కశ్మీర్, దేశంలో అశాంతి నెలకొంది. ఉగ్రవాదాన్ని దాయాది దేశం పెంచి పోషించింది. ఇంత జరిగినా ఉగ్రవాదుల ముందు కాంగ్రెస్ తలవంచింది. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ బలాన్ని ప్రపంచం మొత్తం చూసింది. మన దేశం నిజమైన బలం ఏంటో ఆ ఉగ్రవాదులకు తెలిసింది. దేశ ఐక్యతను బలోపేతం చేసే చర్యలను ప్రోత్సహించాం. ఆయన ఆకాంక్షలను మేం గౌరవించాం. అక్రమ వలసదారులపై చర్యలు తీసుకుంటుంటే కొందరికి బాధగా ఉంటుంది. దేశం నుంచి చొరబాటుదారులను తరిమికొట్టాలని ప్రతిజ్ఞ చేద్దాం అని మోదీ పిలుపునిచ్చారు. పటేల్ జయంతి సందర్భంగా ప్రత్యేక నాణెం, స్టాంపు విడుదల చేశామని వెల్లడించారు. పటేల్ జయంతి సందర్భంగా ఏక్తా దివస్‌ను పురస్కరించుకొని ప్రత్యేక పరేడ్ ఏర్పాటుచేశారు. ఇందులో సైనిక దళాల కవాతు ఆకట్టుకుంది.

# మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణం



(మొదటి పేజి (తరువాయి)

మధ్యాహ్నం 12.15గంటల ప్రాంతంలో ప్రమాణ స్వీకారం చేయించారు. కేబినెట్ విస్తరణలో భాగంగా ఆయన ఒక్కరే మంత్రిగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు హాజరయ్యారు. నూతన మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. ఇంతకీ ఏ శాఖను కేటాయిస్తారు అనే అంశంపై క్లారిటీ లేదు. మంత్రి వర్గ విస్తరణపై గత కొన్ని రోజులుగా ఏఐసీసీలో కసరత్తు జరిగింది. రాష్ట్రమంత్రి వర్గ విస్తరణకు ఇటీవల ఏఐసీసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం రాష్ట్ర కేబినెట్‌లో 15 మంది ఉండగా.. మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశముంది. అయితే, ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన అజాహరుద్దీన్‌కు మాత్రమే ప్రస్తుతం మంత్రి పదవి ఇవ్వాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ఎప్పుడు కేబినెట్ ఏర్పడినా.. ముస్లిం మైనార్టీకి ఒక మంత్రి పదవి ఉండేది. కాంగ్రెస్ పార్టీ తరఫున చాలా మంది ముస్లిం మైనార్టీలు ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ఈసారి ఎక్కడా గెలవలేదు. దీంతో ఆ వర్గానికి కేబినెట్‌లో అవకాశం కల్పించేందుకు సాధ్యపడలేదు.కాగా.. అజాహరుద్దీన్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తాజాగా జరుగుతున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధపడ్డారు. అయితే, ఆయనకు కాంగ్రెస్ అధిష్టానం ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టాలని నిర్ణయించింది. గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా అజాహరుద్దీన్, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరామ్‌ను కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసింది. అయితే, వీరిద్దరి నియామకానికి గవర్నర్ ఇంకా ఆమోదం తెలపలేదు. ఎమ్మెల్సీ నియామక పక్రియ పూర్తికాకపోయినప్పటికీ అజాహరుద్దీన్ మంత్రిగా ప్రమాణం చేసేందుకు ఏఐసీసీ ఆమోదం తెలిపింది. 1963 ఫిబ్రవరి 8న హైదరాబాద్‌లో అజారుద్దీన్ జన్మించారు. అబిడ్స్‌లోని ఆల్ సెయింట్స్ హైస్కూల్‌లో పాఠశాల విద్యను అభ్యసించారు. నిజాం కాలేజీలో బీకాం చదివారు. మేనమామ జైనులాబుద్దీన్ స్ఫూర్తితో క్రికెట్ వైపు అడుగులు వేశారు. 1984లో అంతర్జాతీయ క్రికెట్‌లో రంగప్రవేశం చేశారు. అజారుద్దీన్ క్రికెటర్‌గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తొలి మూడు టెస్టుల్లోనూ సెంచరీలతో సంచలనం సృష్టించారు. 1989లో భారత క్రికెట్ జట్టు కెప్టెన్‌గా భాధ్యతలు చేపట్టారు. 16 ఏళ్ల క్రికెట్ కెరీర్‌లో 99 టెస్టులు, 334 వన్డేలు ఆడారు. రిటైర్మెంట్ తర్వాత రాజకీయాల్లోకి వచ్చారు. 2009 ఫిబ్రవరి 19న కాంగ్రెస్‌పార్టీలో చేరారు. అదే సంవత్సరం యూపీలోని మొరాదాబాద్ స్థానం నుంచి ఎంపీగా గెలుపొందారు. 2018లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అజారుద్దీన్‌ను నియమించారు.

# ఆరే శ్యామలపై కేసు



(మొదటి పేజి (తరువాయి)

కర్నూలు జిల్లా కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామ సమీపంలో హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న కావేరి బస్సు దగ్ధమైంది. ఈ ప్రమాదంపై దుష్ప్రచారం చేస్తున్న వారిపై ఫిర్యాదు అందడంతో కర్నూలు తాలుకా అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా 27 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ జాబితాలో ఆరే శ్యామల, సీవీ రెడ్డి, కందుకూరి గోపికృష్ణతోపాటు వైసీపీ అధికార ఎక్స్ పేజీ నిర్వాహకులు ఉన్నారు.ఈ కర్నూలు బస్సు ప్రమాదం బెల్టు షాపులు, కల్తీ మద్యం కారణంగానే జరిగిందంటూ వైసీపీ దుష్ప్రచారం చేస్తోంది. ఆ క్రమంలో కర్నూలు మండలం బి. తాండ్రపాడుకు చెందిన పేరపోగు వెనుములయ్య పోలీసులను ఆశ్రయించారు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.అక్టోబర్ 24వ తేదీ తెల్లవారుజామున చిన్నటేకూరు వద్ద జరిగిన ప్రమాదంలో 19 మంది ప్రయాణికులు మరణించారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆ క్రమంలో ప్రమాదం జరిగిన సమీపంలోని సీసీ ఫుటేజ్‌లు పరిశీలించారు.ఈ ప్రమాదానికి మద్యం తాగిన బైక్ నడిపిన శివశంకర్ అనే వ్యక్తి కారణమని తేల్చారు. అదే బైక్‌పై ప్రయాణించిన అతడి స్నేహితుడు ఎర్రి స్వామిని పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. ఈ సందర్భంగా తాను కర్నూలు జిల్లాలో జరిగే కార్యక్రమానికి వెళ్లాల్సి ఉందన్నాడు. తనను డోన్‌లో దింపుతానని శివశంకర్ చెప్పాడంతో అతడి బైక్ ఎక్కానన్నాడు.అనంతరం ఇద్దరం మద్యం తాగి.. శివశంకర్ తనను బైక్‌పై డోన్‌లో దింపేందుకు బయలుదేరాడని తెలిపాడు. అలా వెళ్తున్న క్రమంలో రోడ్డుపై డివైడర్‌ను బైక్ ఢీకొట్టిందని.. శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందాడని చెప్పాడు. ఈ ఘటనలో తనకు స్వల్పంగా గాయాలయ్యాయని పేర్కొన్నారు. అంతలో రహదారిపై ఉన్న శివశంకర్ మృతదేహాన్ని పక్కకు తీశానని చెప్పుకొచ్చాడు. రహదారిపై ఉన్న బైక్‌ను తీసే క్రమంలో పలు బస్సులు వేగంగా వెళ్లాయని పోలీసులకు చెప్పాడు. అంతలో కావేరీ ట్రావెల్స్ బస్సు.. ఈ బైక్‌ను ఈడ్చుకుని ముందుకు వెళ్లిందని.. ఆ క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకుందని పోలీసుకు ఎర్రి స్వామి వివరించాడు.

# ఎన్టీఆర్ వైద్యసేవలకు ఊపిరి

(మొదటి పేజి (తరువాయి)



నవంబర్ చివరికల్లా పెండింగ్ బకాయిలు మొత్తం ఒకే విడతలో చెల్లిస్తామని హామీ ఇచ్చారు. బకాయిల చెల్లింపుపై మంత్రి స్పష్టమైన హామీ ఇవ్వడంతో వైద్యసేవల పునరుద్ధరణకు యాజమాన్యాలు అంగీకరించాయి. బకాయిలు చెల్లించాలన్న డిమాండ్‌తో గత 20 రోజులుగా ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రులు సమ్మె చేస్తున్నాయి. ప్రభుత్వం ప్రాథమికంగా రూ.250 కోట్ల బకాయిలు విడుదల చేసింది. దశల వారీగా మిగిలిన బకాయిలూ చెల్లిస్తామని ప్రకటించింది. అయినా సమ్మె కొనసాగించడంతో మొత్తం బకాయిలు వన్ టైం సెటిల్‌మెంట్ కింద నవంబర్ చివరికల్లా చెల్లించాలని నిర్ణయించింది. మొత్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల అసోషియేషన్‌తో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ఈ క్రమంలో సమ్మె విరమించాలని ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ కింద ఉన్న స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్ నిర్ణయించింది. వైద్య సేవా పథకం కింద సేవలన్నింటినీ పున:ప్రారంభించాలని నిర్ణయించినట్లు అసోసియేషన్ ప్రకటించింది.నవంబర్ 15లోపు 250 కోట్ల రూపాయలు విడుదల చేసేందుకు ప్రభుత్వం అంగీకరించిందని అసోషియేషన్ వెల్లడించింది. అన్ని బకాయిల పరిష్కారానికి ఒకేసారి సెటిల్‌మెంట్ విధానానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని పేర్కొంది. ఈ నిర్ణయాలు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో ఆరోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తాయని అసోసియేషన్ పేర్కొంది. ఈ మేరకు

ఏపీ స్పెషాలిటీ ఆసుపత్రుల అసోసియేషన్ ప్రకటనను విడుదల చేసింది. తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన సీఎం చంద్రబాబు, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ట్రస్ట్ వైస్ ఛైర్మన్ సుధాకర్, ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి, వైద్య సేవ ట్రస్ట్ సీఈవోకు అసోసియేషన్ కృతజ్ఞతలు తెలియజేసింది.

# రాజధానిపై జాప్యం వద్దు.. సిఎం

(మొదటి పేజి (తరువాయి)

స్పష్టం చేశారు. నిర్మాణాల్లో వేగంతో పాటు.. నాణ్యత ప్రమాణాలను పక్కాగా పాటించాలని ఆదేశించారు. పనుల పురోగతిపై ప్రతి 15 రోజులకోసారి సమీక్షిస్తానని చెప్పారు. ప్రస్తుతం వర్షాల కారణంగా నిర్మాణ పనుల్లో కొంత మేర జాప్యం జరిగినా.. రానున్న రోజుల్లో దాన్ని భర్తీ చేసేలా నిర్మాణాల్లో వేగం పెంచాలని చంద్రబాబు సూచించారు. ఇంకా కొన్ని నిర్మాణ సంస్థలు వర్క్ ఫోర్స్, మెషీనరీని పూర్తి స్థాయిలో కేటాయించలేదని... ఇలా ఉన్న సంస్థలు తమ పనితీరు మెరుగుపరుచుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇక రాజధాని భవనాల నిర్మాణాలకు అవసరమైన గ్రావెల్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని అన్నారు. ఈ మేరకు గనుల శాఖతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి చెప్పారు.

రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లలో రైతులకు ఇబ్బందులు రానివ్వొద్దు..

రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఎంతవరకు పూర్తైందని సీఎం ఆరా తీశారు. రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ల విషయంలో రైతులకు ఏ మాత్రం ఇబ్బందులు రానివ్వొద్దని మంత్రి నారాయణ, అధికారులను సీఎం ఆదేశించారు. ఈ సందర్భంగా రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన వివరాలు అధికారులు అందించారు. ఇంకా 2,471 మంది రైతులకు రిటర్నబుల్ ప్లాట్లను రిజిస్ట్రేషన్లు చేయాల్సి ఉందని.. ఇవి కూడా చిన్నపాటి సాంకేతిక, రైతుల వ్యక్తిగత అంశాల కారణంగా పెండింగులో ఉన్నాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. తాను కూడా త్వరలోనే రాజధాని రైతులతో సమావేశమవుతానని ముఖ్యమంత్రి తెలిపారు. రాజధానిలో నిర్మాణాలకు ఎంతటి ప్రాధాన్యమిస్తున్నామో..గ్రీనరీ, సుందరీకరణ, పరిశుభ్రతకు కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. రాజధానుల గార్డెనింగ్, బ్యూటిఫికేషన్ వంటి వాటిల్లో ఎలాంటి రాజీపడొద్దని సూచించారు. ఇక ప్రైవేట్ సంస్థలు చేపట్టే నిర్మాణాలు కూడా ఐకానిక్ మోడల్లో ఉండేలా చూడాలని ఆయా సంస్థల ప్రతినిధులను కోరాలని అధికారులకు సూచించారు. అమరావతికి వరల్డ్ క్లాస్ సిటీ లుక్ రావాలంటే హైరెయిజ్ బిల్డింగులు ఉండాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణ, సీఆర్డీఏ, ఏడీసీఎల్, ఫైనాన్స్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, వివిధ కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వైభవంగా నదీమ తల్లికి హారతి

## సారె సమర్పించిన ఆలయ ఈవో ఎం శ్రీనివాసరావు
## సాంప్రదాయబద్ధంగా నదీమతల్లికి ప్రత్యేక పూజలు

**శ్రీశైలం, అక్టోబర్ 31 :**

అక్టోబర్ 22 నుంచి నవంబరు 21వతేదీ వరకు కార్తీకమాసోత్సవాలు శ్రీశైల దేవస్థానం వారు ఎంతో ప్రతిష్టాత్మకంగా కొనసాగుతాయి. ఈనేపథ్యంలో కార్తీక మాస రెండవ శుక్రవారం రోజు సాయంత్రం పాతాళగంగ వద్ద కృష్ణమ్మహారతి కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో కృష్ణవేణి నదీమతల్లికి పూజాదికాలు, సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతాళగంగ వద్ద నెలకొల్పబడిన కృష్ణవేణి నదీమతల్లి విగ్రహానికి నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో భక్తాదులు భారీ సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించి హారతి కార్యక్రమానికిముందు లోకకల్యాణాన్నికాంక్షిస్తూ అర్చకస్వాములు సంకల్పాన్ని పటించారు. అనంతర కార్యక్రమము నిర్విఘ్నంగా కొనసాగాలని మహాగణపతి పూజను నిర్వహించారు. సంప్రదాయాన్ని అనుసరించి నదీమతల్లికి ఏకహారతి, నేత్రహారతి, బిల్వహారతి, నాగహారతి, పంచహారతి, సద్యోజాతాది పంచహారతులు, కుంభహారతి, నక్షత్రహారతి, రథహారతి, కర్పూరహారతులు కార్యక్రమాన్ని అర్చక స్వాములు వైభవంగా నిర్వహించారు

దశహారతులు – ఫలితాలు

1. ఏకహారతి : ఈ ఏకహారతిని దర్శంచడం వలన భగవదనుగ్రహం లభిస్తుంది. అభీష్టాలు సిద్ధిస్తాయి.
2. నేత్రహారతి : ఈ నేత్రహారతి దర్శనం వలనఆరోగ్యం చేకూరుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది.
3. బిల్వహారతి : ఈ బిల్వహారతి దర్శనం వలన సకల ఐశ్వర్యాలు కలుగుతాయి.
4. నాగహారతి : ఈ నాగహారతి దర్శనం వలన సమస్త సర్పదోషాలు తొలగిపోతాయి. వివాహం, సంతానం కలుగుతాయి.
5. పంచహారతి : ఈ పంచహారతిని దర్శించడం వలన ప్రకృతి వైపరీత్యాలు నివారించబడుతాయి. సకలశుభాలు కలుగుతాయి.
6. సద్యోజాతాది : పంచహారతులు : ఈ సద్యోజాతాది పంచహారతి దర్శనం వలన శివకటాక్షం సిద్ధిస్తుంది. సకల సంపదలు కలుగుతాయి.
7. కుంభహారతి : ఈ కుంభహారతిని దర్శించడం వలన సకల శుభాలు కలుగుతాయి. సంపదలు కలుగుతాయి.
8. నక్షత్రహారతి : ఈ నక్షత్రహారతిని దర్శించడం వలన జాతకదోషాలన్ని తొలగిపోతాయి. చేపట్టిన పనులలో విజయం లభిస్తుంది.
9. రథహారతి : ఈ రథహారతిని దర్శించడం వలన పాపాలన్నీ పరిహరింపబడుతాయి. కోరికలన్నీ నెరవేరి సౌభాగ్యం, సౌఖ్యం చేకూరుతాయి.
10. కర్పూరహారతి : ఈ కర్పూరహారతి దర్శనం వలన మనోదోషాలు తొలగిపోతాయి. భగవంతుని కరుణాకటాక్షాలు లభిస్తాయి. ఈ విశేష కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి ఎం శ్రీనివాసరావు దంపతులు ఆలయ అర్చక వేద పండితులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.









# తుఫాన్ .. తక్షణ సాయం



(మొదటి పేజి (తరువాయి)

పంట నష్టం, ఆస్తి నష్టం అంచనాలని పకడ్బందీగా రూపొందించాలని మార్గనిర్దేశర చేశారు. అలాగే, పిఠాపురం నియోజకవర్గంలో వరద ప్రభావిత పరిస్థితిపై ఆరా తీశారు పవన్ కల్యాణ్. కాకినాడ జిల్లా తీర ప్రాంత గ్రామాల రక్షణపై బృహత్ ప్రణాళిక రచించాలని సూచించారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకీ న్యాయం జరగాలని ఆదేశించారు. ఏలేరు కాలువ గట్టు పటిష్టతకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆజ్ఞాపించారు. మల్లవరం పత్తి రైతులకు న్యాయం చేయాలని పవన్ కల్యాణ్ సూచించారు.

# ఎమ్మెస్ రాజుపై చర్యలేవీ

(మొదటి పేజి (తరువాయి)

ఇలాంటి వాళ్ల టిడిపిలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుగా ఉన్నారో చంద్రబాబు ఒకసారి సర్వేచేయాలి. ఎమ్మెస్ రాజును పార్టీ నుంచి చంద్రబాబు సస్పెండ్ చేయాలి. భగవద్గీత, హిందూ ధర్మం పై మరొకరు వ్యాఖ్యలు చేయకుండా ఉండాలంటే ఎమ్మెస్ రాజు పై చర్యలు తీసుకోవాలి అని చంద్రబాబును రాజా సింగ్ డిమాండ్ చేశారు.

'భగవద్గీత ప్రజల బతుకులను మార్చలేదు' అంటూ ఓ కార్యక్రమంలో ఎంఎస్ రాజు వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో దుమారం రేగింది. ఈలోపు ఆయన అనుచరులు ఆ వ్యాఖ్యను సమర్థించే ప్రయత్నం చేశారు. అయితే విశ్వహిందూ పరిషత్ సైతం ఆగ్రహం వ్యక్తం చేయడం.. క్షమాపణలకు డిమాండ్ చేయడంతో ఆయన దిగిరాక తప్పలేదు.

# ప్రశ్నిస్తే దుష్ప్రచారమా..!

(మొదటి పేజి (తరువాయి)

బాహ్య ప్రపంచానికి చూపించాను. చంద్రబాబు, నారా లోకేష్ను ప్రశ్నిస్తే తనపై దుష్ప్రచారం చేశారు. కల్తీ మద్యం కేసులో సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశాను. నార్కో ఆనాలసిస్ టెస్టుకు సిద్ధమే. నేను ఏ తప్పు చేయలేదని దుర్గమ్మ సాక్షిగా కుటుంబసభ్యులతో కలిసి ప్రమాణం చేశా. బాధ్యత కలిగిన ముఖ్యమంత్రి చట్టాన్ని, వ్యవస్థల్ని చేతుల్లోకి తీసుకుంటారా? గన్నవరం ఎయిరోపోర్టులో జనార్ధన్ రావుకు రెడ్కార్పెట్ వేసి స్వాగతం పలికారు. రిమాండ్లో ఉన్న జనార్ధనావు వీడియోని ఎవరు విడుదల చేశారని ప్రశ్నించారు.

# ఇందిరా గాంధీకి నివాళి



**పుట్టపర్తి, అక్టోబర్ 31 :**

భారతరత్న ఇందిరా గాంధీ గారి స్మృతిదినం సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసి అధ్యక్షురాలు కొర్రపాడు భరణి నివాళు లర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ నిర్మాణంలో అజరామరమైన పాత్ర పోషించిన వ్యక్తి ఇందిరమ్మ అన్నారు.ఆమె ధైర్యం, దూరదృష్టి, నాయకత్వం దేశాన్ని శక్తివంతమైన దిశగా నడిపించాయని తెలిపారు.దేశం పట్ల ఆమె చూపిన అంకితభావం, కష్టసమయంలో తీసుకున్న నిర్ణయాలు తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని వివరించారు. పేదల హృదయాల్లో ఇందిరమ్మగా కొలువైవున్న ఆమె ఈ భూమి వున్నంత వరకు ఆమె ఖ్యాతి అజరాఅమరమని పేర్కొన్నారు.

# నేడు సిఎం రాక.. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు



**తలుపుల, అక్టోబర్ 31 :**

నేడు శ్రీ సత్యసాయి జిల్లాలోని తలుపులమండలం పెద్దన్నగారిపల్లి గ్రామానికి సిఎం చంద్రబాబు రానున్నారు. ఈనే పథ్యంలో జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్‌ల పర్యవేక్షణలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాటు చేశారు. పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి సిఎం చంద్రబాబు వస్తున్నారని, అధికారులందరూ ప్రణాళికా బద్ధంగా వ్యవహరించి సిఎం పర్యటనను విజయవంతం చేద్దామని కలెక్టర్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్, జేసి మౌర్య భరద్వాజ్ లతో కలిసి తలపుల మండలం పెద్దన్నగారిపల్లి గ్రామంలో హెలిపాడ్, ప్రజా వేదిక సభాస్థలి ప్రాంతాలలో కలెక్టర్, ఎస్పీ విస్తృతంగా పర్యటించి చేయాల్సిన ముందస్తు ఏర్పాట్లు, బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి మ్యాపులను పరిశీలించి, ప్రజా వేదిక, విఐపి, గ్రామస్తులు, మీడియా గ్యాలరీ సీటింగ్, త్రాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాట్లు, పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటు, అలాగే అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. అధికారులందరూ సమన్వయంతో ప్రణాళిక బద్ధంగా ఏర్పాట్లను ముందస్తుగా పూర్తిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని పేర్కొన్నారు.అలాగే ముఖ్యమంత్రి పర్యటించే ప్రదేశాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతాచర్యలు ఏర్పాటు చేయడంతో పాటు, ఉమ్మడి జిల్లా నుండి ప్రజా ప్రతినిధులు ప్రజలు ముఖ్యమంత్రి పర్యటనకు విచ్చేయనున్న సందర్భంగా ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, వాహనాల పార్కింగ్ కొరకు అనువైన ప్రదేశాలను ఏర్పాటు చేసి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్, ఎస్పీ ఆదేశించారు. అనంతరం వివిధ అంశాలలో అధికారులతో సమీక్షించి తగు సూచనలు సలహాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, డిఆర్డిఏ, డ్వామా, పంచాయతీ, వైద్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీరు సరఫరా చేయమంటే..
# ఉన్న కుళాయిలు తొలగించారు

## మున్సిపల్ సిబ్బంది తీరుపై ప్రజలు ఆగ్రహం..

**గుత్తి, అక్టోబర్ 31:**
మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి సమస్యలు పరిష్కరించమంటే ఉన్న కొళాయిలను సిబ్బంది తొలగిస్తున్నారని వివిధ కాలనీల ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెరుగుతున్న ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రజలకు అదనపు తాగునీటి కుళాయిలను ఏర్పాటు చేయాల్సిన మున్సిపల్ అధికారులు ఉన్న వాటిని తొలగించడం ఎంతవరకు సబబు అంటూ పలువురు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో వివిధ విభాగాల అధికారులు ఎవరికి వారుగా వ్యవహరిస్తూ సిబ్బందితో తమ అనుకూలమైన వర్గాలకు అనుకూలంగానూ వ్యతిరేక వర్గాలకు వ్యతిరేకంగాను పనులు చక్కబెడుతూ పంతం నెగ్గించుకుంటున్నారు. అందర్నీ సమన్వయపరిచి ప్రజలకు ఇబ్బందులు లేకుండా సమస్యలను పరిష్కరించాల్సిన మున్సిపల్ కమిషనర్ ప్రేక్షక పాత్ర పోషిస్తున్నాడంపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని కోట వీధికి వెళ్లే ఎస్సీ కాలనీలో గత 15 రోజులుగా తాగునీరు సరఫరా కావటం లేదని కాలనీవాసులు శుక్రవారం పత్రిక విలేకరుల ముందు వాపోయారు. తమ కాలనీకి ఇప్పటికే మున్సిపల్ అధికారులు సక్రమంగా తాగునీటిని సరఫరా చేయడం లేదని అయితే గత పది రోజుల క్రితం మున్సిపల్ అధికారులు తమ సిబ్బందితో ఎక్కడికి వచ్చి తాగుతుంటే సమస్య పరిష్కారానికి పాత పైపులైను తొలగిస్తున్నామని వాటి స్థానంలో కొత్త కొళాయిలను ఏర్పాటు చేయటానికి చర్యలు తీసుకుంటున్నామని నేరుగా ఇళ్లకే నీటిని సరఫరా చేస్తామని చెప్పారన్నారు. వారి మాటలు నమ్మి తాము తమ ఇళ్ళ ముందు గతంలో ఏర్పాటు చేసిన తాగునీటి పైప్లైన్ మున్సిపల్ సిబ్బంది తొలగిస్తున్న ప్రేక్షక పాత్ర వహించమన్నారు. అయితే గత 15 రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో వారిని ప్రశ్నించగా కులాయి కనెక్షన్లు ఇవ్వాలంటే ఒక్కొక్కరు 4000 రూపాయలు చెల్లించాలని వెంటనే తాగునీటి కనెక్షన్ ప్రతి ఇంటికి ఇస్తామంటూ హుకుం జారీ చేశారన్నారు. తాము ఇళ్లకు కుళాయిలు కావాలని అడగలేదని ఉన్న పలంగా 4000 రూపాయలు చెల్లించాలంటే కూలి పనులు చేసుకునే తాము ఎలా చెల్లించగలమంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించాల్సిందిగా మున్సిపల్ అధికారులకు విన్నవించుకున్న సంబంధిత డి ఈ మరియు మున్సిపల్ కమిషనర్లు వేరువేరు సమాధానాలు చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారు తప్ప సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. దీంతో తాము గత 15 రోజులుగా తాగునీరు లభించక నానా అవస్థలు పడుతున్నామన్నారు. అదే క్రమంలో మున్సిపల్ అధికారులు తమ ఇళ్ళ ముందు తవ్విన గుంతలు తమకు తీవ్ర అభ్యంతరంగా మారాయని ఇల్లు నుండి బయటకు రావాలన్నా లోపలికి వెళ్లాలన్న కాలనీ ప్రజలు నానా అవస్థలు పడుతున్నామన్నారు. మున్సిపల్ అధికారులు సిబ్బంది తమ సమాస పరిష్కారం పట్ల తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని కాలనీకి చెందిన ప్రముఖ న్యాయవాది మనోహర్ బాబు ఎంఆర్పిఎస్ నాయకులు సత్య తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అందులో భాగంగానే కొద్ది మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో గల పబ్లిక్ కోలాలను మున్సిపల్ అధికారులు ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా కాలనీ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే ప్రభుత్వం పబ్లిక్ కులాలను తొలగించమని తమకు ఆదేశాలు జారీ చేసిందని ప్రతి ఒక్కరు ఇంటికి కుళాయి కనెక్షన్లు తీసుకోవాల్సిందని మున్సిపల్ డి ఈ సమాధానం ఇచ్చారు. ప్రభుత్వాలు ప్రతి ఇంటికి తాగునీటి కొళాయిలనుఏర్పాటు చేస్తామని ప్రజల అవసరాలకు అనుగుణంగా ఎక్కడికక్కడ అదనపు వీధి కులాయం ఏర్పాటు చేయడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ మున్సిపల్ అధికారులు మాత్రమే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఈ విషయంపై తాము న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని న్యాయవాది మనోహర్ బాబు హెచ్చరించారు.


నిరసన తెలుపుతున్న కాలనీవాసులు


ఎస్సీ కాలనీలో ఇళ్ల ముందు ఇటీవల మున్సిపల్ అధికారులు తొలగించిన పాత తాగునీటి పైప్ లైన్ గుంతలు


మున్సిపాలిటీ అధికారులు తొలగించిన పబ్లిక్ కుళాయి


రోడ్డుపై ప్యాచ్ వర్క్ పనులు చేస్తున్న దృశ్యం

## రోడ్డు ప్యాచ్ వర్క్ పనులు ప్రారంభం

**తాడిపత్రి, అక్టోబర్ 31:**
తాడిపత్రి పట్టణంలోని ప్రధాన రోడ్డులలో ఏర్పడ్డ గుంతలను పూడ్చేందుకు శుక్రవారం తెల్లవారుఝామున ప్యాచ్ వర్క్ పనులను అధికారులు చేపట్టారు. పట్టణంలోని సీబీ రోడ్, నంద్యాల రోడ్ లలో గుంతలు ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతుండటంతో, తాడిపత్రి శాసన సభ్యులు జేసీ అస్మిత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు నందలపాడు రైల్వే ఫ్లై ఓవర్ నుండి సిబి రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ మీదుగా నంద్యాల రోడ్డు వరకు మధ్యలో ఉన్న గుంతలను తక్షణమే పూడ్చాలని సంబంధిత అధికారులను ఆదేశించడం జరిగింది. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వాహనాలకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండ ప్యాచ్ వర్క్ పనులు ప్రారంభించారు.

## పంపిణీకి సిద్ధంగా పప్పుసెనగ విత్తనం

**ఆత్మకూరు, అక్టోబర్ 31:**
మండలంలోని రైతు సోదరులకు కావాల్సిన పప్పుశనగ విత్తనాలు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉంచామని ఏఓ తెలిపారు. ఆత్మకూరు మండలానికి గాను 100 క్వింటాళ్ల విత్తనం అందుబాటులో ఉందని అందులో భాగంగా పడమటి యాలేరు, ముట్టాల, ఆత్మకూరుకు సంబంధించిన రైతులు రైతు సేవ కేంద్రంలో పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డ్ తీసుకువెళ్లి నమోదు చేయించుకోవాలని కోరారు . పప్పు శనగ పూర్తి ధర రూ.7800లు రాయితీ ధర. రూ.1950లు అన్నారు. రైతులు తమ వాటాకింద రూ.5850 ం చెల్లించాలన్నారు. ఈ అవకాశాన్ని రైతు సోదరులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఉపాధి పనుల పరిశీలన

**ఆత్మకూరు, అక్టోబర్ 31:**
మండల పరిధిలోని బి.యాలేరు, సనప, తోపుదుర్తి మొదలగు గ్రామాలలో ఎంపీడీవో జీ.లక్ష్మీనరసింహ ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడి చెన్నకేశవ, డిప్యూటీ ఎంపీడీవో సాదిక్ వలి ఉపాధి హామీ పథకము ద్వారా జరుగుతున్న పనులను పరిశీలించి సమీక్షించారు. ఉపాధి హామీ పథకం కూలీలకు జరుగుతున్న ఈకేవైసీ సర్వే ని పరిశీలించారు. అందరూ తప్పక ఈకేవైసీ చేయించుకోవాలని, లేకపోతే వారికి చెల్లింపులు చేయడం కష్టమవుతుందన్నారు. అందరూ తప్పక ఈకేవైసి చేయించుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ వెంకట నారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్లు రామాంజనేయులు శివ పంచాయితీ కార్యదర్శులు మురళి, కమల్,పోతులయ్య,తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో జీ.లక్ష్మీనరసింహ, ఏపీడి చెన్నకేశవ,

## గ్రామాల్లో పారిశుద్ధ్యం పనుల పరిశీలన

**ఆత్మకూరు, అక్టోబర్ 31:**
మండల పరిధిలోని బి.యాలేరు, సనప, తోపుదుర్తి మొదలగు గ్రామాలలో గ్రామపంచాయతీల ద్వారా జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను, తాగునీటి సరఫరా పథకాల నిర్వహణను పరిశీలించారు. గ్రామాలలో గ్రామపంచాయతీ ద్వారా చేపట్టే కార్యక్రమాలలో ప్రజలు కూడా సహకరించి వారి ఇళ్ల వద్దనున్న రోడ్లలోనూ కాలువల్లోనూ చెత్తను వేయరాదని, తడి చెత్త పొడి చెత్త విడివిడిగా గ్రామపంచాయతీ సిబ్బందికి అందజేసి సహకరించాలనికోరారు. రోడ్లమీద బట్టలు ఉతకడం, పాత్రలు కడిగి ఆ నీటిని రోడ్లపై వేయడం వల్ల రోడ్లు, పరిసరాలలో అపరిశుభ్రత ఏర్పడుతుందని దీనివల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు సహకరించి ఇలాంటి పనులు రోడ్లపై ఎవరు చేయరాదని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జీ లక్ష్మీనరసింహ, డిప్యూటీ ఎంపీడీవో సాదిక్ వలి, పంచాయితీ కార్యదర్శులు మురళి ,కమల్ పోతులయ్య తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్యం పనులు పరిశీలిస్తున్న అధికారులు

## ఆవులెన్నలో పౌరహక్కుల దినోత్సవం

### ఎస్సీ,ఎస్టీ చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి..
### చట్టాలను దుర్వినియోగం చేయరాదు..
### డిప్యూటీ తహసీల్దార్ మధుసూదనరావు..

**బెళుగుప్ప, అక్టోబర్ 31:**
ఎస్సీ, ఎస్టి చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆ చట్టాలను దుర్వినియోగం చేయరాదని డిప్యూటీ తహసిల్దార్ మాధవరావు పేర్కొన్నారు. శుక్రవారం బెళుగుప్ప మండలం పరిధిలోని ఆవులెన్న గ్రామంలో అధికారులు పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ తహసిల్దార్ మాధవరావు మాట్లాడుతూ గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ వ్యక్తుల హక్కులను కాపాడటానికి, వివక్షను నిరోధించడానికి, ఈ చట్టాలను చేసినప్పటికీ దుర్వినియోగం చేయకుండా నిరోధించడం కూడా ముఖ్యమన్నారు. ఎస్సీ ఎస్టీల (అట్రాసిటీల నిరోధక చట్టం) 1989 షెడ్యూల్డ్ కులాలు మరియు షెడ్యూల్డ్ తెగలపై జరిగే దారుణాలను నిరోధించడానికి వారి హక్కులను రక్షించడానికి ఈ చట్టం రూపొందించబడిందన్నారు. ఎవరైనా అన్యాయానికి గురైతే పోలీసులను ఆశ్రయిస్తే, వారు న్యాయం చేస్తారన్నారు. గ్రామాల్లో వెట్టి చాకిరి, బాల కార్మికులను వేధిస్తుంటే, బాల్య వివాహాలను చేస్తుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో కక్షలకు ఘర్షణలకు పాల్పడకుండా ఉండాలన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను గురించి ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ మాధవరావు, వీఆర్వో ఎర్రిస్వామి, హౌసింగ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఏఎన్ఎం, అంగన్వాడి కార్యకర్త, గ్రామస్తులు పాల్గొన్నారు..


పౌర హక్కుల దినోత్సవంలో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ మాధవరావు

## ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం

### సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి..

**బెళుగుప్ప, అక్టోబర్ 31:**
బెళుగుప్పలోని సన్ రైజర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం స్వాతంత్రత్య సమరయోధుడు, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ మారెన్న అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత విశ్రాంతి ఉపాధ్యాయుల సిరిపురం నాగరాజు హాజరై విద్యార్థులతో కలిసి సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారత స్వాతంత్ర ఉద్యమంలో ధైర్య సాహసాలు ప్రదర్శించిన వజ్ర సంకల్పుడు నిష్కలంక దేశభక్తుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని పేర్కొన్నారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత దేశానికి మొదటి హెూం మంత్రిగాను మరియు ఉప ప్రధానిగా మంత్రిగా పనిచేసి దేశానికి ఎనలేని సేవలు అందించారన్నారు. దేశంలోని 500 సంస్థానాలకు పైగా విలీనం చేసి దేశాన్ని ఏకతాటిపైకే నడిపించిన మహెూన్నతమైన వ్యక్తి అన్నారు. అందుకే ఆయనను ఉక్కుమనిషి అని పిలుస్తారన్నారు. గుజరాత్ లో 182 మీటర్ల దేశంలోనే ఎత్తైన విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు.
ఆయన దేశానికి చేసిన సేవలను గుర్తిస్తూ 2014 నుండి ప్రతి సంవత్సరం అక్టోబర్ 31 వ తేదీన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని జాతీయ ఐక్యత దినోత్సవం గా జరుపుకుంటారన్నారు. అనంతరం విద్యార్థులు కూడా సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవిత విశేషాలను దేశానికి చేసిన సేవలను వివరించారు. వకృత్వ పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ మారెన్న, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత విశ్రాంతి ఉపాధ్యాయులు సిరిపురం నాగరాజు పాఠశాల డైరెక్టర్లు నాగభూషణ తిప్పేస్వామి ఉపాధ్యాయ బృందం సంధ్య, భారతి, శైలజ, నాగవేణి, రషీద, మమత, ఎర్రిస్వామి, శిరీష, మాలశ్రీ, అంజలి, విద్యార్థులు పాల్గొన్నారు..



సన్ రైజర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి నిర్వహిస్తున్న కరస్పాండెంట్ మారెన్న, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సిరిపురం నాగరాజు

## పురమిత్ర సోషల్ మీడియా యాప్‌పై అవగాహన కార్యక్రమం

**గుత్తి, అక్టోబర్ 31:**
గుత్తి మునిసిపాలిటీ లోని ఆర్.పిలు, మహిళా సంఘాల ప్రతినిధులతో పురమిత్ర సోషియల్ మీడియా యాప్ , ప్రజ్ఞా యాప్‌లపై మెప్మా టి.యం.సి శ్రీనివాసరెడ్డి, సి.ఓలు చంద్ర శేఖర్ షరీఫ్ అవగాహన కల్పించారు.కమిషనర్ బి.జబ్బార్ మియా సూచనల మేరకు ఆర్.పిలు తమ పరిధిలో స్మార్ట్ ఫోన్ ఉన్న సభ్యులతో ం పురమిత్ర యాప్ డౌన్లోడ్ చేయించి అందులో గల ప్రభుత్వ సర్వీసులైన శానిటేషన్, వాటర్ సప్లై, వీధి లైట్లు, డ్రైనేజీ, మహిళా సంఘాల గ్రీవెన్సులలెు, గ్రీవెన్సులు పంపడంపై అవగాహన కల్పించారు. మునిసిపల్ పరిధిలో పురమిత్ర యాప్ ద్వారా ప్రజలు తమ ఇంటి పన్ను, వాటర్ ట్యాక్స్, ఎంక్రోచ్మెంట్స్ ఫీజు చెల్లించే విధానం గురించి వివరించారు. యాప్ ద్వారా ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకుని పన్ను చెల్లింపులో మునిసిపాలిటీ అభివృద్ధికి తోడ్పడేలా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిబ్బంది, ఆర్.పి లు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆర్పీలు మహిళా సంఘాల ప్రతినిధులు

## ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు

**కనేకల్, అక్టోబర్ 31 :**
ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలు పోలీసులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కనేకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు,లెక్చరర్లు కనేకల్ పోలీస్ స్టేషన్ వద్ద రాష్ట్రీయ ఏకతా దివస్ కార్యక్రమంపై ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం కనేకల్ ప్రొబేషనరీ సబ్ ఇన్స్పెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరము అక్టోబర్ 31వ తేదీన సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదినం సందర్భంగా రాష్ట్రీయ ఏకతా దివాస్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. దేశానికి హెూం మంత్రిగా సేవలు అందించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ నిప్పులాంటి మనిషిగా, ఉక్కుమనిషిగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. దేశం కోసం తమ ప్రాణాలు సైతం బలిపెట్టడానికి సిద్ధమయ్యి పోరాడిన వ్యక్తులలో సర్దార్ వల్లభాయ్ పటేల్ అగ్రగన్యుడు అన్నారు. అందుకే ఆయనను ఉక్కు మనిషిగా పిలుచుకుంటున్నమన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన నడిచిన దారిలోనే ప్రతి పౌరుడు దేశ ఐక్యత, దేశ సమగ్రభద్రత కాపాడే దిశగా ప్రతి పౌరుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశం కోసం పోరాడే విషయంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయరాదని అదే నిజమైన దేశభక్తిని విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. ఈ రాష్ట్రీయ ఏకతా దివస్ కార్యక్రమం నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వము మరియు అనంతపురం జిల్లా ఎస్పీ, కళ్యాణదుర్గం డి.ఎస్.పి రాయదుర్గం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పర్యవేక్షణ ఆదేశాలతోనే నిర్వహించినట్లు ఆయన తెలిపారు. అనంతరం రన్ ఫర్ యూనిటీ ర్యాలీ కార్యక్రమం పోలీస్ స్టేషన్ నుండి పురవీధుల గుండా ఆర్టీసీ బస్టాండ్ ప్రాంత కూడలికి చేరుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శంకర్ రెడ్డి హెడ్ కానిస్టేబుల్ చంద్రమోహన్ లెక్చరర్లు రామాంజనేయులు, వెంకటేశులు, ఆంజనేయులు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు


రాష్ట్రీయ ఏకతా దివస్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్సై పోలీసులు, లెక్చరర్లు, విద్యార్థినీ విద్యార్థులు



రాష్ట్రీయ ఏక్తా దివస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినీ, విద్యార్థులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న పోలీసులు ,లెక్చరర్లు

## నూతన గృహాల కోసం దరఖాస్తుల స్వీకరణ

### హౌసింగ్ ఏఈ మారుతి..

**పామిడి, అక్టోబర్ 31:**
ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీన్ 2.0 పథకం కింద నూతన గృహాల మంజూరు కోసం అర్హులైన లబ్ధిదారుల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు హౌసింగ్ ఏఈ మారుతి శుక్రవారం తెలిపారు. లబ్దిదారుడు తమ జీవిత బాగస్వామి ఆధార్ కార్డులు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు అనుసంధానమైన బ్యాంకు ఖాతా పుస్తకం, ఆధాయ, కుల దృవీకరణ పత్రాలు, పొజీషన్ సర్టిఫికెట్ లేనిపక్షంలో రిజిస్టర్ పత్రం, జాబ్ కార్డు దరఖాస్తుతో అందజేయాల్సి ఉందన్నారు. హౌసింగ్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్, సచివాలయల్లో అర్హులైన లబ్దిదారులంతా గృహాల మంజూరు కోసం దరఖాస్తు చూసుకోవాలని హౌసింగ్ ఏఈ మారుతి వెల్లడించారు.




సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఆర్డీవో శ్రీనివాసులు

## తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

### ఆర్డీవో శ్రీనివాసులు..

**గుత్తి, అక్టోబర్ 31:**
గుత్తి తాసిల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం గుంతకల్లు ఆర్డీవో శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయానికి చేరుకున్న ఆయన తాసిల్దారు పుణ్యవతి తో కలిసి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే రైతుల పట్ల ప్రజల పట్ల రెవెన్యూ కార్యాలయం సిబ్బంది బాధ్యతగా వ్యవహరించి సమస్యల పరిష్కారంలో సమర్థవంతంగా పనిచేయాలి అన్నారు. భూ సమస్యల పరిష్కారం లోను రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీలను ఎటువంటి తప్పులు జరగకుండా రికార్డులు ఆధారంగా రైతులకు న్యాయం చేయాలన్నారు. విధుల నిర్వహణ పట్ల సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ పుణ్యవతి డిప్యూటీ తాసిల్దారు సూర్యనారాయణ తో పాటు ఆర్ ఐ లు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

## రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**యాడికి, అక్టోబర్ 31:**
యాడికి మండలం పరిధిలో రేపు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. తేరన్నపల్లిలోని 220 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లో మరమ్మతులు, కొత్త బ్రేకర్ ఏర్పాటు కారణంగా ఈ అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ అధికారులు కోరారు.



రోడ్డుపై గుంతలు పూడుస్తున్న దృశ్యం

# సొంత ఖర్చులతో రోడ్డుకు మరమ్మతులు

**మల్‌రెడ్డిపల్లి గ్రామ ప్రజలు..**

**తనకల్లు, అక్టోబర్ 31:**
తనకల్లు మండల పరిధిలోని మల్‌రెడ్డిపల్లి పంచాయతీ నడిమికుంటపల్లి, సుబ్బరాయన పల్లి ,రత్నగిరి గ్రామాల ప్రజలకి సరైనా రోడ్డు లేనందున మల్‌రెడ్డిపల్లి సచివాలయం వెళ్లాలంటే సుమారు మూడు కిలోమీటర్లు వెళ్లాలి. సరైన రోడ్డు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారుల చుట్టూ తిరిగి తిరిగి కాళ్ల రగడమే తప్ప మాకు ఒరిగిందేమి లేదన్నారు. అదేవిధంగా కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ప్రాంతం అతి సమీపంలో ఉన్న చాకవేలకు వెళ్లాలన్నా అక్కడకి కూడా మట్టి రోడ్డు గుండానే వెళ్లాలి. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ అధికారులకు రాజకీయ నాయకులకు ఎన్నిసార్లు అర్జీలు ఇచ్చినా రోడ్డు దుస్థితి మారలేదన్నారు. తమ తలరాత మారలేదన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యను పట్టించుకోవడం లేదని అన్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప ఊరి రోడ్డు దుస్థితి ఏ మాత్రం మారలేదన్నారు. దీంతో తామే చందాలు వసూలు చేసుకొని జెసిపి ద్వారా గుంతలు ఉన్నచోట మట్టి వేసి రోడ్డుకు మరమ్మతులు వేసుకుంటున్నామని తెలిపారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ ఊరికి రోడ్డు మంజూరు చేయాలని వేడుకుంటున్నారు.



పెద్దన్న వారి పల్లి వద్ద ట్రయల్ నిర్వహిస్తున్న హెలికాప్టర్

# హెలికాప్టర్ ట్రయల్ రన్

**తలుపుల, అక్టోబర్ 31:**
రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం తలుపుల మండలం లోని పెద్దన్నవారిపల్లి రానున్నారు. ఈసందర్భంగా శుక్రవారం సాయంత్రం అధికారులు హెలికాప్టర్ ట్రయల్ రన్ నిర్వహించారు. హెలికాప్టర్ పెద్దన్న వారి పల్లి వద్ద తాత్కాలిక హెలిప్యాడ్ సమీపంలో చక్కర్లు కొట్టడంతో స్థానికులు చూసేందుకు ఎగబడ్డారు.

# రెవెన్యూ అధికారి ముందు 14 మంది బైండోవర్

**రోళ్ల, అక్టోబర్ 31 :**
స్థానిక రెవిన్యూ అధికార్యాలయంలో శుక్రవారం 14 మంది ఎక్సైజ్ కేసులున్నా ముద్దాయిలను రెవిన్యూ ఇన్స్పెక్టర్ గిరియప్ప ముందు బైండొవర్ చేశారు. ఎక్సైజ్ సీఐ మురళీ కిషోర్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల రెవిన్ ఇన్స్పెక్టర్ గిరియప్ప సమక్షంలో బైండోవర్ చేశారు.మళ్లీ అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు తప్పావన్నారు. ఈకార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కస్నే నాయక్ కానిస్టేబుల్ మల్లికార్జున పాల్గొన్నారు.




ఆర్ఐ గిరియప్ప ముందు బైండొవర్ చేసిన అధికారులు

# నేడు శ్రీ కృష్ణ దేవరాయలు విగ్రహం భూమి పూజ

**రావుడీ రాయల్స్ సంఘం అధ్యక్షుడు మాస్టర్ నరసింహప్ప..**

**అగళి, అక్టోబర్ 31:**
బలిజ కులస్తుల ఆరాధ్య దైవం శ్రీకృష్ణదేవరాయలు విగ్రహ ప్రతిష్ఠ భూమిపూజ శనివారం మధ్యాహ్నం 12:00 గంటలకు మడకశిరలోని అమరాపురం రోడ్ శంకరప్పబావి రోడ్ సర్కిల్‌లో నిర్వహించనున్నారు. అగళి మండలంలోని బలిజ కులస్తులు అన్నదమ్ములు అక్క చెల్లెలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టిడిపి నాయకులు రావుడి రాయల్స్ సంఘం



అధ్యక్షులు మాస్టర్ నరసింహప్ప కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమావేశానికి ముఖ్య అతిథులుగా మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ఉమ్మడి జిల్లాలోని బలిజ నాయకులు,బలిజ కుల ప్రజా ప్రతినిధులు,పెద్దలు నియోజకవర్గంలోని బలిజ సోదరులు పాల్గొంటున్నారు. కనుక మండలంలోని బలిజ కులస్తులు పాల్గొనాలని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాస్టర్ నరసింహప్ప కోరారు.

# సంపద సృష్టిస్తానంటూ మోసమేనా..

**మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ సిగ్గుచేటు..**
**అమ్మకానికి ప్రభుత్వ ఆస్తులు..**
**పేదల ఆరోగ్య శ్రీ, పెన్షన్ల కోత**
**కూటమి ప్రభుత్వం నిర్వాకం ..**
**వైకాపా కోటి సంతకాల సేకరణ..**

**బత్తలపల్లి, అక్టోబర్ 31:**
ఎన్నికల సమయంలో మోసపూరిత వాగ్దానాలు ఇచ్చి సంపద సృష్టిస్తానని ప్రభుత్వ ఆస్తులను ధారాదత్తం చేసేందుకు కంకణం కట్టుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని శ్రీ సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్ కుమార్, ధర్మవరం నియోజకవర్గ కల్చరల్ విభాగం అధ్యక్షుడు షరాబ్ యోగానంద ఆచారి, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామి రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోనూ, అప్పరాచెరువు గ్రామంలోనూ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు మెడికల్ కళాశాలలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు కంకణం కట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం ద్వారా రాష్ట్రంలోని వైద్య విద్యార్థులు తీవ్ర నష్టం చవి చూస్తారని అన్నారు. ఎన్నికల సమయంలో సంపద సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని చెప్పిన నేతలు నేడు ఆ దిశగా అడుగులు వేయడం లేదని విమర్శించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి



అప్పరాచెరువులో సంతకాలు సేకరిస్తున్న వైఎస్ఆర్సిపి నాయకులు



బత్తలపల్లిలో సంతకాలు సేకరిస్తున్న వైఎస్ఆర్సిపి నాయకులు

ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆరోగ్యశ్రీ ద్వారా కోట్ల మందికి ఉచితంగా వైద్య సదుపాయాలు అందించడం జరిగిందని,నేడు జబ్బు చేసిన ప్రమాదాలకు గురైన ఎలాంటి ఆరోగ్యశ్రీ పథకాలు వర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూలి నాలి చేసి సంపాదించిన డబ్బును పేద, బడుగు, బలహీన వర్గాల నుంచి దోచుకునే భాగమే ఆరోగ్యశ్రీ ఎత్తివేతని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో విద్య,వైద్యానికి పెద్ద ప్రాధాన్యత ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. నాడు నేడుతో లక్షలాదిమంది విద్యార్థులకు ఉన్నత విద్యను అందించిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దేనని చెప్పారు. ప్రతి పథకంలోనూ కోతలు విధిస్తూ పేద, బడుగు, బలహీన వర్గాలకు అందని ద్రాక్షాల సంక్షేమ పథకాలను చేరవేస్తున్న కూటమి ప్రభుత్వంను ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. గడచిన16 నెలల్లో పేదలకు అందిస్తున్న పెన్షన్లలో కూడా కోతల విధించిందన్నారు. వికలాంగులపై తమ ప్రతాపం చూపి వస్తున్న పెన్షన్ నిలుపుదల చేశారని విమర్శించారు. వైద్యులు ధ్రువీకరించిన వికలాంగులను సైతం పెన్షన్ రానివ్వకుండా అడ్డుకట్ట వేసి వివిధ రకాల పరీక్షలు చేయించుకోవాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులకు తిరగలేక నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చల్ల కృష్ణమనాయుడు, బొమ్మా ప్రసాద్ రెడ్డి, బండి వీరనారప్ప, రాంభూపాల్ రెడ్డి, బోయ సాంబశివ, మాజీ డీలర్ ఆదెప్ప, బ్యాళ్ళ పెద్దయ్య,కోటి తిరుపాలు, సంజీవ నాయుడు, మండల నరసింహులు, చైతన్య రెడ్డి, షాషు, పెద్దన్న, రామాంజనేయులు, శ్రీరాములు, రాఘవ, సురేష్, లోకేష్, అప్పరాచెరువులో ఈశ్వరయ్య, వెంకట రంగారెడ్డి, బాల నరసింహులు, రాజ వీరారెడ్డి, దివాకర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ఓబులేసు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ లక్ష్మీదేవి విగ్రహ ప్రతిష్ఠ

**భక్తులకు అన్నదానం..**

**అమరాపురం, అక్టోబర్ 31:**
మండల పరిధిలోని వీరాపురం గ్రామంలో శ్రీ వీరాంజనేయ స్వామి , శ్రీ అజయ్ స్వామి దేవస్థానం వద్ద నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ లక్ష్మీ దేవి విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం తెల్లవారుజామున వేద పండితులచే వైభవంగా జరిగింది. ప్రధాన అర్చకులు జోగప్ప స్వామి, సిద్ధార్థ స్వామి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నేత్రోనెలన, స్థిర బిందు, ప్రతిష్టాపన, అమ్మవారిని పూలతో అలంకరణ చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చిన భక్తులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. మహా మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. భక్తులకు అన్నదానం అందజేశారు. శ్రీ లక్ష్మీదేవి విగ్రహ ప్రతిష్టాపనలో వైయస్సార్ సి.పి.రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్ పాల్గొని, విశేష పూజలు నిర్వహించారు. శ్రీ అజయ్‌స్వామికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అర్చకులు జోగప్ప స్వామి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్, ఉప సర్పంచ్ సిద్దేశ్వర, ను శాలువాలు, పూలమాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



శ్రీలక్ష్మీదేవికి పూలతో అలంకరణ
శ్రీ అంజయ్య స్వామికి పూలతో అలంకరణ



శ్రీ అంజయ్య స్వామికి పూజలు నిర్వహిస్తున్న రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్. భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

# విద్యా హక్కు చట్టం సవరించండి

**ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయించాలి..**
**ఫ్యాప్టో నాయకులు..**

**నంబులపూకుంట అక్టోబర్ 31:**
సర్వీస్‌లో ఉన్నటీచర్లను టెట్ నుండి మినహాయించేలా చట్టంలో మార్పులు తెచ్చుటకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకి సిఫార్సు చేయాలని డిఆర్వో సూర్య నారాయణ రెడ్డి, డిఇఓ కిష్టప్ప కు ఫ్యాప్టో పక్షాన వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఫ్యాప్టో చైర్మన్ గజ్జల హరిప్రసాద్ రెడ్డి, సెక్రటరీ జనరల్ గౌస్ లాజం మాట్లాడుతూ ఆర్టీఈ చట్టం మరియు ఎన్ సి టి సి మార్గదర్శకాలను అనుసరించి 2010 మునుపు సర్వీసులో నియామకమైన టీచర్లు కూడా టెట్ పరీక్ష పాస్ కావాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. ఉపాధ్యాయులు సర్వీసులో కొనసాగాలన్నా పదోన్నతులు పొందాలన్నా రెండేళ్లలోపు టెట్ ఉత్తీర్ణత సాధించాలన్న సుప్రీంకోర్టు నిబంధనతో ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. ఉపాధ్యాయ వృత్తి లోనికి వచ్చే మునుపే అన్ని అర్హతలు కలిగి ఉండి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ పోటీ పరీక్షలో ఉత్తీర్ణులైన ఉపాధ్యాయులకు పాతిక సంవత్సరాల తర్వాత నీవు వృత్తిలో కొనసాగాలంటే టెట్ పరీక్ష రాసి ఉత్తీర్ణులు కావాలని లేకపోతే ఉద్యోగం వదులుకోవడమో లేక స్వచ్ఛంద పదవీ విరమణ చేయాలని సుప్రీంకోర్టు



డీఈఓ కిష్టప్పకి వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

తీర్పు ఇవ్వడం అన్యాయమన్నారు. టెట్ వలన ఉపాధ్యాయులకు బోధనా నైపుణ్యాలు పెరిగే అవకాశం లేదు. దీనివల్ల ఇటు ఉపాధ్యాయులకు గాని అటు విద్యార్థులకు గాని ఏ మాత్రం ఉపయోగం లేదని ఇదొక నిరుపయోగమైన ప్రయోగం, అశాస్త్రీయమైనదని తెలిపారు. విద్యా హక్కు చట్టము అమలులోకి వచ్చిన తరువాత కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వివిధ సందర్భాలలో ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇన్సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయింపు కోరుతూ ఉపాధ్యాయ సంఘాలు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయడం జరిగిందని తక్షణం రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టంలో సవరణలు తెచ్చి టెట్ నుండి ఇన్ సర్వీస్ టీచర్లకు మినహాయంపు ఇచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఇటీవల కొత్తచెరువు మండలం కేసాపురం ప్రాథమిక పాఠశాలలో పనిచేయుచున్న శ్రీనాథ్ రెడ్డి సస్పెన్షన్ ఎత్తివేయాలని ఫ్యాప్టోపక్షాన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జయ చంద్రారెడ్డి, ఏపీటీఎఫ్ 257 చంద్ర, ఏపీటీఎఫ్ 1938 బడా హరి ప్రసాద్ రెడ్డి, ఆప్టా వెంకట నాయుడు, వైయస్సార్టిఏ రమణారెడ్డి, శివకుమార్, ప్రకాష్ రెడ్డి, ఎర్రి స్వామి, సుబ్బారెడ్డి, ప్రతాప్ రెడ్డి, రాజగోపాల్, రాజశేఖర్, రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డిఆర్ఓ సూర్యనారాయణ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో నాయకులు

# ప్రజలకు అందుబాటులో ఉండాలి

**సకాలంలో సేవలు అందించాలి..**
**జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ..**

**బత్తలపల్లి, అక్టోబర్ 31:**
ప్రజలకు అందుబాటులో ఉండి, మెరుగైన సేవలు అందించాలని జిల్లా ప్రజా పరిషత్ అధ్యక్షులు బోయ గిరిజమ్మ సూచించారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె అధికారులతో సమావేశమై, ప్రజలకు సకాలంలో హాజరై అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. తనిఖీలో భాగంగా, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నరసింహనాయుడుతో మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించారు. మొత్తం 81 అభివృద్ధి పనులకు గాను, 67 పనులు పూర్తి చేసినట్లు అధికారులు ఆమెకు



ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ చైర్పర్సన్ బోయగిరిజమ్మ

వివరించారు.?ఉపాధి హామీ సిబ్బందిని పిలిపించి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. హార్టికల్చర్ పథకం కింద 66 మంది రైతులకు 255 ఎకరాలలో పండ్ల మొక్కలు నాటించినట్లు అధికారులు వివరించారు. అదేవిధంగా, హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీరు విశ్వనాథ్తో హౌసింగ్ స్కీమ్‌ల పురోగతిని సమీక్షించారు.? ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ క్రిష్టప్ప, అసిస్టెంట్ ఇంజనీరు విశ్వనాథ్, సహాయ ప్రోగ్రామ్ అధికారి అశోక్, కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

# వేడుకల్లో పాల్గొన్న టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల

**రోళ్ల, అక్టోబర్ 31 :**
రోళ్ళ మండలం అలుపునపల్లి గ్రామంలో సింగిల్ విండో ప్రెసిడెంట్ దాసి రెడ్డి బంధువుల గృహప్రవేశానికి తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరైనారు. ఈసందర్భంగా సత్యనారాయణ స్వామి కి భక్తిశ్రద్ధలతో పూజలు చేయించారు. అనంతరం తీర్థప్రసాదం వినియోగం చేపట్టారు. అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి, రాష్ట్ర వక్కలిగా సాధికార కన్వీనర్ వీఎం పాండురంగప్ప సింగిల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ జెకె ఈరన్న, ఏపీఐఐసీ డైరెక్టర్ రామకృష్ణ, మాజీ క్లస్టర్ ఇంచార్జ్ భరత్, మాజీ ఎంపీపీ కృష్ణప్ప, పాండురంగప్ప,యూనిట్ ఇంచార్జ హేమంత్ రాయల్స్, వెంకటేష్, క్లస్టర్ కో కన్వీనర్ మారుతీ,మండల బీసీ సెల్ అధ్యక్షులు నాగరాజు, టి ఎన్ టి యూ సి జిల్లా ఉపాధ్యక్షులు మూర్తి,యువ నాయకులు ఆనంద్, వైస్ సర్పంచ్ రాజు, నాయకులు రామచంద్రప్ప, రవికుమార్, హనుమంత రాయప్ప, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



నాయకులను సన్మానించిన దృశ్యం



సత్యనారాయణ పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

# మండలంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలి





**మాజీ ఎంపీపీ విజయ్ కుమార్ రెడ్డి ..**
**మేడా శంకర్..**

**తలుపుల, అక్టోబర్ 31:**
తలుపుల మండలంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఈ ప్రాంత యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిందిగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను కోరనున్నట్లు పెద్దన్నవారిపల్లికిచెందిన తెలుగుదేశం నాయకులు మాజీ ఎంపీపీ విజయ్ కుమార్ రెడ్డి, మేడా శంకర్ తెలిపారు. ముఖ్యంగా మండలంలో వేలాది ఎకరాలలో మామిడి తోటలు ఉన్నందున ఇక్కడ జ్యూస్ ఫ్యాక్టరీనిఏర్పాటు చేస్తే రైతులకు అనుకూలంగా ఉంటుందని , మామిడి ధరలు నిలకడగా లేక రైతులు నష్టపోతున్నారని జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు అయితే రైతులను నష్టాల నుండి బయట పడేయ వచ్చని అలాగే చాలామందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అంతేగాక ఈ ప్రాంతం నుండి సుదూర ప్రాంతాల్లోని బెంగళూరు పులి వెందులతదితర ప్రాంతాల్లో రెడీ మేడ్ గార్మెంట్స్ లో పనిచేసేందుకు మండల వాసులు వలస వెళుతున్నారని ఈ ప్రాంతంలో రెడీ మేడ్ గార్మెంట్స్ పరిశ్రమలు ఏర్పాటు చేస్తే స్థానికంగా ఉపాధి లభిస్తుందని ఇక్కడే ప్రజల వలస వెళ్లే అవకాశాలు ఉండవని వారు తెలిపారు. అలాగే టైల్స్ పరిశ్రమలు సైతం ఏర్పాటు చేసి పలువురికి ఉపాధి కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇక మండలంలోని హంద్రీ నీవా 16 వ ప్యాకేజీ ఎర్రసాని వారిపల్లి సమీపంలో ఉన్న టన్నులు వద్ద నుండి ఎనిమిది కిలోమీటర్లు ప్రత్యేకంగా హంద్రీ నీవా యొక్క కాలువ తీసి ఆ ప్రాంతాల్లో ని 10 చెరువులకు కృష్ణా జలాలను తో నింపి నింప వచ్చని అలాగే అదే కాలువ నుండి పెద్దన్నవారిపల్లి కొత్త చెరువును సైతం నేరుగా జల అనే కృష్ణా నది జలాలతో నిం పవచ్చనీ ,ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని వారు తెలిపారు.

# రేణుకయల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ

**పాల్గొన్న జెడ్పిటిసి అనంతరాజు ..**

**రోళ్ల, అక్టోబర్ 31 :**
మండల పరిధిలోని గుడ్డుగురికి గ్రామంలో శుక్రవారం రేణుకా యల్లమ్మ దేవత విగ్రహాన్ని శాస్త్రోతకంగా ఘనంగా నిర్వహించారు. నాలుగు రోజులపాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం దేవత కు మహాగణపతి హెూమము నవగ్రహ ముఖ పురస్వర, ప్రతిష్టహెూమం, తత్వ హెూమం, కళాహెూమం,అంగహెూమం, ప్రాణ ప్రతిష్ట జ్వాలా దర్శన మహా పూర్ణాహుతి కలశోతక మార్జన మహా మంగళారతి తీర్థ ప్రసాదం వినియోగం చేపట్టారు.గుడ్డుగురికి గ్రామం లో రేణుక ఎల్లమ్మ దేవత ప్రతిష్టాపన చేయడం పట్ల గ్రామస్తులను జడ్పీటీసీ అనంతరాజు అభినందించారు. ఈసందర్భంగా అతిథులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అనంతరాజు మండల పార్టీ కన్వీనర్ నరసింహారెడ్డి న్యాయవాది రంగనాథ్ వైఎస్ సర్పంచి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



యల్లమ్మకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

# కాంట్రాక్టర్లు సకాలంలో పని చెయ్యాలి

## పనుల నాణ్యత విషయంలో రాజీ లేదు ..
## హైకోర్టు బెంచ్ ఏర్పాటును సీఎం దృష్టికి తెచ్చాం..
## మంత్రి టీజీ భరత్..

**ఆదోని, అక్టోబర్ 31:**
కర్నూలు నగరంలో మున్సిపల్ కార్పొరేషన్ లో వివిధ నిర్మాణం పనులలో టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు సకాలంలో పనులు పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రి టీజీ భరత్ స్పష్టం చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో టీజీ భరత్ మాట్లాడుతూ పనుల నాణ్యత విషయంలో కూడా ఎటువంటి రాజీ ప్రసక్తి లేదని కాంట్రాక్టర్లు నాణ్యతతో నిర్మాణం పనులు చేయాలని స్పష్టం చేశారు. మెడికల్ కాలేజీ వద్ద మలుపులో ఉన్న దుకాణాలను పడగొట్టడానికి ఎలాంటి అభ్యంతరం లేకుండా హైకోర్టు తీర్పు ఇచ్చినట్లు స్పష్టం చేశారు. హైకోర్టు తీర్పును సమావేశంలో ఆయన చదివి వినిపించారు. మలుపులో చాలా ప్రమాదాలు జరిగాయని ఆ ప్రాంతంలో రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థి మరణించడంతో మెడికల్ విద్యార్థులు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు కూడా చేశారని చెప్పారు. అందువల్ల ఆ ప్రాంతంలో ఉన్న దుకాణాల యజమానులతో మాట్లాడి దుకాణాలు పడగొట్టిన తగిన న్యాయం చేస్తామని వారికి చెప్పినప్పటికీ వారు వినకుండా హైకోర్టుకు వెళ్లారని చెప్పారు. ఇప్పుడు హైకోర్టు కూడా దుకాణాలు పడగొట్టడానికి అభ్యంతరం అభ్యంతరం చెప్పడం లేదని అందువల్ల యజమానులతో చర్చించి వారితో ఏకాభిప్రాయము కుదిరిన తర్వాత వారికి తగిన విధంగా ఏర్పాటు చేసి దుకాణాలను పడగొట్టడం జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. కర్నూలు నగరాన్ని గ్రేటర్ సిటిగా మార్పు చేయడానికి అన్ని చర్యలు తీసుకున్నామని ఆయన చెప్పారు. గ్రేటర్ సిటిగా మార్పు చేయడానికి ప్రజలు కూడా సహకారం అందించాలని ఆయన కోరారు. కర్నూల్ లో హైకోర్టు బెంచిని ఏర్పాటు చేయమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకొని రావడం కూడా జరిగిందని టీజీ భరత్ పేర్కొన్నారు. కాబట్టి హైకోర్టు బెంచి నిర్మాణం కూడా సాగుతుందని చెప్పారు. హైకోర్టు బెంచి ఎక్కడో నగరానికి దూరం కాకుండా నగర మధ్యలో ఉన్న ఏ, బి , సి క్యాంపుల ప్రాంతంలోనే పెద్ద భవనం నిర్మించేలా ముఖ్యమంత్రి కూడా సుముఖంగా ఉన్నారని ఆయన చెప్పారు. కాబట్టి కర్నూలు నగరం రూపురేఖలు మారి గ్రేటర్ సిటీగా రూపొందే విధంగా కృషి చేస్తానని ఆయన చెప్పారు.


మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

# కార్పొరేట్ల సేవలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

## పనిగంటలు పెంపునకు వ్యతిరేకంగా పోరాటం..
## నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి..
## ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు..

**ఆదోని, అక్టోబర్ 31:**
కార్పొరేట్ల సేవలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మునిగిపోయాయని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కె అజయ్ బాబు ఆరోపించారు. పనిగంటలు పెంపునకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని, నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలన్నారు. ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కె అజయ్ బాబు మాట్లాడుతూ 105ఏళ్ల క్రితం దేశంలో ఏర్పడిన మొట్ట మొదటి కార్మిక సంఘం, దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న సంఘం, ఏఐటీయూసీ దేశంలో మౌలిక సమస్యల పరిష్కారం కోసం, కార్మికుల హక్కుల కోసం, కార్మికుల రక్షణ కోసం పోరాటం చేసిన సంఘం ఏఐటీయూసీ అని తెలిపారు. 105వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాల్సిన బాధ్యత కార్మిక వర్గంపై ఉందన్నారు. ద్వారా పోరాటాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యవహారశైలి ఉందని , కార్పొరేట్ల సేవలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మునిగి తేలుతున్నాయని ఆరోపించారు. కార్మిక ఓట్లతో గద్దె నెక్కిన ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని ఆరోపించారు. 8 గంటల పనిదినాలు, 44 కార్మిక చట్టాలు, నాలుగు లేబర్ కోడ్లు ఉపసంహరించేందుకు కోసం పోరాటాలు చేసేందుకు 31వ తేదీన కార్మిక వర్గం ప్రతిజ్ఞ చేయాలన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సెంట్రల్ లేబర్ పాలసీ... ఆ నాలుగు లేబర్ కోడ్లను కార్మికుల సమస్యల పరిష్కారం, నాలుగు లేబర్ పాలసీలకు, వ్యతిరేకంగా కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ వర్కర్స్ ను రెగ్యులరైజ్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఓబి నాగరాజ్. ఏవైఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు ఏం గిరి మల్లప్ప పట్టణ అధ్యక్ష కార్యదర్శులు వైటి భీమేశ్ బి వెంకన్న. ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు హుసేని శిక్షావలి, మరియు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జాన్ బాబు శేఖర్ అన్న జాన్ బాబు శేఖర్ అన్న గుండంజి మహేష్ మరియు హమాలి ఉలిగి వర్కర్లుదితరులు పాల్గొన్నారు . యూనియన్ రామంజి ఆటో వర్కర్స్ యూనియన్ జోసఫ్,ఉలిగి తదితరులు పాల్గొన్నారు


జెండా ఎగరవేస్తున్న దృశ్యం

# వైభవంగా నిత్య సహాయమాత మహోత్సవం

## విగ్రహం ఊరేగింపు ..

**పెద్దకడబూరు, అక్టోబర్ 31 :**
పెద్దకడబూరు గ్రామంలోని ఆర్సీఎం చర్చి ఫాదర్ రెవరెండ్ రాజేంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం నిత్య సహాయమాత మహోత్సవం వైభవంగా జరిగింది. మేరిమాత విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో ప్రతిష్ఠించి క్రైస్తవ భక్తి గీతాలతో గ్రామ ప్రధాన రహదారి వెంబడి ఊరేగించారు. అనంతరం ఆర్సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ రెవరెండ్ రాజేంద్ర మాట్లాడుతూ సెప్టెంబర్ మాసం 8వ తారీఖు మేరిమాత జన్మదినాన్ని పురస్కరించుకుని యావత్ ప్రపంచ క్రైస్తవ్యం గొప్ప వేడుకను జరుపుకుంటుందన్నారు. తదనంతరం వచ్చే అక్టోబరు మాసంలో రోమన్ కథోలికలు ఆయా సంఘాల ఆధ్వర్యంలో ఇంటింటికి మేరిమాత ప్రార్థనలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. లోక రక్షకుని మాతగా తన చెంతకు చేరిన ప్రతి ఒక్కరి కోసం ప్రార్థనలు చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఆర్సీఎం చర్చి నందు మేరిమాత ఎన్నో అద్భుతాలు చేయడం ఆనవాయితిగా జరుగుతుందని పేర్కొన్నారు. మేరిమాత ధర్శనాలు ఎందరో చూడటం జరిగిందని ఆమె ప్రార్థనల ద్వారా అద్భుతాలు జరుగుతాయని సూచించారు. కొలుచేవారికి కొంగు బంగారంగా ఎన్నో ఆశ్చర్యకార్యాలు జరుగుతాయని తెలిపారు. ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు, మేరిమాత దళ సభ్యులు, అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.


ప్రత్యేక వాహనంలో మేరీమాత ఉత్సవమూర్తిని ఊరేగిస్తున్న దృశ్యం


లోక రక్షకుని మాతగా నిత్య సహాయమాత


ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం.
జాతీయ సమైక్యతా దినోత్సవ ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

# సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలు

## రన్ ఫర్ యూనిటీ నిర్వహించిన పోలీసులు ..

**పెద్దకడబూరు, అక్టోబర్ 31 :**
పెద్దకడబూరు గ్రామంలోని పోలీసు స్టేషన్ ఆవరణలో ఎస్సై నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో ఉక్కు మనిషి భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్ధార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి కోసిగి సీఐ మంజునాథ్, ఎస్సై నిరంజన్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పోలీసు స్టేషన్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ వరకు గ్రామ ప్రధాన రహదారి వెంబడి రన్ ఫర్ యూనిటీ నిర్వహించారు. సీఐ మంజునాథ్, ఎస్సై నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశ నేడు ఎవరి కారణంగా భారతదేశ మంతా సమైక్యంగా ఉందో స్వేచ్ఛతో ముందుకు వెళుతున్నామో అందుకు కారణమైన వ్యక్తి భారతదేశ తొలి హెూమ్ శాఖ మంత్రిగా పని చేసిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కొనియాడారు. భారతదేశంలో ఉన్న 560 సంస్థానాలను కలిపి భారతదేశం అంతా ఒకటిగా చేసిన మహానీయుడని ప్రశంసించారు. నిజాంలు స్వయం ప్రతిపత్తి కోరితే భారతదేశమంత సమైక్యంగా ఉండాలని భారతదేశంలో మీరంతా భాగస్వామ్యం కావాలని సూచించారన్నారు. భారతీయులందరూ శాంతియుతంగా, సామరస్యంగా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం జాతీయ సమైక్యతా దినోత్సవం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై శివరాములు, వ్యాయామ ఉపాధ్యాయులు దుబ్బన్న, పోలీసు సిబ్బంది, బీసీ హాస్టల్ ట్యూటర్ బొజ్జప్ప, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కోసిగి సీఐ మంజునాథ్


ఏక్ దివాస్ సందర్భంగా రన్ ఫర్ యూనిటీ నిర్వహిస్తున్న పోలీసులు
రన్ ఫర్ యూనిటీలో పాల్గొన్న సీఐ మంజునాథ్, ఎస్సై నిరంజన్ రెడ్డి

# కళాశాలల సమయానికి గ్రామాల నుంచి బస్సులు నడపాలి

## డిపో మేనేజర్ కార్యాలయం వద్ద విద్యార్థుల బైఠాయింపు

**ఆదోని, అక్టోబర్ 31:**
కళాశాలల సమయానికి గ్రామాల నుంచి బస్సులు నడపాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డి.ఎస్.ఎఫ్ ఆధ్వర్యంలో ఆదోని డిపో మేనేజర్ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డి.ఎస్.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ధనాపురం ఉదయ్ బాలు మాట్లాడుతూ వివిధ గ్రామాల నుండి అనేక మంది విద్యార్థులు కళాశాలలకు చదువుకోవడానికి ఆదోని పట్టణానికి వస్తున్నారు. కానీ విద్యార్థులకు సమయానికి బస్సు రాకపోవడంతో కడితోట జి.హూసల్లి బదినేహాళ్ కుంటానహాళ్ ఉప్పరహాళ్ ఈ గ్రామాల విద్యార్థులు రోజు చాలా ఇబ్బంది పడుతున్నటువంటి పరిస్థితి ఉందని అన్నారు .గతంలోనే ఆర్టీసీ అధికారులకు విద్యార్థులు తెలియజేశారు, మాకు సమయానికి బస్సు కావాలని కానీ స్పందించకపోవడంతో డి.ఎస్.ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు రోడ్డున బైఠాయించడం జరిగింది. అనంతరం టూ టౌన్ ఎస్సై రామనాథ్ నేను బస్సు వచ్చే విధంగా మాట్లాడుతానని అక్కడి నుండి విద్యార్థులను పిలుచుకొని ఆర్టీసీడిపో దగ్గరికి వెళ్లడం జరిగింది.. స్థానికంగా ఉన్నటువంటి డిపో అసిస్టెంట్ మల్లికార్జున ఈ విషయం పైన తక్షణమే సమయానికి బస్సు వచ్చే విధంగా అలాగే అదనంగా బస్సు ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు రహ్మాన్ ప్రతాప్ రెడ్డి, అభిషేక్ ,విజయ్, సాఫియ బేగం, రజినీ, తేజస్విని, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.


బస్సు కోసం బైఠాయించిన విద్యార్థులు


డిపో మేనేజర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

# ఘనంగా యూనిటీ ఫర్ రన్

**ఆదోని, అక్టోబర్ 31:**
సర్ధార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు, పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల చివరి రోజు సందర్భంగా అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ జాతీయ సమైక్యతను చాటుతూ కర్నూలు పోలీసులు యూనిటీ రన్ ఘనంగా నిర్వహించారు. రాష్ట్రీయ ఏక్తా దివాస్ సంధర్బంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు సివిల్ , ఎఆర్, ఎపిఎస్పీ, హెూంగార్డులు, క్రీడాకారులు, ఎన్‌సిసి విద్యార్డులు ఏక్తారన్‌లో పాల్గొన్నారు. ఐక్యతా పరుగు జిల్లా పోలీసు కార్యాలయం( కొండారెడ్డి బురుజు) నుండి ప్రారంభమై రాజ్ విహర్ కూడలి వరకు కొనసాగింది. ఈ రన్‌లో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన క్రీడాకారులకు కర్నూలు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా బహుమతులు అందజేశారు .
ఈ సంధర్బంగా కర్నూలు అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 31 న జాతీయ ఐక్యతా దినోత్సవం లేదా రాష్ట్రీయ ఏక్తా దివస్ జరుపుకుంటారన్నారు. పటేల్ భారతదేశాన్ని ఐక్యంగా ఉంచడంలో ఆయన చేసిన కృషి గురించి అవగాహన కల్పించడమే ఈ వేడుక యొక్క ప్రధాన లక్ష్యమన్నారు. భద్రత, సమగ్రత పరంగా అందరం కలిసి దేశాన్ని రక్షించుకుంటామని అక్టోబర్ 31ని ఐక్యతా దినంగా జరుపుకుంటున్నామన్నారు. దేశ సమైక్యతను, ఐక్యమత్యాన్ని కాపాడాతామని ఈ సందేశాన్ని అందరికి తెలియజేసే విధంగా అందరూ పెద్ద సంఖ్యలో యూనిటీ రన్‌లో పాల్గొనడం అభినందనీయమన్నారు. “ దేశం యొక్క ఐక్యత , సమగ్రత, భద్రతను కాపాడడానికి నన్ను నేను అంకితం చేసుకుంటానని నా తోటి వారందరిలో ఈ సందేశాన్ని వ్యాప్తి చేయడానికి తీవ్రంగా కృషి చేస్తానని నేను ప్రతిజ్ఞ చేస్తున్నాను. పటేల్ దార్శనికత మరియు చర్యల వల్ల సాధ్యమైన నా దేశం యొక్క ఏకీకరణ స్ఫూర్తితో నేను ఈ ప్రతిజ్ఞ చేస్తున్నాను. నా దేశం యొక్క అంతర్గత భద్రతను నిర్ధార్ధించడానికి నా స్వంత సహాకారం అందించాలని నేను నిర్ణయించుకున్నానని ఈ పై ప్రతిజ్ఞ ను అడిషనల్ ఎస్పీ అందరికి చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, కర్నూలు డిఎస్పీ బాబు ప్రసాద్, పోలీసువేల్ఫేర్ హాస్పిటల్ డాక్టర్ స్రవంతి, కర్నూలు పట్టణ సిఐలు, ఆర్ ఐలు, ఎస్సైలు, ఆర్ ఎస్సైలు, సివిల్ , ఎఆర్, ఎపిఎస్పీ, హెూంగార్డులు, క్రీడాకారులు, %చీజజ% విద్యార్డులు పాల్గొన్నారు.



యూనిటీ ఫర్ రన్‌ను జెండా ఊపి ప్రారంభించిన అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా



ఏక్తా దివాస్ వేడుకల్లో ప్రతిజ్ఞ చేస్తున్న కర్నూలు అదనపు ఎస్పి హుస్సేన్ పీరా



సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం


శ్రీ పెద్ద లక్ష్మమ్మ అవ్వ, చిన్న లక్ష్మమ్మ అవ్వలకు పట్టు వస్త్రాలు సమర్పించిన దృశ్యం

# శ్రీ పెద్ద లక్ష్మమ్మ అవ్వకు పట్టు వస్త్రాలు సమర్పణ

**పెద్దకడబూరు, అక్టోబర్ 31 :**
విశ్వవాసు నామ సంవత్సరం కార్తీకమాసం శుక్లపక్షం శుక్రవారం పెద్దకడబూరు గ్రామంలో వెలసిన శ్రీ పెద్ద లక్ష్మమ్మ అవ్వ చిన్న లక్ష్మమ్మ అవ్వలకు ఆదోని పట్టణానికి చెందిన మంగలి వరలక్ష్మి పట్టు వస్త్రాలు ఒడిబియ్యం సమర్పించారు. ఆలయ పూజారి నరసింహాచారి అమ్మవార్లకు జలాభిషేకం చేసి పట్టు వస్త్రాలు సమర్పించారు. ధూప దీప నైవేద్యంతో అమ్మవార్లను పూజించి మహా మంగళ హారతి గావించారు. అనంతరం పూజా కార్యక్రమానికి వచ్చిన భక్తులకు నైవేద్యం అందజేశారు.


కర్నూలు ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న కలెక్టర్ సిరి

# ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

## కలెక్టర్ ఏ. సిరి ..

**ఆదోని, అక్టోబర్ 31:**
కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి లో ముఖ్యమైన వార్డు ల్లో తిరిగి రోగులకు వైద్య సేవలు అందిస్తున్న తీరును పరిశీలించారు. ఎమర్జెన్సీ, సూపర్ స్పెషాలిటీ బ్లాక్, న్యూరో సర్జరీ, రెస్పిరేటరీ ఇన్ఫెక్షన్ యూనిట్, ఫిమేల్ ఆర్థో, మేల్ ఆర్థో తదితర వార్డులను పరిశీలించి రోగుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు.


కర్నూలు ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న కలెక్టర్ సిరి



రన్ ఫర్ యూనిటీలో పాల్గొన్న పోలీసు అధికారులు

# రన్ ఫర్ యూనిటీ

**ముద్దనూరు, అక్టోబర్ 31:**
సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 జయంతి (జాతీయ సమైక్యత దినోత్సవం) సందర్భంగా సిఐ దస్తగిరి ఆధ్వర్యంలో పోలీసులు ప్రజలు కలసి రన్ ఫర్ యూనిటీనిర్వహించారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు సంయుక్తంగా ఏకధాటి పై నడవడానికి కృషి చేసిన ఆయన సేవలు దేశానికి ఆదర్శం అని సీఐ దస్తగిరి అన్నారు. అలాగే సివిల్ సర్వీస్ కు మొదటిసారిగా పునాది వేసింది ఆ మహినీయుడైనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు స్థానిక యువకులు తదితరులు పాల్గొన్నారు.


ఆయుధాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసు అధికారులు


# ఆయుధాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన

**ముద్దనూరు, అక్టోబర్ 31**
పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా కడప రైల్వే పోలీసులు దేశ, రాష్ట్ర, ఆత్మ, రక్షణ కోసం ప్రతి ఒక్కరికి ఆయుధాలపై అవగాహన ఉండాలని దృక్పథంతో విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కడప రైల్వే డి.ఎస్.పి హర్షిత, సీఐ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులకు ఆయుధాలను ఉపయోగిస్తూ దేశ,ఆత్మరక్షణ ఎలా కాపాడుకోవాలని రైల్వే స్టేషన్లో ఓపెన్ హౌస్ అవగాహన చేశారు. కడప జ్ఞానవిహార్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి ప్రశంసా పత్రాలు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కడప రైల్వే ఎస్సై సునీల్ కుమార్ రెడ్డి, రైల్వే పోలీసులు తదితరులు పాల్గొన్నారు


సమావేశంలో మాట్లాడుతున్న ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

**రామాపురం, అక్టోబర్ 31:**
గ్రామాల్లో నెలకొన్న సమస్యల పైన ప్రజా ప్రతినిధులు పరిష్కారానికి కృషి చేయాలని ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, ఉడా చైర్మన్ సురేష్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పంద్గాల మడుగు, పిఎంకె తండా, గొరిదిమాకులపల్లి, బందార్లపల్లి, కొంగనపల్లి, రాజుపేట పంచాయతీలలో ముఖ్య నాయకుల సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు తీసుకెళ్లాలన్నారు. వారి యొక్క సమస్యలను నమోదు చేసుకొని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు,యూనిట్ ఇన్చార్జ్ లు కార్యకర్తల సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. పార్టీలో రాజకీయ విభేదాలను పక్కనపెట్టి రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలుపుకు సంసిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, మండల అధ్యక్ష మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనంద రెడ్డి, ఆంజనేయ రెడ్డి, నేతలు నరసింహులు, సీతాపతి రామ్మూర్తి, చలపతి ,చిన్న కృష్ణ, కృష్ణ నాయక్, గుర్రప్ప, వెంకట్రామే గౌడు, విశ్వనాథ్, రఘు, రవి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


శ్రీశైలంలో నదీ హారతి దృశ్యాలు



# ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి

**బద్వేల్, అక్టోబర్ 31:**
బద్వేల్ శ్రీ రాచపూడి నాగభూషణం డిగ్రీ , పీజీ (అటానమస్) కళాశాల జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా 5 ఆంధ్రా ఎన్.సి.సి. తిరుపతి బెటాలియన్ కల్నల్ అంజూ వాడ్వా ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా కళాశాల పరిపాలన అధికారి వెంకట సాయి కృష్ణ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ భారతదేశ ఉక్కు మనిషిగా ప్రసిద్ధి చెందిన ఒక ప్రముఖ భారతీయ స్వాతంత్ర్య సమరయోధుడు మరియు రాజనీతిజ్ఞుడు. ఆయన భారత స్వాతంత్ర్య సాధనలో కీలక పాత్ర పోషించారు, మరియు స్వాతంత్ర్యం తర్వాత భారతదేశంలో 500 పైగా సంస్థానాలను విలీనం చేయడంలో ముఖ్య భూమిక పోషించారు. అతను భారతదేశపు మొదటి ఉప ప్రధానమంత్రి మరియు హెూం మంత్రిగా కూడా పనిచేశారు ఆయన గొప్పతనాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. గత కొన్ని దశాబ్దాలుగా బద్వేల్ శ్రీ రాచపూడి నాగభూషణం డిగ్రీ , పీజీ (అటానమస్) కళాశాలలో విద్యార్థులకు ఎన్. సి. సి. లో శిక్షణను ఇప్పిస్తున్నారని ఇందులో భాగంగా 5ఆంధ్రా గర్ల్స్ ఆర్మీ ఎన్రోల్మెంట్ సెలెక్షన్స్ జరిగాయని తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఆర్మీ ఎన్రోల్మెంట్ జరగటం యాదృచికమని, 43 మంది విద్యార్థినులు ఆర్మీ ఎన్రోల్మెంటకి ఎంపికయ్యారని ఆయన తెలియజేశారు. ఈ ఎంపిక ప్రక్రియ లో 5ఆంధ్రా ఎన్. సి. సి. తిరుపతి బెటాలియన్ కల్నల్ అంజూ వాడ్వానాయబ్ సుబేదార్ నీరజ్ కుమార్ జీహా, హవాల్దార్ యం. రమేష్, కళాశాల ఎన్. సి. సి. , సి.టి.ఓ తులసి, కళాశాల ఎన్. సి. సి. లెఫ్టినెంట్ బాల ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.


పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

# వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

### అధికారులకు వినతిపత్రం.. అఖిలభారత రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్ మోహన్ రెడ్డి..

**దువ్వూరు, అక్టోబర్ 31:**
వర్షాలతో మండలంలో రైతులు తీవ్రంగా నష్టపోయారని అఖిల భారత రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్ మోహన్ రెడ్డి అన్నారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలంటూ తహసీల్దార్ సంజీవరెడ్డి, వ్యవసాయ అధికారి అమర్నాథ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దువ్వూరు మండలంలో రైతులు సాగుచేసిన వరిపంట నేలవాలు , పెద్ద జొన్నవరం, జిల్లెల్ల, కాన గూడూరు , మాచనపల్లె గ్రామాలలో రైతులు సాగుచేసిన పంటలు కుండునది ప్రాంతంలో రాజోలినుండి వచ్చిన తీవ్ర వరద నీటితో మునిగాయని వరి పంటకు తీవ్రంగా నష్టం వాటిల్లిందని అన్నారు. రామాపురం మీర్జాఖాన్ పల్లె , గొల్లపల్లె , గుడిపాడు, చల్లబసాయపల్లె, మనే రామ్ పల్లె, చిన్న సింగన పల్లె , మదిరేపల్లె , దారిని పల్లె, నీలాపురం, మూడిండ్ల పల్లె , ఎంకుపల్లె దువ్వూరు, తదితర గ్రామాలలో మినుము, కె.పి. ఉల్లి, వేరుశెనగ, మొక్కజొన్న పంటలు సాగు చేశారని, అక్టోబర్ నెలలో భారీగా వర్షాలు కురవడంతో పంటకు తేమశాతం ఎక్కువ పంట కుళ్ళిపోవడం జరిగిందని, వినతి పత్రంలో అధికారులను కోరారు తుఫాను ప్రభావిత గ్రామాలలో వేగంగా పర్యటించి ప్రజలకు అండగా నిలబడాలి. పంట నష్టం అంచనా కోసం సచివాలయ ఉద్యోగుల సహకారాన్ని తీసుకుని, క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న ప్రతి పైరు సాగు చేసిన రైతులకు న్యాయం జరిగేలా పంట నష్టాన్ని వెంటనే అంచనా వేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులకు అధిక మొత్తంలో పంట నష్ట పరిహారాన్ని తక్షణమే అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తక్షణం రైతులకు పంట నష్టపరిహారం వచ్చేలా చూడాలని అఖిల భారత రెడ్డి సంఘం ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో అమ్మిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, చిన్న అంకిరెడ్డి, సాయి కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న అఖిల భారత రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్ మోహన్ రెడ్డి

# మొంథా తుఫానుతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్..

**బద్వేల్, అక్టోబర్ 31:**
మొంథా తుఫాన్ ప్రభావంతో పంటలు దెబ్బతిన్న రైతులను వెంటనే ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం బద్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని గుండం రాజు పల్లెలో పంటలు నష్టపోయిన రైతులను జిల్లా సిపిఎం బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా సిపిఎం కార్యదర్శి జి చంద్రశేఖర్ మాట్లాడుతూ మరో నాలుగు రోజుల్లో కోత కోసేందుకు సిద్ధమైన వరి పంట తుఫాన్ ప్రభావంతో పూర్తిగా నీట మునిగిందని, పంటను నష్టపోయిన కుప్పాల సుబ్బారాయుడు, కుప్పాల వెంకటరమణ , గురి నాగయ్య, గురి నాగసుబ్బమ్మ, గురి ఆదిలక్ష్మి, గానుగపెంట రామలక్ష్మమ్మ, మోడం రామయ్య అనే రైతులను అడిగి వారి పొలాలలో కోతకు వచ్చిన వరిని నిండా మునిగిన పంటను చూసి ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతుల పంటలను అర్జెంట్ పరిశీలించాలని, నష్టపోయిన రైతులకు ఎకరాకు 35 వేలు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బద్వేల్ నియోజకవర్గం లో వేల ఎకరాల్లో పంట నీట మునిగిందని పేర్కొన్నారు. వ్యవసాయ అధికారులు గ్రామ వారీగా పంట నష్టం వివరాలు వెంటనే సేకరించాలని సూచించారు. ఉచిత పంట బీమా ఎత్తివేత వలన 60 లక్షల మంది రైతులు నష్టపోయారని విమర్శించారు. రైతులను వెంటనే ఆదుకోవాలని లేనిపక్షంలో సిపిఎం తరఫున రైతుల పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖరం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్వేష్, జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరి రెడ్డి, చాంద్ బాషా, సిపిఎం నాయకులు చిన్ని, వెంకటేష్, జకరయ్య, రఘు తదితరులు పాల్గొన్నారు.


వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర దివ్యాంగుల సాధికారత ఫోరం (డిఈఎఫ్) అధ్యక్షులు బిసి నాగరాజు

# దివ్యాంగుల సామాజిక సాధికారతే డిఈఎఫ్ లక్ష్యం

### నూతన కార్యవర్గం ఎన్నిక..

**ఎమ్మిగనూరు, అక్టోబర్ 31:**
దివ్యాంగుల సామాజిక సంక్షేమాభివృద్ధి సాధికారతే డిఈఎఫ్ లక్ష్యం అని రాష్ట్ర దివ్యాంగుల సాధికారత ఫోరం (డిఈఎఫ్) అధ్యక్షులు బిసి నాగరాజు అన్నారు. ఎమ్మిగనూరు దివ్యాంగుల కార్యాలయంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు, ఇబ్బందులు, మౌలిక సదుపాయాలు, వసతులు కల్పించాలని దివ్యాంగుల సాధికారతలో భాగంగా హక్కులు, రాయితీ, రిజర్వేషన్లు, నిధులు సాధన కోసం ఎమ్మిగనూరు తాలూకా, పట్టణ, మండలాల డిఈఎఫ్ నూతన కార్యవర్గ కమిటీ సభ్యులను ఎన్నుకున్నామన్నారు. నూతన కమిటీ సభ్యులు ఇటు దివ్యాంగులకు అటు ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులకు ఓ వారధిలా నిలుస్తారని తెలిపారు. రాష్ట్ర డిఈఎఫ్ ఉపాధ్యక్షులు కమతం వెంకటేష్ మాట్లాడుతూ నేడు అన్ని సామాజిక, శాస్త్ర, విద్య, వైద్య, ఉపాధి మొదలైన అన్ని రంగాల్లో దివ్యాంగులు సకలాంగులతో సమానంగా సత్తా చాటుతున్నారని కావున వారికి మెరుగైన జీవన ప్రమాణాలను అందించేలా పాలకులు, ప్రభుత్వ రంగ సంస్థలు సహకరించాలని పేర్కొన్నారు. తదనంతరం నూతన కార్యవర్గ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఎమ్మిగనూరు తాలూకా అధ్యక్షులుగా శాకం వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శులుగా డి.ఇస్మాయిల్, ఎం. రంగన్న, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా జీవండి ముస్తక్, ఇ.రాజశేఖర్ గౌడ్, ప్రచార కార్యదర్శిగా వి. చెన్నప్ప, ఇసి మెంబర్లుగా కె.బసవరాజు, జి. గోవిందు, ఇ.ఈరన్న గౌడ్, కె.నర్సింహులు, తాలూకా మహిళా కన్వీనర్ గా ఎం. లక్ష్మి, కో-కన్వీనర్ గా బి. సరోజమ్మ, టౌన్ కన్వీనర్ గా దూదేకుల ఇస్మాయిల్, కో-కన్వీనర్ గా సుదిగుండు రామదాసు, మండల కన్వీనర్ గా ఎం. రామకృష్ణ, కో-కన్వీనర్ గా సయ్యద్ ఉసేన్, నందవరం మండల కన్వీనర్ గా బి. భీమేష్, కో-కన్వీనర్ గా ఎన్. సురేష్, గోనెగండ్ల మండల కన్వీనర్ గా మంగలి రంగన్న, కో-కన్వీనర్ గా కె. శ్రీనివాసులు, సోషల్ మీడియా %ఉ% ఆఫీసు బాయ్ గా నర్సింహులు తదితరులను ఎన్నుకున్నారు.


రాష్ట్ర దివ్యాంగుల సాధికారత ఫోరం (డిఈఎఫ్) అధ్యక్షులు బిసి నాగరాజు ఆధ్వర్యంలో పతాకాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం. సమావేశంలో పాల్గొన్న దివ్యాంగులు

# కేపి ఉల్లిపంట పరిశీలన

### ఉద్యానశాఖ అధికారి రామకృష్ణ ..

**దువ్వూరు, అక్టోబర్ 31:**
దువ్వూరు మండలంలోని చిన్న సింగనపల్లె, మదిరేపల్లె, నీలాపురం గ్రామాలలో కెపి ఉల్లి తోటలను పరిశీలించిన ఉద్యాన అధికారి సి. రామ కృష్ణ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెపి ఉల్లి రైతులకు మురుగు నీరును సాధ్యమైనంత త్వరగా బయటకు పంపించాలన్నారు వారంవ్యవధిలో 2-3 సార్లు 6 గ్రాముల పోటాషియం నైట్రేట్ (13-0-45) లీటరు నీటికి కలిపి పంటపై పిచికారీ చేయాలన్నారు. సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని వక్రగ్రాము లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేసినట్లయితే మొక్కలు త్వరగా కోలుకుంటాయి అని తెలిపారు. ప్రధాన పొలంలో మొక్కలు వయస్సు 45 రోజుల లోపు ఉన్నట్లయితే పైపాటుగా ఎకరాకు 60 కిలోల యూరియా 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలని రామకృష్ణ తెలియజేశారు.


ఉల్లి పంటను పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారి రామకృష్ణ

# పోలీసుల ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ

**దువ్వూరు, అక్టోబర్ 31:**
సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి, జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా దువ్వూరు పోలీసు సిబ్బంది యువతతో కలిసి శుక్రవారం రన్ ఫర్ యూనిటీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎస్ఐ వినోద్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక భారతదేశాన్ని నిర్మించిన మహా నాయకులలో సర్దార్ వల్లభాయ్ పటేల్ ఒకరని, వ్యక్తిగత అభిప్రాయాలకన్నా దేశ సమైక్యత స్థిరత్వమే తనకు ముఖ్యమని ఆయన ఆచరణ చూపించారని ఎస్ఐ పేర్కొన్నారు. భారతదేశ పరిపాలన వ్యవస్థకు వెన్నుముక లాంటి అఖిల భారత సివిల్ సర్వీస్ను సర్దార్ వల్లభాయ్ పటేల్ రూపకల్పన చేశారని ఆయన తెలిపారు. పటేల్ గొప్ప పరిపాలనా కర్త ఆయన ఆశయ సాధనకు మనమంతా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రైని ఎస్ఐ జగదీశ్వర్రెడ్డి,ఏ ఎస్ ఐ సుబ్బయ్య, పోలీసు సిబ్బంది,యువకులు తదితరులు పాల్గొన్నారు.



రన్ ఫర్ యూనిటీలో పాల్గొన్న పోలీసులు, యువకులు

# తుఫాన్ సమయంలో అధికారుల పనితీరు భేష్

### హృదయపూర్వక అభినందనలు.. డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి ..

**బద్వేల్, అక్టోబర్ 31:**
తుఫాన్ సమయంలో అధికారుల పనితీరు భేష్ అని వారికి హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నామని డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో పలు గ్రామాల ప్రజలు రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. తుఫాన్ ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి, గ్రామాల వారీగా ప్రమాద ప్రాంతాలను గుర్తించి ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయడం, సహాయక బృందాలను ఏర్పాటు చేయడం ద్వారా అధికారులు సమర్థవంతంగా వ్యవహరించారన్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా వానల నడుమ కూడా. విధుల్లో నిబద్ధతతో పని చేసిన అధికారులు తీరు నిజంగా ప్రశంసనీయం. ప్రజల ప్రాణనష్టం జరగకుండా, ఆస్తి నష్టం తగ్గించే దిశగా వేగంగా చర్యలు తీసుకున్నారన్నారు. క్షేత్రస్థాయిలో పహారా కాస్తూ, ప్రజలతో నిరంతర పర్యవేక్షణ కొనసాగించిన అధికారుల సేవాభావం ప్రభుత్వ పరిపాలనకు ఆదర్శంగా నిలిచిందన్నారు. తుఫాన్ సమయంలో సహకరించిన పాత్రికేయ మిత్రులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి కడప జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో నిపలు గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్న సమయంలో, క్షేత్రస్థాయి పరిస్థితులను సోషల్ మీడియా ద్వారా, ఫోన్ ద్వారా పాత్రికేయ మిత్రులు ఎప్పటికప్పుడు తెలియ జేశారు. పాత్రికేయులు ప్రజల సమస్యలను వేగంగా పంచుకోవడం ద్వారా అధికారులతో సమన్వయం చేసుకొని తక్షణ చర్యలు తీసుకునే అవకాశం లభించిందన్నారు. మీరు అందించిన విలువైన సమాచారంతో పెద్ద ప్రమాదాలను అరికట్ట గలిగాము. ఇటువంటి సంక్షోభసమయంలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా వ్యవహరించిన పాత్రికేయ మిత్రుల సేవ నిజంగా ప్రశంసనీయం, జిల్లా అభివృద్ధి దిశగా కూడా ఇదేవిధంగా సహకారం కొనసాగించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటు న్నారు. ప్రజల రక్షణ కోసం పగలు, రాత్రి తేడా లేకుండా కృషి చేసిన ప్రతి అధికారులు, సిబ్బంది మరియు పాత్రికేయ మిత్రులకు పేరుపేరునా. హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



# ట్రాక్టర్ తిరగబడి రైతు దుర్మరణం

### కుమ్మరి వారి పల్లిలో విషాదం..

**అట్లూరు, అక్టోబర్ 31:**
ట్రాక్టర్ తిరగబడి వరి మడిలోనే రైతు దుర్మరణం చెందారు. ఈ విషాద ఘటన అట్లూరు మండలం చిన్నరాచపల్లె గ్రామంలో శుక్రవారం జరిగింది. కుమ్మరివారిపల్లి గ్రామానికి చెందిన దగ్గల అంజిరెడ్డి (53) ట్రాక్టర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో మాడపూర్ గ్రామపంచాయతీ కుమ్మరి వారి పల్లి గ్రామం నుండి దగ్గల అంజిరెడ్డి తన ట్రాక్టర్ ను నడుపుకుంటూ చిన్న రాచపల్లి బాలరాజు వెంకట సుబ్బరాజు పొలంలో దున్నుతుండగా ట్రాక్టర్ వరి మడిలో ఇరుక్కు పోయింది. దాన్ని బయటకు తీసేందుకు ప్రయత్నిస్తుండగా, పవర్ టిల్లర్ వెనక్కి బోల్తా పడింది. ప్రమాదవశాత్తు అంజిరెడ్డి కిందపడటంతో ఆయనపై టిల్లర్ పడి గట్టిగానొక్కేసింది. దీంతో అంజిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. భర్త మృతితో భార్య కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా శోకసముద్రంలో మునిగిపోయారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బద్వేల్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.




బోల్తాపడిన ట్రాక్టర్

# మాజీ జడ్పీ చైర్మన్ చెంచల్‌బాబు యాదవ్ జన్మదిన వేడుకలు

## ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్..

**ఉదయగిరి, అక్టోబర్ 31:**
మాజీ జడ్పీ చైర్మన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పొన్నెబోయిన చెంచల్‌బాబు యాదవ్ జన్మదిన వేడుకలు అభిమానుల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ హాజరయ్యారు. చెంచల్ బాబు యాదవ్‌కి పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సురేష్ మాట్లాడుతూ మాజీ జడ్పీ చైర్మన్ చెంచల్ బాబు యాదవ్ రాజకీయ రంగంలో విశేష సేవలందించిన నాయకుడని,ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఎల్లప్పుడూ ముందుండే వ్యక్తిగా గుర్తింపు పొందారని తెలిపారు.ప్రజా సేవ పట్ల ఆయనకు ఉన్న అంకితభావం,యువ నాయకులకు ప్రేరణగా నిలుస్తుందన్నారు.ఆయన భవిష్యత్తులో రాజకీయ రంగంలో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్ల జీవించి ప్రజలకు మరింత సేవ చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి కన్వీనర్ బయన్న, తెలుగుదేశం పార్టీ నాయకులు షేక్ రియాజ్, జల్సా యాదవ్, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేయించి పూలమాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.


టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పొన్నెబోయిన చెంచల్‌బాబు యాదవ్ ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సురేష్


ఎమ్మెల్యే సురేష్‌ను సన్మానించిన టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పొన్నెబోయిన చెంచల్‌బాబు యాదవ్

# నిరుపేదలు లేని రాష్ట్రాన్ని నిర్మించడమే చంద్రన్న లక్ష్యం

## లబ్దిదారులకు తోపుడు బండ్లు అందజేత .. కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి ..

**నెల్లూరు, అక్టోబర్ 31:**
నిరుపేదలు లేని రాష్ట్రాన్ని నిర్మించడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యం అని ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎక్సైజ్, ప్రొహిబిషన్ స్టేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా 8 కుటుంబాలను దత్తత తీసుకొని వారి జీవన ఉపాధి కోసం తోపుడు బండ్లను అందజేశారు. ఆ కుటుంబాలకు అండగా ఉంటామని అన్నారు. కావలి నియోజకవర్గ లో దాతలు ముందుకు వచ్చి పేదలను దత్తత తీసుకొని ఆర్థికంగా అభివృద్ధి పరిచాలని ఎమ్మెల్యే కోరారు. ఇలాంటి మంచి పి4 పథకం ద్వారా బంగారు కుటుంబాలను ప్రభుత్వం, ప్రయివేట్, ప్రజలు ఆర్థికంగా వెనుకబడిన వారిని దత్తతు తీసుకొని వారికీ విద్య, ఆరోగ్యం, ఆర్థిక,జీవన ఉపాధికి సహకారం అందించేలా తీసుకురావడం మంచి పరిణామం అన్నారు. దాతలు ముందుకు వచ్చి సహకారం అందిస్తే రాష్టంలో పేదవాడు ఉండరని తెలిపారు. 8 మందికి జీవన ఉపాధి కల్పించిన ఎక్సైజ్ సీఐ సుంకర శ్రీనివాసులు, ఎస్సైలు ప్రసన్న కుమార్, భాష వలి వారి సిబందిని ఎమ్మెల్యే అభినందించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పోతుగంటి అలేఖ్య, బోగోలు మండలం టిడిపి అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరావు,టిడిపి యువ నాయకులు రావి విజయ్, బిట్రగుంట వెంకట్రావు,వల్లేరి కిరణ్ కుమార్..పి ఫోర్ సభ్యులు సత్యానంద్ బృందం పాల్గొన్నారు.


లబ్దిదారులకు తోపుడు బండ్లను అందజేస్తున్న దృశ్యం

# చెంచలబాబాబు యాదవ్ జన్మదిన వేడుకలు

## ఎమ్మెల్సీ బీద రవిచంద్ర..

**నెల్లూరు, అక్టోబర్ 31:**
నెల్లూరు కిసాన్ నగర్‌లోని కళ్యాణ మండపంలో చెంచలబాబు యాదవ్ జన్మదిన వేడుకలు శుక్రవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, శాసనమండలి సభ్యులు బీదారవిచంద్ర పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.ఈ జన్మదిన వేడుకలకు జిల్లా నలుమూల నుండి టిడిపి నాయకుడు,బీసీ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాసనమండలి సభ్యులు బీదా రవిచంద్ర మాట్లాడుతూ మాజీ జడ్పీ చైర్మన్ టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ చెంచలబాబు యాదవ్ జన్మదిన వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. చెంచల బాబు యాదవ్ కు టిడిపిలో మంచి పదవి రావాలని మరింత అభివృద్ధి చెందాలని కోరుకుంటు న్నామన్నారు. అష్ట ఐశ్వర్యాలతో నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటు న్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, టిడిపి నాయకులు సుమన్, పాములు రమణయ్య, ఆనంగి వెంకటరమణయ్య, టిడిపి నాయకులు కార్యకర్తలు బీసీసంఘాల నాయకులు,కుటుంబ సభ్యులు శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.




చెంచల్‌బాబు యాదవ్ జన్మదినం సందర్భంగా కేక్ కోస్తున్న నేతలు

# దేశ సమైక్యతకు ప్రతీక సర్దార్ పటేల్

## సర్దార్ పటేల్ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం విక్రమ సింహపురి యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు..

**నెల్లూరు, అక్టోబర్ 31:**
ఉక్కు మనిషి, దేశ సమైక్యతా శిల్పి సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని శుక్రవారం నెల్లూరులో ఘనంగా నిర్వహించారు. విక్రమ సింహపురి యూనివర్సిటీ జాతీయ సేవా పథకం, మై భారత్ నెల్లూరు ఆధ్వర్యంలో విఆర్‌సి మైదానం నుండి కరెంట్ ఆఫీస్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం కరెంట్ ఆఫీస్ సెంటర్‌లోని సర్దార్ పటేల్ విగ్రహం వద్ద యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆచార్య శ్రీనివాసరావు మాట్లాడుతూ "దేశ సమైక్యతకు ప్రతీకగా నిలిచిన సర్దార్ పటేల్ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం అన్నారు. భారత స్వాతంత్ర్య పోరాటంలోనూ, దేశ సమీకరణలోనూ ఆయన చూపిన దృఢ సంకల్పం, నాయకత్వం నేటికీ మార్గదర్శకం. పటేల్ చూపిన దేశభక్తి,నిజాయితీ, క్రమశిక్షణ, సేవా భావాలను విద్యార్థులు అలవరచుకోవాలి. అదే ఆయనకు అర్పించే నిజమైన నివాళి"అన్నారు. మై భారత్ సమన్వయకర్త పి.సురేంద్రరెడ్డి మాట్లాడుతూ "పటేల్ వంటి మహనీయుల అంకితభావం, పరిపాలనా నైపుణ్యాలు ప్రతి భారతీయుడికి ఆదర్శం అన్నారు. దేశ ఏకీకరణలో ఆయన పోషించిన విశిష్టమైన పాత్రను యువత గుర్తుచేసుకుంటూ, ఆయన త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ సేవలో ముందంజ వేయాలి" అని పేర్కొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వై.ఓ. నందన్ మాట్లాడుతూ "సర్దార్ పటేల్ దేశ ఐక్యతకు ప్రతీక. ఆయన చూపిన పరిపాలనా దృక్పథం, క్రమశిక్షణ నేటికీ ప్రభుత్వ వ్యవస్థకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. యువత ఆయన చూపిన మార్గంలో నడిస్తే దేశం మరింత బలపడుతుంది. ప్రతి పౌరుడు దేశ ఏకతా, సామరస్య భావనతో ముందుకు సాగాలి" అని అన్నారు. ఆర్‌ఐఓ వారప్రసాద్ మాట్లాడుతూ "పటేల్ చూపిన జాతీయ ఏకతా భావం, నాయకత్వ నైపుణ్యం యువతకు స్ఫూర్తి. దేశ సమైక్యతను కాపాడే దిశగా ప్రతివిద్యార్థి చైతన్యవంతుడిగా మారాలి"అని అన్నారు. డిస్ట్రిక్ట్ యూత్ వెల్ఫేర్‌ఆఫీసర్ డా. ఎ. మహేంద్ర రెడ్డి మాట్లాడుతూ "సర్దార్ పటేల్ చూపిన ఏకతా,సమగ్రత, సేవాభావం ప్రతి భారత యువకుడిలో నాటాలన్నారు. ఆయన చూపిన మార్గం ద్వారా దేశ అభివృద్ధి సాధ్యమవుతుందన్నార. సమాజ సేవద్వారా దేశ నిర్మాణంలో యువత పాత్ర కీలకం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా. కె. సునీత,యన్ ఎస్ ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయశంకర్, యన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్, డాక్టర్ బివి సుబ్బారెడ్డి, డాక్టర్ శంకర్,డాక్టర్ సుచరిత, మై భారత్ సమన్వయకర్తలు ఎన్.కె. యశ్వంత్, సుబ్రహ్మణ్యం రెడ్డి ,వై ఫణి రాజు, ఎల్. రాజశేఖర్, యూనివర్సిటీ అధ్యాపకులు, అధికారులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



భారీ ర్యాలీ నిర్వహించిన దృశ్యం

# ఘనంగా రాష్ట్రీయ ఏకతా దివస్

**నెల్లూరు, అక్టోబర్ 31 :**
ఎన్‌సిసి 10 ఆంధ్ర నేవల్ యూనిట్ నెల్లూరు లెఫ్టినెంట్ కమాండర్, కమాండింగ్ ఆఫీసర్ గణేష్ గొదంగవే ఆదేశాల మేరకు వెంగళరావు నగర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ , బీవీ నగర్ కెవిఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ ఎన్‌సిసి సెకండ్ ఆఫీసర్లు గుండాల నరేంద్రబాబు, సివి నాగరాజు సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖస్వాతంత్ర్య సమరయోధుడు, ఉక్కుమనిషి, భారతరత్న, భారతదేశ తొలి ఉప ప్రధాని, హోంమంత్రి, సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ నుంచి మెయిన్ రోడ్ కరెంట్ ఆఫీస్ సెంటర్ సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వరకు గుండాల నరేంద్రబాబు ఆధ్వర్యంలో ఎన్‌సిసి క్యాడేట్లు ర్యాలీ నిర్వహించారు. కె ఎన్ ఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హై స్కూల్ బీవీ నగర్ నుంచి సివి నాగరాజు ఆధ్వర్యంలో కరెంట్ ఆఫీస్ కూడలి వద్ద గల సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వరకు ఎన్‌సిసి క్యాడెట్లు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కాంస్య విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ బాల్యం నుంచే దేశం యెడల అత్యంత దేశభక్తి భావాలు కలిగిన గొప్ప వ్యక్తి అని గాంధీజీ నాయకత్వంలో స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వారితో అవిశ్రాంత పోరాటం చేశారన్నారు. స్వాతంత్ర్యనంతరం భారతదేశానికి తొలి ఉప ప్రధానిగా హోం శాఖ మంత్రిగా ఎన్నో విశిష్ట సేవలు అందించారని భారతదేశంలో కలవడానికి ఇష్టపడని 562 సంస్థానాలను అత్యంత ధైర్య సాహసాలు ప్రదర్శించి అత్యంత లౌక్యంతో సైనిక చర్య ద్వారా భారతదేశంలో ఈనం చేయడానికి అవిశ్రాంతంగా పనిచేశారన్నారు. ముఖ్యంగా మహారాష్ట్రలోనే జునాగడ్ సంస్థానం, తెలంగాణలోని హైదరాబాద్ సంస్థానాన్ని సైనిక చర్య ద్వారా భారత దేశంలో విలీనం చేసి తన సమర్థతను పటేల్ నిరూపించుకున్నారన్నారు. జాతీయ సమైక్యతకు పాటుపడిన మహనీయుడు పటేల్ అని కొనియాడారు. అందువల్లనే భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2014 అక్టోబర్ 31 నుంచి పటేల్ జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారన్నారు. గుజరాత్ రాష్ట్రంలో నర్మదా నది ఒడ్డున అత్యంత ఎత్తైన పటేల్ విగ్రహాన్ని నిర్మించి వారికి ఘన నివాళులు అర్పించారని భారత దేశ సమైక్యతకు వారు చేసిన కృషిని ఎప్పటికీ మరువరానిదన్నారు. ఆమహనీయుని స్మరించుకోవడం వారి అడుగుజాడల్లో పయనించడానికి బాల్యం నుంచే ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలని వారి పోరాటపటిమను దేశభక్తి భావాలను ధైర్య సాహసాలను మనం అలవర్చుకున్నప్పుడే వారికి నిజమైన నివాళి ఔతుందన్నారు. ఈ కార్యక్రమంలో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు, సెట్నెల్ సీఈవో నాగేశ్వర రావు, ఎన్సిసి పిఐ స్టాఫ్ పెట్టి ఆఫీసర్ లక్ష్మణ కుమార్,ప్రభుత్వ ఆదర్శ ఉన్నత పాఠశాల సంతపేట ఎన్సిసిథర్డ్ ఆఫీసర్డి.పెంచలయ్య, ఎన్సిసి క్యాడెట్లు విరివిగా పాల్గొని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు.


పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎన్‌సిసి సెకండ్ ఆఫీసర్లు గుండాల నరేంద్రబాబు, నాగరాజు

# ఘనంగా పోలీసు సంస్మరణ వారోత్సవాలు

## రక్తదాన శిబిరం ఏర్పాటు.. ఎమ్మెల్యే కాకర్ల సురేష్..

**ఉదయగిరి, అక్టోబర్ 31:**
ఉదయగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో జాతీయ పోలీస్ సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జాతీయ ఐక్యత - 2025 దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్. వెంకట్రావు ఆధ్వర్యంలో నోవా బ్లడ్ సెంటర్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి విధి నిర్వహణలో ఇప్పటి వరకు 36 వేల మంది పోలీస్ సిబ్బంది ప్రాణాలను అర్పించగా వారి త్యాగాలను గౌరవిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వారి పేర్లతో కూడిన నేషనల్ పోలీస్ మెమోరియల్ ను న్యూ ఢిల్లీలో ఏర్పాటు చేసి, జాతికి అంకితం చేశారని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ పోలీస్ వారి త్యాగనిరతిని ప్రశంసిస్తూ, అమరులైన పోలీస్ వీరులను స్మరిస్తూ వారి కుటుంబాలను పరామర్శించి ఓదార్పునిచ్చారని తెలిపారు. వారి బాటలోనే మేము కూడా అమరులైన పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. దేశ భద్రత కోసం ప్రాణాలను పణంగా పెట్టి సేవలందిస్తున్న పోలీసు సిబ్బంది త్యాగాలు అపూర్వమైనవి,అమరులైన వారి త్యాగాలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయని పేర్కొన్నారు.పోలీసులు సమాజానికి రక్షణ కవచంలా ఉంటారని, వారి సేవలు ప్రతి పౌరుడికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ప్రతి ఒక్కరూ పోలీసు వ్యవస్థ పట్ల గౌరవ భావం కలిగి ఉండి, సమాజ అభివృద్ధిలో భాగస్వాములుగా మారాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమము ఉదయగిరి సర్కిల్ పరిధిలోని ఎనిమిది మండలాల పోలీసు సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు,స్వచ్ఛంద సంస్థల సభ్యులు కలిసి ర్యాలీగా బయలుదేరి పోలీస్ అమరవీరులకు జోహార్ అంటూ నినాదాలు చేస్తూ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయానికి చేరుకొని అక్కడ స్మారకార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనేక మంది పోలీసులు, స్థానిక ప్రజాప్రతినిధులు, యువత, నోవా బ్లడ్ సెంటర్ వాలంటీర్లు పాల్గొన్నారు.రక్తదాన శిబిరంలో అనేకమంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి, సామాజిక బాధ్యతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ చంచల బాబు యాదవ్, మండల కన్వీనర్ బయన్న, షేక్ రియాజ్ వివిధ మండలాల తెలుగుదేశం పార్టీ నాయకులు కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సురేష్. రక్తదాతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం


చెంచల్‌బాబు యాదవ్‌ను సన్మానిస్తున్న వింజమూరు మండల కన్వీనర్ నరసారెడ్డి

# చెంచల బాబు యాదవ్‌కు జన్మదినశుభాకాంక్షలు

## వింజమూరు మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి..

**ఉదయగిరి, అక్టోబర్ 31 :**
తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ,టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పొన్నుబోయిన చంచల బాబు యాదవ్ జన్నదినం సందర్భంగా ఉదయగిరిలోని ఆయన గెస్ట్ హౌస్‌లో వింజమూరు మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, వింజమూరు టిడిపి నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఉన్నత పదవులు అలంకరించాలని, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఏగినేని శ్రీనివాసులు నాయుడు, యూనిట్ ఇంచార్జ్ కొండపల్లి వెంకటేశ్వర్లు, గువ్వల రవీంద్రారెడ్డి, పల్లాపు అంకయ్య, పెంచల రావు, గాలి శేషయ్య, బి మదన్ తదితరులు పాల్గొన్నారు.


రక్తదాన శిబిరం నిర్వహించిన దృశ్యం

# అమరులైన పోలీసువీరుల త్యాగాలు చిరస్మనీయం

## వింజమూరు మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి..

**ఉదయగిరి, అక్టోబర్ 31:**
ఉదయగిరి మండల కేంద్రంలోని సర్కిల్ ఇన్స్పెక్టర్ వారి కార్యాలయ ప్రాంగణంలో జాతీయ పోలీస్ సంస్మరణ వారోత్సవాలు, జాతీయ ఐక్యత - 2025 దినోత్సవం శుక్రవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఉదయగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్. వెంకట్రావు ఆధ్వర్యంలో నోవా బ్లడ్ సెంటర్ వారి సహకారంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వింజమూరు టిడిపి మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి పాల్గొన్నారు. స్వాతంత్రం వచ్చినప్పటి నుండి విధి నిర్వహణలో ఇప్పటి వరకు 36 వేల మంది పోలీస్ సిబ్బంది ప్రాణాలను త్యాగాలు చేశారన్నారు. వారి త్యాగాలను స్మరించుకుంటూ అమరులైన పోలీస్ వీరులకు ఘన నివాళి అర్పించారు. రక్తదాన శిబిరంలో అనేకమంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి, సామాజిక బాధ్యతను చాటుకున్నారు. వారందరినీ గూడా నర్సారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్, కొండపల్లి వెంకటేశ్వర్లు, ఏగినేని శ్రీనివాసులు నాయుడు, గువ్వల రవీంద్రారెడ్డి, పల్లాపు అంకయ్య, పెంచలరావు, గాలి శేషయ్య, బి మదన్ తదితరులు పాల్గొన్నారు.



సాయినాధుని కొలువులో వేమిరెడ్డి ప్రభాకర్ రెడ, ప్రశాంతి రెడ్డి దంపతులు

# సాయినాధుని దర్శించుకున్న వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులు

**నెల్లూరు, అక్టోబర్ 31:**
నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరుఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు షిర్డీ సాయిబాబాను దర్శించుకున్నారు.శుక్రవారం మహారాష్ట్రలోని షిర్డీ వెళ్లిన వారు ఈ సందర్భంగా సాయినాధుడిని దర్శించుకున్నారు.స్వామివారి ఆశీసులు అందుకున్నారు. సాయినాధుడిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని వారు తెలిపారు.

# సోమశిలకు పోటెత్తుతున్న వరద

**నెల్లూరు, అక్టోబర్ 31:**
సోమశిలకు వరద పోటెత్తుతోంది. దీంతో ప్రాజెక్ట్ అధికారులు లక్ష క్కుసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. పెన్నాకు వస్తున్న వరద ప్రవాహంతో లోతట్టు ప్రాంతాలకు ముప్పు పొంచి ఉంది. దీంతొ అధికారులను ,టీడీపీ శ్రేణులను అప్రమత్తం చేసిన మంత్రి నారాయణ వరదపై ఎప్పటికప్పుడు వివరాలు సేకరిస్తూ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. మంత్రి నారాయణ ఆదేశాలతో వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు టీడీపీ నేతలు పర్యవేక్షించారు. అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలి రావాలని ప్రభావిత ప్రాంత వాసులకు విజ్ఞప్తి చేశారు. జాకీర్ హుస్సేన్ నగర్, కిసాన్ నగర్‌లలో లోతట్టు ప్రాంతాల్లోని నివాసప్రాంతాలను వరద నీరు తాకింది.





పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రామరాజు

# సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు

**హిరమండలం, అక్టోబర్ 31:** స్వాతంత్ర్యసమరయోధుడు,ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలు పాతపట్నం రామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తులగాపు.కేశవరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశం లో రామరాజు ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారశెల్లి.రామరాజు మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, స్వతంత్ర సంస్థానాలను పటేల్ తన అసాధారణ దార్శినికత దౌత్య నైపుణ్యం చేపట్టి సంస్థానాలన్నింటినీ మన జాతీయ జెండా కిందకు చేర్చారని తెలిపారు.పటేల్ జీవిత చరిత్ర పై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు,జ్ఞాపికాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎంజిఆర్

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ

ఎమ్మెల్యే ఎంజిఆర్..

**పాతపట్నం, అక్టోబర్ 31:** పాతపట్నం మండలం చాకిపల్లి గ్రామానికి చెందిన బొమ్మలి సుహాషిణి ఫుడ్ పాయిజన్ అయినందువల్ల రిమ్స్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ ఆపరేషన్ చికిత్స నిమిత్తం డబ్బులు అవసరమై విషయాన్ని పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ. 1,00,090 మంజూరు కాగా శాసనసభ్యులు మామిడి గోవిందరావు బాధితునికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ రకాల వ్యాధులకు వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఉదారంగా ఆర్థిక సాయం అందించి అండగా నిలుస్తున్న ప్రభుత్వం ఈ ఎన్డిఏ ప్రభుత్వం అని తెలియజేశారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిధులు అందిస్తున్నారు.అలాగే ఈ నియోజకవర్గంలో గత పాలకులు ఏరోజైనా సీఎం సహాయనిధి కోసం ఒక్క దరఖాస్తు అయిన చేయలేదని నియోజకవర్గ ప్రజలకు గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి మండల నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.

# ప్రత్యేక అలంకరణలో శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి

**తాడిపత్రి, అక్టోబర్ 31:** కార్తీకమాసం ఉత్సవాలలో భాగంగా 10వ రోజున శుక్రవారం తెల్లవారుజామున శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామికి అభిషేకాలు గావించిన అనంతరం విశిష్ట పుష్పాలతో ప్రత్యేక అలంకరణలో శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి భక్తులకు దర్శనమిచ్చారు.



**తిరుమల తరహాలో పుష్పయాగం..**

శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి క్షేత్రంలో నవంబర్ 3న రెండవ కార్తీక సోమవారం పునస్కరించుకొని తిరుమల తరహాలో పుష్పయాగం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ చంద్రమోహన్ పేర్కొన్నారు.

# వైకాపా నాయకుని తల్లి మృతి

గ్రామ సర్పంచ్ సంజీవరాయుడు నివాళి..

**యాడికి, అక్టోబర్ 31:** యాడికి మండల పరిధిలోని తూట్రాళ్లపల్లి గ్రామ వైకాపా నాయకుడు, పాఠశాల విద్యా కమిటీ మాజీ చైర్మన్ చాకలి రంగా తల్లి చాకలి ఈశ్వరమ్మ అనారోగ్యంతో మృతి చెందారు . సమాచారం తెలుసుకున్న వైకాపా మండల కన్వీనర్ గ్రామ సర్పంచ్ సంజీవరాయుడు ఈశ్వరమ్మ మృతదేహంపై పూల మాల వేసి నివాళు లర్పించారు. రంగా కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతోపాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆధ్యాత్మిక చింతనతో సంతోషకరమైన జీవనం

## సత్య సాయి మందిరం ప్రారంభోత్సవం.. రాష్ట్ర పండుగగా సత్య సాయి శత వర్ష జయంతి వేడుకలు .. సత్య సాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు ..

**హిరమండలం, అక్టోబర్ 31:** ఆధ్యాత్మిక చింతన ఆనందకరమైన జీవనానికి దోహదపడుతుందని శ్రీ సత్య సాయి సేవాసంస్థల రాష్ట్ర అధ్యక్షులు రఘుపాత్రుని లక్ష్మణరావు అన్నారు. హిరమండలం దేవర శెట్టి వీధిలో నూతనంగా నిర్మించిన భగవాన్ శ్రీ సత్య సాయి సేవా మందిరాన్ని శ్రీ సత్య సాయి సేవాసంస్థల రాష్ట్ర అధ్యక్షులు రఘుపాత్రుని లక్ష్మణరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందిరంలో కంప్యూటర్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్,అర్హులైన వారికి క్యారేజీల ద్వారా ఆహారం సరఫరాకు త్వరలో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. సత్యసాయి శత వర్ష జన్మదిన వేడుకలను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 13 నుండి 24 వ తేదీ వరకు బాబా పుట్టినరోజు వేడుకలకు పుట్టపర్తి వచ్చే యాత్రికులకు ఉచిత వసతి, భోజనాలను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు ప్రధానమంత్రి, ఉపరాష్ట్రపతి, నాలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు బాబా దర్శనం కు వస్తున్నట్లు తెలిపారు.శ్రీకాకుళం జిల్లా నుండి నవంబర్ 21 న ప్రత్యేక రైలు ను పుట్టపర్తి నడపడం వలన పదివేల మంది భక్తులు తరలి వస్తారని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. తొమ్మిది వేల మంది సేవాదళ్ సభ్యులు సేవలు అందించనున్నట్లు చెప్పారు. బాబా పుట్టినరోజును రాష్ట్ర పండగ ప్రభుత్వ ప్రకటించడం జరిగిందని తెలిపారు. నవంబర్ 18 న శ్రీ సత్యసాయి వర బ్రహ్మోత్సవం రోజు బంగారు రథంలో సత్య సాయి బాబా ను పుట్టపర్తి పురవీధుల్లో ఊరేగింపు,సాయి కుల్వంత్ మండపంలో 1008 దంపతులకు సత్యనారాయణ వ్రతాలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు వేల మందికి అన్న ప్రసాద వితరణ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సుర రామచంద్రరావు, సేవాదళ్ సమన్వయకర్త పి నాగేశ్వరరావు, స్కిల్ డెవలప్మెంట్ సమన్వయకర్త బి నరసింహమూర్తి, రాష్ట్ర ఐటీ ఇంచార్జీ ఆర్ కిషోర్ ,హిరమండలం ఎంపీపీ తూలుగు.మేనక, బూర్జ ఎంపీపీ దీప తదితరులు పాల్గొన్నారు



శ్రీ సత్య సాయి సేవా మందిరాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు





సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణరావు. తప్పెటగుళ్ల కళాకారుల ప్రదర్శన

# పునరావాస కేంద్రాల ఏర్పాటులో టీడీపీ విఫలం

## బాధితులకు అండగా వైఎస్ఆర్సీపీ నేతలు .. మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి..

**పాతపట్నం, అక్టోబర్ 31:** మొంథా' తుఫాన్ కారణంగా రాష్ట్రం అతలాకుతలమై, ప్రజలు తీవ్ర కష్టాల్లో ఉన్నప్పటికీ, ప్రజలను ఆదుకోవడంలో ఉన్న టీడీపీ కూటమి ప్రభుత్వం సహాయక చర్యల్లో ఘోరంగా విఫలమైందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు. పాతపట్నం నియోజకవర్గంలో కురిసిన అకాల వర్షాల వల్ల వరి, పత్తి, మిరప వంటి ప్రధాన పంటలు పూర్తిగా నీట మునిగాయని, చేతికి అందివచ్చిన పంట నీటిపాలు కావడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడి కూడా దక్కని పరిస్థితి ఏర్పడిందని, ఇది రైతుల ఆర్థిక పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చిందని అన్నారు. ప్రభుత్వ వైఫల్యం కారణంగా ప్రజలు నిరాశ్రయులై, కనీస సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ జిల్లాలో ఉన్న వ్యవసాయ శాఖామంత్రి అనివార్య కారణాలను చెప్పి కొంత మంది రైతులకే మాత్రమే నష్ట పరిహారం ఇస్తామనడం దారుణమన్నారు. ఇక్కడ ఎమ్మెల్యే ఎప్పుడు డబ్బులు దోచుకోవడం, దాచుకోవడమే తప్ప రైతుల కోసం, రైతులకు అందవలసిన పరిహారం కోసం మాట్లాడే పరిస్థితే లేదన్నారు.ప్రభుత్వం నిర్లక్ష్యం వహించినా, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు పార్టీ శ్రేణులు, నాయకులు తక్షణమే తుఫాన్ ప్రభావిత ప్రాంతాలకు చేరుకుని బాధితులకు అండగా నిలబడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి, ఈ 16 నెలల కాలంలో రాష్ట్ర రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు అనేకం అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా ఇన్పుట్ సబ్సిడీ కింద రైతులకు ఇవ్వలేదు.ప్రభుత్వ లెక్కల ప్రకారం దాదాపు 5.5 లక్షల మంది రైతులకు ఇన్పుట్ సబ్సిడీ రూపంలో ఇవ్వాల్సిన సుమారు రూ.600 కోట్లు సబ్సిడీని ఎగ్గొట్టిందన్నారు. ఈ-క్రాప్ ప్రక్రియను సరిగా అమలు చేయకుండా నీరు గార్చారన్నారు. ఆర్బీకేలు (రైతు భరోసా కేంద్రాలు) నిర్వీర్యం అయ్యాయన్నారు. ఉచిత పంటల బీమా పథకం పూర్తిగా నిలిపివేశారన్నారు. ఇన్పుట్ సబ్సిడీ, ఉచిత పంటల బీమా లేకపోవడం గిట్టుబాటు ధరలు రాకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అన్నదాత సుఖీభవ కింద రెండేళ్లకు కలిపి రూ.40,000 ఇవ్వాల్సి ఉండగా, కేవలం రూ.5,000 మాత్రమే ఇచ్చి చంద్రబాబు రైతులను మోసం చేశారన్నారు. జగనన్న ప్రభుత్వ సంక్షేమం గత వైయస్ఆర్సీపీ ప్రభుత్వం 54.55 లక్షల మంది రైతులకు తోడుగా నిలబడుతూ రూ.7,802 కోట్లతో ఉచిత పంటల బీమా పరిహారం ఇప్పించిందన్నారు. ప్రతి ఎకరాకు ఈ - క్రాప్ చేసి, ఆ బీమా ప్రీమియంను ప్రభుత్వమే కట్టిందన్నారు. రైతులపై ఎలాంటి భారం మోపలేదు.అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతులకు నష్టం జరిగిన 10 రోజులకే ప్రతి ఏకరాకు ప్రాంతాన్ని బట్టి 30 వేల నుండి లక్ష రూపాయల వరకు జమ చేసిన నాయకుడు జగనన్న అన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతుల వ్యవసాయ రుణాలను మాఫీ చేయాలి వైద్ దీని గురించి చెల్లించేందుకు కొంత గడువు ఇవ్వాలన్నారు. తదుపరి సాగు కోసం రైతులకు సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. "భారతదేశానికి వెన్నెముక వంటి రైతన్నలు కష్టాల్లో ఉన్నప్పుడు వారికి అండగా నిలబడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందన్నారు.



# పిన్నేపల్లి తాగునీటి సమస్య పరిశీలన

## డిప్యూటిక్ ఎంపీటీవో. ఇంచార్జ్ ఈవో శశికళ..

**యాడికి, అక్టోబర్ 31 :** యాడికి గ్రామ పంచాయతీ పరిధిలోని పిన్నేపల్లి గ్రామంలో తాగునీటి సమస్యను శుక్రవారం డిప్యూటీ ఎంపీటీవో. ఇంచార్జ్ ఈవో శశికళ, ఆర్డబ్ల్యూఎస్ ఏ ఈ ఈ దేవకుమార్ పరిశీలించారు. ఎస్సీ కాలనీకి త్రాగునీటి సమస్య నెలకొందని కాలనీవాసులు ఎంఆర్పీఎస్ అందిన ఫిర్యాదు మేరకు శుక్రవారం డిప్యూటీ ఎంపీడీవో , ఇంచార్జ్ ఈవో శశికళ ఆర్డబ్ల్యూఎస్ ఏఈఈ దేవకుమార్ క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లారు. అయితే గ్రామంలోని పలు కాలనీలలో పంచాయతీ అధికారుల అనుమతి లేకుండా అక్రమంగా కొళాయిలు ఏర్పాటు చేసుకోవడంతోపాటు కొద్దిమంది వాటిని తమ పంట పొలాలకు వినియోగిస్తుండడం , పశువుల పాకను ఏర్పాటు చేయడం తదితర కారణాలతో ఎస్సీ కాలనీకి త్రాగునీటి సమస్య ఏర్పడుతోందని అధికారులు గ్రహించారు. సమస్యలను సావధానంగా పరిష్కరించి ఎస్సీ కాలనీకి త్రాగునీటి సమస్య తీర్చనున్నట్లు శశికళ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది లక్ష్మేంద్ర, సచివాలయ సిబ్బంది. వాటర్ మెన్ తదితరులు పాల్గొన్నారు.



పిన్నేపల్లి గ్రామంలో అక్రమ కుళాయిలను పరిశీలిస్తున్న ఇంచార్జ్ ఈవో శశికళ. ఆర్డబ్ల్యూఎస్ ఏఈఈ దేవకుమార్.





పిన్నేపల్లి గ్రామంలో అధికారుల అనుమతి లేకుండా అక్రమంగా వేసుకున్న కుళాయిలను పరిశీలిస్తున్న ఇంచార్జ్ ఈవో శశికళ. ఆర్డబ్ల్యూఎస్ ఏఈఈ దేవకుమార్.

# కొరసవాడలో కోటి సంతకాల కార్యక్రమం

**పాతపట్నం, అక్టోబర్ 31:** పభుత్వ వైద్యశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కొరసవాడ గ్రామంలో "కోటి సంతకాలు" కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మద్దు తాతయ్య మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత అని, దానిని వ్యాపారాల బలిపీఠంపై ఉంచడం అన్యాయం అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు పేదలకు దేవాలయాలు. వాటిని ప్రైవేటు చేతుల్లోకి ఇవ్వడం అంటే ప్రజల ప్రాణాలతో ఆటలాడటమేనన్నారు. వైద్య రంగం మీద కార్పొరేట్ ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో పేద, మధ్యతరగతి ప్రజలు చికిత్స భారాన్ని భరించలేని స్థితికి చేరుకున్నారన్నారు. ప్రైవేటు కాలేజీలు, ఆసుపత్రులు విద్యార్థులకూ, రోగులకూ ఒకే సమయంలో భారంగా మారుతున్నాయన్నారు. కొరసవాడలో ప్రారంభమైన ఈ కార్యక్రమం కేవలం ఒక గ్రామ స్థాయి నిరసన కాదని, ఇది ప్రజా వైద్య హక్కుల కోసం మొదలైన ఉద్యమానికి నాంది అన్నారు. ప్రజల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత అని సామాన్యుని ఆకాంక్ష అన్నారు. ప్రభుత్వం ప్రజా వైద్య వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించకుండా, గ్రామీణ ప్రజలకు చేరువలో ఉన్న వైద్యసదుపాయాలను బలోపేతం చేయాలన్నారు. ప్రజల ఆయుధం ఆరోగ్య హక్కుగా ఉండాలే తప్ప పెనుభారం కాకూడదన్నారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, గణపతి మధుబాబు, మొర్రి మధు, శ్రీను, బడే సోమేశు, కనకల లోకేష్, మనోజు స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



సంతకాలు సేకరిస్తున్న వైకాపా నేతలు

# ఎంపీటీసీ పదవికి తగ్గుపర్తి పుష్పావతి రాజీనామా చేయాలి

## లేదంటే ఇంటి దగ్గర్ల శాంతియుత నిరసన.. వైయస్సార్సీపీ నాయకులు..

**బెలుగుప్ప, అక్టోబర్ 31:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరుపున తగ్గుపర్తి ఎంపీటీసీగా గెలుపొందిన పుష్పావతి పార్టీ ఫిరాయింపులకు పాల్పడటంతో ఎంపీటీసీ పదవికి రాజీనామా చేయాలని వైయస్ఆర్సీపీ నాయకులు ఎర్రగుడి ఎర్రిస్వామి, నరిగన్న, తగ్గుపర్తి నరేంద్ర, చిన్న ఎర్రిస్వామి , రమేష్ తదితరులు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన బెలుగుప్ప వైయస్సార్సీపీ పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ తగ్గుపర్తి ఎంపీటీసీగా, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసి ఎంపీటీసీగా గెలుపొందిన తగ్గుపర్తి ఎంపీటీసీ పుష్పావతి ఇటీవల తెలుగుదేశం పార్టీలోకి వెళ్లిన ఎంపీపీ పెద్దన్నకు సహకరిస్తూ, మద్దతు తెలపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తగ్గుపర్తి మండల ప్రాదేశిక గ్రామాలైన తగ్గుపర్తి ఎర్రగుడి అవులెన్న గ్రామాలకు చెందిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఎంతో కష్టపడి పుష్పావతిని ఎంపీటీసీగా గెలిపించామన్నారు. మాజీ ఎమ్మెల్యే వై విశ్వేశ్వర్ రెడ్డి ఎంతో నమ్మకంతో పుష్పావతికి వైస్ ఎంపీపీ కూడా చేశారన్నారు. దాన్ని దృష్టిలో ఉంచుకోకుండా టిడిపిలోకి వెళ్లిన ఎంపీపీ పెద్దన్నకు మద్దతు తెలపడం ఎంతవరకు సమంజసం అన్నారు. కావున పుష్పావతి తన ఎంపీటీసీ పదవికి రాజీనామా చేసి, టీడీపీ లోకి వెళ్లాలని అప్పుడు అభినందిస్తామన్నారు. ఎంపీటీసీ పదవికి రాజీనామా చేయలేని పక్షంలో తగ్గుపర్తి లోని మీ ఇంటి వద్ద శాంతియుత నిరసన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపీ నాయకులు ఎర్రగుడి అంగడి ఎర్రిస్వామి, నరిగన్న, పూల ప్రసాద్,చిన్న ఎర్రిస్వామి, ఎర్రిస్వామి, రమేష్, శ్రీనివాస్, సతీష్ పాల్గొన్నారు..



మాట్లాడుతున్న వైయస్సార్సీపీ నాయకులు అంగడి ఎర్రిస్వామి, నరిగన్న, తగ్గుపర్తి నరేంద్ర, ఎర్రి స్వామి తదితరులు

# వాసవి పెనుగొండగా పేరు మార్పు..

## రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ హర్షం.

**డిహిరేహాల్, అక్టోబర్ 31:** సాంస్కృతిక ఆధ్యాత్మిక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని పశ్చిమగోదావరి జిల్లాలో ఉన్న పెనుగొండ పట్టణాన్ని వాసవి పెనుగొండగా మార్చు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడంతో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగపల్లి వెంకటేశులు మాజీ ఎంపీపీ ఆర్యవైశ్య సంఘం నాయకురాలు నాగపల్లి పుష్పావతి లు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ వాసవి పెనుగొండ గా పేరు మార్పినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారికి డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ గారికి మంత్రి నారా లోకేష్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన వాసవి పెనుగొండ గా పేరు నామకరణం చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయానికి రాష్ట్రవ్యాప్తంగా ఆర్య వైశ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారని ఆయన ఒక ప్రకటనలో తెలియజేశారు. వాసవి మాతకు జన్మస్థలమైన పెనుగొండ పట్టణం ఆర్యవైశ్యుల ఆరాధన స్థలంగా ప్రసిద్ధి చెందిందని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగపల్లి వెంకటేశ్వర్లు గుర్తు చేశారు. వాసవి పెనుగొండ గా పేరు మార్పుతో ఆ ప్రాంతానికి ఆధ్యాత్మికంగా సాంస్కృతికంగా మరింత ప్రతిష్ట పెరుగుతుందని అన్నారు.



రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగపల్లి వెంకటేశులు మాజీ ఎంపీపీ నాగపల్లి పుష్పావతి

# ఓఎంసీ ప్రాంతంలో గనుల లీజుల సరిహద్దులు ఏర్పాటు

**డి హిరేహాల్ అక్టోబర్ 31** ఓబులాపురం మైనింగ్ ప్రాంతంలో వివాదాస్పదంగా నిలిచిన ఇనుప గనుల లీజుల సరిహద్దులను గుర్తించడానికి మళ్లీ రీ సర్వే పనులు ప్రారంభం అయ్యాయి. శుక్రవారం ఉదయం సర్వే బృందం ఓబులాపురం మైనింగ్ ప్రాంతానికి చేరుకొని ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. మండల పరిధిలోని హెచ్ సిద్ధాపురం ఓబులాపురం గ్రామాల మధ్య ఉన్న సర్వే నంబర్ 1 లో రీ సర్వే పనులు ప్రారంభించారు. గ్రామ సరిహద్దుల బౌండరీలు అలవీ బౌండరీల పరిధిలో పర్యటించి సరిహద్దులను గుర్తించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఓబులాపురం మైనింగ్ ప్రాంతంలో వివాదానికి కారణమైన గనుల లీజు బౌండరీలను మాత్రమే సర్వే చేసి గుర్తిస్తామని సర్వే సెటిల్మెంట్ ల్యాండ్ రికార్డ్స్ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఇదివరకే బెంగళూరులో జరిగిన ఆంధ్ర కర్ణాటక రాష్ట్రాలకు చెందిన అధికారుల సమావేశమై రాష్ట్రాల సరిహద్దుల బౌండరీల విషయమై చర్చించి సమస్య పరిష్కారం చేసుకున్నారు. ప్రస్తుతం మైనింగ్ లీజుల పరిధిలో మాత్రమే రీ సర్వే చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. సోమవారం సర్వే బృందం చైర్మన్ సుప్రీంకోర్టు మాజీన్యాయమూర్తి సుదర్శన్ దుర్జయ ఓబులాపురం ప్రాంతానికి చేరుకుంటారని ఆయన తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో సమగ్ర సర్వే పనులు ప్రారంభం అవుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ లోపు రీ సర్వే చేయడానికి ఏర్పాటుగా క్షేత్రస్థాయిలో గనుల లీజుల ప్రాంతాల సరిహద్దుల బౌండరీలను ఫారెస్ట్ బౌండరీలను గుర్తించడానికి శనివారం ఆదివారం ఈ రెండు రోజులలో ఓబులాపురం మైనింగ్ ప్రాంతంలో సర్వే అధికారులు సర్వే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సుప్రీంకోర్టు నియమించిన ఆరు గ్రూపుల సర్వే బృందం ఓబులాపురం మైనింగ్ ప్రాంతంలో రీ సర్వే పనులు పూర్తి చేసి బౌండరీలను గుర్తించి సర్వే నివేదికను మా సర్వే బృందం చైర్మన్ సుప్రీంకోర్టుకు సమర్పిస్తారని ఆయన తెలిపారు.



ఓబులాపురం మైనింగ్ ప్రాంతంలో మైనింగ్ లీజు సరిహద్దుల బౌండరీలను పరిశీలిస్తున్న సర్వే బృందం

# పిన్నదరిలో శ్రీ భోగేశ్వర స్వామి దేవాలయ జీర్ణోద్ధారణ కుంభాభిషేకం

## నేటి నుండి మూడు రోజుల పాటు ఉత్సవాలు..

**తాడిమర్రి, అక్టోబర్ 31:**
మండల పరిధిలోని పిన్నదరి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ భోగేశ్వర స్వామి దేవాలయం జీర్ణోద్ధార కుంభాభిషేక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ కార్యక్రమాలు నేటి నుండి మూడు రోజుల పాటు వేద పండితుల ఆధ్వర్యంలో జరుగుతాయని గ్రామ పెద్దలు తెలిపారు.శనివారం ఉదయం గురు ప్రార్థనతో ఉత్సవాలు, రాత్రి 9 గంటలకు పంచరత్నాలు ఉచిత నాటక ప్రదర్శన నిర్వహిస్తారు.?ఆదివారం రోజున ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది.సోమవారం రోజున వేద పండితుల ఆధ్వర్యంలో ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం, అనంతరం మహా మంగళ హారతితో ఉత్సవాలు ముగుస్తాయి.??సోమవారం ఉదయం 9 గంటల నుండి ఆకర్షణీయమైన రాతిదూలం లాగుడు పోటీలు కూడా నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ పోటీలకు భారీగా బహుమతులు నిర్ణయించారు: మొదటి బహుమతిగా రూ. 50,000, రెండో బహుమతిగా రూ. 40,000, మూడో బహుమతిగా రూ. 30,000, నాలుగో బహుమతిగా రూ. 20,000, ఐదో బహుమతిగా రూ. 10,000, ఆరో బహుమతిగా రూ. 5,000 అందించనున్నారు. ఈ మూడు రోజులు భక్తులకు, గ్రామస్తులకు అన్నదాన కార్యక్రమం జరుగుతుందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై, తీర్థ ప్రసాదాలు స్వీకరించి, భగవంతుడి కృపకు పాత్రులు కావాలని అన్నారు.

# ఆరోగ్యానికి ప్రకృతి వ్యవసాయమే కీలకం

## సాకే గంగమ్మను సన్మానించిన ఆర్టీఐ సభ్యులు


**బత్తలపల్లి, అక్టోబర్ 31:**
మనం ఆరోగ్యంగా జీవించాలంటే తప్పనిసరిగా ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలనే వినియోగించాలని సమాచార హక్కు ప్రజా చైతన్య వేదిక (ఆర్టీఐ) సభ్యులు ప్రజలకు పిలుపునిచ్చారు. పకృతి వ్యవసాయంలో తన కృషిని గుర్తించి ప్రధాని మోడీ చేతుల మీదుగా సన్మానం అందుకున్న మహిళా రైతు సాకే.గంగమ్మను శుక్రవారం మండలంలోని రాఘవంపల్లి గ్రామంలోని నివాసంలో ఆర్టిఐ సభ్యులు ఘనంగా సన్మానించారు.?ఆర్టీఐ రాష్ట్ర అధ్యక్షులు బాలకృష్ణ, బత్తలపల్లి మండల ఉపాధ్యక్షులు శంకర్, మాతంగి కాటమయ్య, సభ్యులు లక్ష్మీనారాయణ నారాయణస్వామి మాట్లాడుతూ, గంగమ్మ ప్రకృతి వ్యవసాయంలో చూపిన కృషికి దక్కిన సన్మానం జిల్లా మహిళా రైతులందరికీ ఆదర్శనీయమన్నారు. ఆమె స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని కోరారు. గంగమ్మకు దక్కిన గౌరవం ఉమ్మడి అనంతపురం జిల్లాకు అరుదైన గౌరవంగా వారు అభివర్ణించారు. రైతులను, ముఖ్యంగా మహిళా రైతులను ప్రోత్సహిస్తున్న జిల్లా అధికారి లక్ష్మీనాయక్ కృషిని వారు అభినందించారు. తన కృషికి దక్కిన గౌరవం పట్ల గంగమ్మ సంతోషం వ్యక్తం చేస్తూ, ప్రోత్సహించిన లక్ష్మీనాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


గంగమ్మను సన్మానిస్తున్న సమాచార హక్కు ప్రజా చైతన్య వేదిక సభ్యులు

# సర్దార్ వల్లభాయ్ పటేల్ జీ లాల్ సలామ్...

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కె. హరిప్రసాద్ స్వీయరచన..

**రోళ్ల, అక్టోబర్ 31 :**
సర్దార్ వల్లభాయ్ పటేల్ జీ కో లాల్ సలామ్ అంటూ ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కె. హరి ప్రసాద్ స్వీయ రచన చేసిన వినిపించారు. లేపాక్షి మండలం చోళ సముద్రం ప్రాథమిక పాఠశాలలో భారతరత్న స్వాతంత్ర సమరయోధులు ఉక్కుమనిషి భారతదేశ మొట్టమొదటి ఉప ప్రధాని కేంద్ర హోం శాఖ మంత్రిగా సేవలందించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సమావేశంలో హరి ప్రసాద్ మాట్లాడుతూ భారతదేశం అఖండ భారతావనిగా విరాజిల్లేందుకు సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి అమోఘమని అద్వితీయమని భరతమాత ముద్దుబిడ్డగా వీరాధివీరునిగా పేరుగాంచినారని పేర్కొన్నారు. అంతే కాదు న్యాయవాదిగా లాయర్ గా న్యాయ సేవలు అందించడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇప్పటి న్యాయవాదులకు ఆదర్శనీయమని మార్గదర్శకుడని హరిప్రసాద్ పిలుపునిచ్చారు. ఒకసారి కోర్టులో వాదోపవాదాలు జరుగుతుండగా సర్దార్ వల్లభాయ్ పటేల్ న్యాయవాదిగా మాట్లాడుతూ వాదిస్తున్న సమయంలో ఒక వ్యక్తి వచ్చి ఒక చీటీ ఇచ్చి వెళ్లడం జరిగింది అది సర్దార్ వల్లభాయ్ పటేల్ చదివి దానిని తన జేబులో ఉంచుకున్నారన్నారు. తరువాత తన కంటి నుండి ఒక కన్నీటి చుక్క రాల్చి తన న్యాయవాద వృత్తికి న్యాయం చేసి 48 మంది స్వాతంత్ర సమరయోధులను ఉరితాడు తాకనివ్వకుండా తన వాక్చాతుర్యంతో న్యాయం చేసి 48 మంది స్వాతంత్ర సమరయోధులకు ప్రాణబిక్ష పెట్టారు అంతేకాకుండా తన కర్తవ్య దీక్షలో ఏమరపాటు లేకుండా తత్తర పాటు లేకుండా న్యాయవాదిగా అందరి గుండెల్లో గూడు కట్టుకున్నారన్నారన్నారు. ఈ సన్నివేశం జరిగిన తర్వాత కోర్టు సమయం తర్వాత న్యాయవాదులు కొందరు మీరు న్యాయం కోసం మాట్లాడుతుండగా అందిన చీటీ విషయం ఏమిటని అడుగగా అందుకు సర్దార్ వల్లభాయ్ పటేల్ సమాధామనిస్తూ తన భార్య చనిపోయిందని ఆ విషయం తెలిసి మొదట బాధపడ్డాను కానీ తన లక్ష్యం కోసం తాను తన వృత్తి కోసం తన భార్య మరణాన్ని సైతం పక్కన ఉంచి 48 మంది స్వాతంత్ర సమరయోధుల ప్రాణాలు ఉరితాడుకు బలికారాదని అందుకు భరతమాత తనకు న్యాయవాద వృత్తి ప్రసాదించిందని భావోద్వేగంగా తెలిపారని హరిప్రసాద్ పిల్లలకు తెలియజేశారు అంతేకాదు 504 స్వదేశీ సంస్థానాలను విలీనం చేసి అఖండ భారతావనిగా విరాజిల్లడానికి కృషి చేయడం జరిగిందని ఇంకను హైదరాబాద్ నిజాం పాలనను అంతం చేసి రజాకార్లను పోలీస్ చర్య ద్వారా అంతమొందించి అఖండ భారతావనిలో భాగస్వామ్యం చేసిన ఘనత ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ కి చెందుతుందని హరిప్రసాద్ ఉద్ఘాటించారు అంతేకాకుండా నేటి యువతరానికి ఎంతో ఆదర్శప్రాయుడని రాబోయే తరాలకు కావలసిన త్యాగాలను చేసిన మహనీయులను మరచిపోరాదని హరిప్రసాద్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు ఈ సందర్భంగా హరిప్రసాద్ సర్దార్ వల్లభాయ్ పటేల్ గురించి రాసిన పాట అందరిని ఆకర్షించింది.భరతమాత మణిహారంలో భారతరత్నమై మెరిసిన సర్దార్ జి మీకు ఇదే లాల్ సలాం భరతావని అఖండ భారతావనిగా విరాజిల్లడమే లక్ష్యంగా ఉప ప్రధానిగా కేంద్ర హోం శాఖ మంత్రిగా పనిచేసినా విధులలో విజేతవే ఓ వల్ల బాయి నీకిదే లాల్ సలాం అన్నారు. స్వదేశీ సంస్థానాల విలీనంలో సమర శంఖారావం పూరించి సింహ స్వప్నమై నిలిచిన ఓ ఉక్కుమనిషి సర్దార్ పటేల్ జి నీకు ఇదే లాల్ సలాం అంటూ సాగిన గీతం జాతి యావత్తు సర్దార్ వల్లభాయ్ పటేల్ కు రుణపడి ఉందని హరిప్రసాద్ భావోద్వేగంతో పాడి అందరినీ అలరించారు ఆకర్షించారు నేటి బాలలే రేపటి పౌరులు కావున అమర వీరుల త్యాగాలను ఆశయాలను ఆదర్శాలను గుర్తించుకొని గుండెల్లో నింపుకొని ముందుకు సాగాలని భారతదేశం భవిష్యత్తు నేటి యువకులు చేతుల్లో ఉందని హరిప్రసాద్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిత సునీత లక్ష్మీదేవి క్లస్టర్ రిసోర్స్ పర్సన్ నారాయణస్వామి ఆయా లావణ్య తదితరులు పాల్గొన్నారనీ హరి ప్రసాద్ తెలిపారు.హరి ప్రసాద్ కవితకు సర్దార్ వల్లభాయ్ పటేల్ పేరున ప్రశంసా పత్రం కూడా అందుకోవడం జరిగింది అని వారి మిత్రులు తెలిపారు.సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పుట్టినరోజును జాతీయ ఏకతా దినోత్సవం జాతీయ ఐక్యత దినోత్సవం గా జరుపుకోవాలని కోరడం గుర్తించడం భారతీయుల అదృష్టమని పేర్కొన్నారు.





విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న చోళసముద్రం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే హరి ప్రసాద్

# సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

## ఎంఎల్ఏ కందికుంట వెంకటప్రసాద్.. మంత్రి సవిత..

**తలుపుల అక్టోబర్ 31:**
తలుపుల మండలం పెద్దన్నవారిపల్లికు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం నాడు రానుండడంతో ఏర్పాట్లను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి సవిత శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తో కలిసి ఆమె ప్రజా వేదిక ప్రాంతాన్ని హెలిప్యాడ్ పరిసరాలను అలాగే గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ లబ్ధిదారుల గృహాలను పరిశీలించారు. అంతకుమునుపు ముఖ్యమంత్రి ప్రోగ్రాం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకట సు పెద్దన్నవారిపల్లి గ్రామాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు.

**చకచకా సాగుతున్న ఏర్పాట్లు ..**
రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం తలుపుల మండలం పెద్దనారపల్లికి రాను ఉండడంతో ఆయన పర్యటనను విజయవంతం చేసేందుకు జిల్లాలోని ఉన్నతాధికారులను అన్ని శాఖల ఉన్నతాధికారులు పెద్దనారపల్లికి తరలివచ్చారు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసేందుకు కావలసిన ఏర్పాట్లను చకచకా చేయిస్తున్నారు గ్రామంలోని అన్ని విధులను పరిశుభ్రంగా ఉంచేలా సిబ్బందితో పనులు చేయిస్తున్నారు అలాగే ఎలిప్యాడ్ నిర్మాణం అక్కడి నుండి ప్రజా వేదిక వద్దకు ముఖ్యమంత్రి చేరుకునేలా వాహనాలకు రాకపోకలు ఎలాంటి ఇబ్బంది లేకుండా రోడ్ల నిర్మాణము వివిఐపి లకు ప్రత్యేక పార్కింగ్ సౌకర్యము అలాగే వివిధ ప్రాంతాల నుండి వచ్చే వాహనాలకు ప్రత్యేక ప్రాంతంలో పార్కింగ్ ఏర్పాట్లు చేసేందుకు అనువైన స్థలాలను ఎంపిక చేశారు ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించేందుకు తాత్కాలికంగా ప్రజావేదికను ఏర్పాటు చేస్తున్నారు ప్రజా వేదిక నిర్మాణం చకచకా సాగుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం కు హాజరవుతుండగా ఈ ప్రాంతంలో చేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాల వివరాలు ఆయన దృష్టికి తీసుకెళ్తామని స్థానికులు తెలిపారు.


ఎంఎల్ఏ కందికుంట వెంకటప్రసాద్‌తో కలిసి అధికారులతో మాట్లాడుతున్న సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేసు


పెద్దన్నవారిపల్లి ప్రజావేదికను పరిశీలిస్తున్న మంత్రి సవిత

# ఘనంగా యల్లమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠ

## వీరభద్ర శివాచార్య స్వామి జీ.. టిడిపి రాష్ట ఉపాధ్యక్షులు గుండుమల ..


**రోళ్ల, అక్టోబర్ 31 :**
మండల పరిధిలోని గుడ్డుగురికి గ్రామం లో శుక్రవారం రేణుకా యల్లమ్మ దేవత విగ్రహాన్ని శాస్త్రోతకంగా ఘనంగా నిర్వహించారు. నాలుగు రోజులపాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం దేవత కు మహాగణపతి హోమము నవగ్రహ ముఖ పురస్వర, ప్రతిష్టహోమం, తత్వ హోమం, కళాహోమం,అంగహోమం, ప్రాణ ప్రతిష్ట జ్వాలా దర్శన మహా పూర్ణాహుతి కలశోతక మార్జన మహా మంగళారతి తీర్థ ప్రసాదం వినియోగం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సిద్దరబెట్ట రంబాపురి ఖాసా శాఖ మఠాధ్యక్షులు శ్రీ వీరభద్ర శివాచార్య స్వామిజీ మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ రాజకీయంగా జన్మనిచ్చిన రోళ్ళ ప్రజలను ఎన్ని సేవలు అందించిన తక్కువేనన్నారు. ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని సూచించారు. గుడ్డుగురికి గ్రామం లో రేణుక ఎల్లమ్మ దేవత ప్రతిష్టాపన చేయడం పట్ల వీరభద్ర శివచార్య స్వామీజీ మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి గ్రామస్తులను అభినందించారు. ఈ సందర్భంగా స్వామీజీని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిని శాలువాతో ఘనంగా సన్మానించారు.
ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి, రాష్ట్ర వక్కలిగా సాధికార కన్వీనర్ వీఎం పాండురంగప్ప సింగిల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ జెకె ఈరన్న, ఏపీఐఐసీ డైరెక్టర్ రామకృష్ణ, మాజీ క్లస్టర్ ఇంచార్జ్ భరత్, మాజీ ఎంపీపీ కృష్ణప్ప, పాండురంగప్ప,యూనిట్ ఇంచార్జ్ హేమంత్ రాయల్స్, వెంకటేష్, క్లస్టర్ కో కన్వీనర్ మారుతీ,మండల బీసీ సెల్ అధ్యక్షులు నాగరాజు, టి ఎన్ టి యూ సి జిల్లా ఉపాధ్యక్షులు మూర్తి,యువ నాయకులు ఆనంద్, వైస్ సర్పంచ్ రాజు, నాయకులు రామచంద్రప్ప, రవికుమార్, హనుమంతరాయప్ప,నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.


రేణుక ఎల్లమ్మను ప్రతిష్టించిన దృశ్యం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామి




టిడిపి నాయకులను సన్మానించిన అర్చకులు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిని సన్మానిస్తున్న దృశ్యం



# మండలానికి రానున్న మూడవ ముఖ్యమంత్రి చంద్రబాబు

**తలుపుల అక్టోబర్ 31:**
ముఖ్యమంత్రి హోదాలో తలుపు మండలానికి రానున్న చంద్రబాబు నాయుడు మూడవ ముఖ్యమంత్రి. అంతకుమునుపు 1975 76 లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు మొదటిసారి మండల కేంద్రమైన తలుపులకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రంలో దళితులకు ప్రభుత్వం నిర్మించి ఇచ్చిన పక్కా గృహాలను ప్రారంభించి ఆ కాలనీకి మాజీ ముఖ్యమంత్రి దివంగత ప్రకాశం పంతులు పేరు మీదుగా ప్రకాష్ నగర్ గా నామకరణం చేశారు. అప్పటి కదిరి శాసనసభ్యులు స్థానికుడైన చింతకుంట నారాయణరెడ్డి కోరిక మేరకు ముఖ్యమంత్రి జలగం వెంగళరావు తలుపులకు పర్యటనకు వచ్చి టీ రెడ్డివారిపల్లి ని సందర్శించారు. అనంతరం 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి రాజీవ్ పల్లెబాట కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రానికి విచ్చేసి దాదాపు 15 కిలోమీటర్లు మండలంలో ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన పలువురికి పక్కా గృహాలు మంజూరు చేశారు అలాగే పురాతన కొండారెడ్డి చెరువు పునరుద్ధరణకు నిధులు మంజూరు చేయించడమే గాక శంకుస్థాపన కూడా చేశారు .ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ చేయడానికి శనివారం మండలంలోని పెద్దన్న వారి పల్లికి రానున్నారు. దీంతో మండలంలో పర్యటించిన మూడో ముఖ్యమంత్రి గా చంద్రబాబు నాయుడు కానున్నారు. అయితే ప్రజలతో నేరుగా ముఖాముఖి కార్యక్రమం ఏర్పాటు చేసి మాట్లాడనున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుంది.



# పిడిఎఫ్ బియ్యం పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

**అమరాపురం, అక్టోబర్ 31:**
మండల పరిధిలో చిట్టినడు కు గ్రామ శివారులోని బస్ స్టాప్ దగ్గర వాహనాలను అనంతపురం ప్రాంతీయనిగా మరియు అమలు అధికారి ప్రసాద్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులతో కలిసి విజిలెన్స్ సి.ఐ. యు. సద్గురుడు,ఏఈఈఎల్ రవీంద్రనాథ్, సిఎస్డిటి నవీన్ కుమార్లు, తనిఖీ చేస్తుండగా కర్ణాటక రాష్ట్రమునకు అక్రమ రవాణా చేయుచున్న 346 బ్యాగులు పిడిఎస్ బియ్యంతో పాటు ఈచర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ సి ఏ. సద్గురుడు తెలిపారు .అనంతరం స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని మడకశిర గోడానికి తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి చెందిన డ్రైవర్ మారుతి ప్రసాద్ కర్ణాటక రాష్ట్రం పావగడకు చెందిన బియ్యం యజమాని ఎనమడిసెతురం, వాహన యజమాని పావగడ వెంకటేష్ లపై క్రిమినల్ కేసు నమోదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రాంతీయ నిఘాధికారి ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా ప్రజలకు పంపిణీ చేసే బియ్యాన్ని సేకరించడం నిలువ చేయడం ఇతర ప్రాంతాలకు తరలించి వ్యాపారం చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



కర్ణాటక పిడిఎఫ్ బియ్యం పట్టుకున్న దృశ్యం

# శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ

## మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి..

**అమరాపురం, అక్టోబర్ 31:**
మండల పరిధిలోని వీరాపురం గ్రామంలో నూతన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి నూతన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జోగన్న , సిద్ధార్థలు తీర్థ ప్రసాదాన్ని అందజేసి విచ్చేసిన ప్రముఖులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా కరిబసవేశ్వర స్వామి దేవాలయంలో కూడా ప్రత్యేక పూజలను నిర్వహించారు. అమరాపురం పట్టణంలోని టీచర్ కరివడప్ప నూతన గృహప్రవేశ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి నరసింహమూర్తి, మాజీ కన్వీనర్స్ శివ రుద్రప్ప,మండల ప్రధాన కార్యదర్శి నాగరాజ్ క్లస్టర్ కన్వీనర్ నవీన్ కుమార్, క్లస్టర్ కోకన్వీనర్ ,చెన్నప్ప, పార్లమెంట్ తెలుగుదేశం ఉపాధ్యక్షుడు రఘు, సీనియర్ నాయకులు మారుతి ప్రసాద్, దాదా పీర్, యువ నాయకుడు నాగోనపల్లి మంజునాథ్, తమదేపల్లి హనుమంతు, చెరువు సంఘం అధ్యక్షుడు నరసింహమూర్తి, దేవరాజు, రఘు, డీలర్ రమేష్, చంద్రశేఖర్ గౌడ్, డీలర్ సంఘం అధ్యక్షుడు తిప్పేస్వామి, మండల డీలర్ల సంఘం ఉపాధ్యక్షుడు స్టూడియో హనుమంతు, వి. అగ్రహారం సర్పంచులు ధనుంజయ, నిద్ర గట్ట సర్పంచ్ లోకేష్, చిట్టనడు కు మహాలింగప్ప, వీరాపురం మాలప్ప, భరత్ తదితరులు పాల్గొన్నారు.


శ్రీ లక్ష్మీదేవి విగ్రహ ప్రతిష్టాపన పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి.


నూతన గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పే స్వామి ,క్లస్టర్ కో కన్వీనర్ మంజు తారక్ ,నవీన్ కుమార్


మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి కి సన్మానం చేస్తున్న అర్చకులు జోగన్న స్వామి.


శ్రీలక్ష్మి దేవి ప్రతిష్ట పాల్గొన్న దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు.


భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం.



వధూవరులను ఆశీర్వదించిన నల్లపరెడ్డి, మావులూరు, గొల్లపల్లి

## వివాహ వేడుకల్లో పాల్గొన్న నల్లపరెడ్డి, గొల్లపల్లి, మావులూరు

**నెల్లూరు, అక్టోబర్ 31:**
నెల్లూరు, మైపాడు గెట్, బంగ్లాతోట లోని డిజిపి కళ్యాణ మండపంలో ఇందుకూరుపేట మండలం, పల్లిపాడు గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకులు లేబూరు సుమంత్ రెడ్డి–వినతల కుమార్తె, సుధా లక్ష్మీ – సాయి శస్మిత్ రెడ్డి ల కళ్యాణ మహోత్సవం పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రివైసీపీ రాష్ట్ర పిఎసి సభ్యులునల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి. ఈ కార్యక్రమంలో ప్రసన్న కుమార్ రెడ్డి తో పాటు ఏపీ ఎల్ డి ఏ ఛైర్మన్ గొల్లపల్లి విజయ్ కుమార్, ఇందుకూరుపేట మండల పార్టీ అధ్యక్షులు మవులూరు శ్రీనివాసులురెడ్డి , కోవూరు నియోజకవర్గ వైసీపీ పంచాయతీరాజ్ అధ్యక్షులు గూడూరు జయరాం, కోవూరు నియోజకవర్గ వైసీపీ ఇంటిలిజ్యువల్ అధ్యక్షులు కొడ్లపూడి శ్రీనివాసులురెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు కలువ బాలశంకర్ రెడ్డి మరియు వైసీపీ నాయకులు ఉన్నారు.



పునరావస కేంద్రాల్లో ఉన్న వారికి నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న దృశ్యం

## నరావాస కేంద్రాల్లో ఉన్నవారికి నిత్యావసర సరుకులు పంపిణీ

### తహశీల్దార్ వెంకటేశ్వర్లు ..

**నెల్లూరు, అక్టోబర్ 31:**
మొంథా తుఫాన్‌లో భాగంగా పునరావాస కేంద్రాలలో ఉన్న బాధితులకు నిత్యావసర వస్తువులను దామరమడుగు, కళయకాగోళ్ళు మరియు శ్రీరంగరాజపురం గ్రామలలో ఉన్న షాపు నంబర్ 17 మరియు షాపు నంబర్ 23 స్థానిక ప్రజాప్రతినిదులు మరియు ఎంపీడీఓ, సి ఎస్ డి టి, ఆర్ ఐ, మరియు వీఆర్వో లతో కలిసి పంపిణీ చేయడం జరిగింది అని బుచ్చిరెడ్డిపాలెం తహశీల్దార్ అంబటి. వెంకటేశ్వర్లు తెలిపారు.



మంత్రికి ఘన స్వాగతం పలుకుతున్న దృశ్యం

## బీద నివాసానికి విచ్చేసిన మంత్రి పార్థసారథి

**నెల్లూరు, అక్టోబర్ 31:**
హౌసింగ్, సమాచార పౌర సంబంధాల మంత్రి కొలుసు పార్థసారథి %-% కమల లక్ష్మీ దంపతులను తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, శాసన మండలి సభ్యులు బీద రవిచంద్ర బి జ్యోతి దంపతులు, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు తో కలిసి లోని వారి నివాసం నందు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికి, శాలువా తో సన్మానించడం జరిగింది.తదనంతరం బీద నివాసంలో ఏర్పాటు చేసిన తేనేటి విందులో మంత్రి కొలుసు పార్థసారథి హాజరై పలు అంశాలపై నేతలతో చర్చించారు. పై ఆత్మయ భేటీ లో ఏపీ ఇన్ లాండ్ వాటర్ వేస్ అథారిటీ ఛైర్మన్ డా. జెడ్ శివ ప్రసాద్, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి,మలిశెట్టి వెంకటేశ్వర్లు, ముదిరాజ్ సాధికారిక కన్వీనర్ పిఎల్ రావు, దేవరాల సుబ్రహ్మణ్యం,మేకల సురేంద్ర, కుంకాల నాగేంద్ర, పెన్నా డెల్టా వైస్ ఛైర్మన్ బీద గిరిధర్, హౌసింగ్ పీడీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## కొమరికలో నిత్యావసర వస్తువులు పంపిణీ

నెల్లూరు, అక్టోబర్ 31:
శుక్రవారం ఇందుకూరుపేట మండలం, కొమరిక గ్రామంలో మొంథా' తుఫాను ప్రభావితులకు నిత్యావసర వస్తువుల పంపిణీని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు రిశీలించారు.



నిత్యావసర వస్తువులు అందజేస్తున్న దృశ్యం

# వీతరాగ స్మార్ట్ హోమ్స్ ప్రారంభం

### ఎమ్మెల్యే కాకర్ల సురేష్.. కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ..

**ఉదయగిరి, అక్టోబర్ 31:**
నెల్లూరు నగరంలోని చిల్డ్రెన్స్ పార్క్ రోడ్, జగదీశ్ నగర్ 3వ వీధి సమీపంలో వింజమూరు మండలం, నల్గొండ ప్రాంతమునకు చెందిన లెక్కల ప్రసాద్–పార్వతి నూతనంగా స్థాపించిన వీతరాగ స్మార్ట్ హోమ్స్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ , నెల్లూరు రూరల్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి సంయుక్తంగా రిబ్బన్ కట్ చేసి సంస్థను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ లెక్కల ప్రసాద్, పార్వతి దంపతులు నెల్లూరు నగరంలో ఆధునిక సౌకర్యాలతో కూడిన స్మార్ట్ హోమ్స్ ప్రాజెక్టును ప్రారంభించడం అభినందనీయం అని పేర్కొన్నారు. వీరి వ్యాపారం దినదినాభివృద్ధి చెందుతూ, జీవితంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన యువత వ్యాపార రంగంలో ముందుకు రావాలని, తమ ప్రతిభను ఉపయోగించి బెంగళూరు, హైదరాబాద్ వంటి మహా నగరాలతో పాటు నెల్లూరు వంటి అభివృద్ధి చెందుతున్న పట్టణాల్లో,కూడా కొత్త వ్యాపారాలను స్థాపించాలని సూచించారు. వ్యాపారాల ద్వారా ఉపాధి అవకాశాలు సృష్టించడంతో పాటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని ఆయన పిలుపునిచ్చారు.ముఖ్యంగా, మన ఉదయగిరిలో కూడా చిన్న,మధ్యతరహా పరిశ్రమలను స్థాపించి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, వ్యాపార వేత్తలు,స్నేహితులు, బంధువులు,ప్రజా ప్రతినిధులు పాల్గొని లెక్కల ప్రసాద్,పార్వతి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.



వీతరాగ స్మార్ట్ హోమ్స్‌ను ప్రారంభిస్తున్న శాసనసభ్యులు కాకర్ల సురేష్ , కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి




జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ , టిడిపినేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి . ఎమ్మెల్యే సురేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

# వలంటీర్లను చిన్నచూపు చూస్తున్న చంద్రబాబు

**నెల్లూరు, అక్టోబర్ 31:**
రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ముఖ్యంగా వాలంటీర్లను చాలా చిన్నచూపు చూస్తున్నారని ఎన్నికల ప్రచారాల్లో మాత్రం మీకు ఉద్యోగాలు ఇస్తానని భరోసా ఇస్తానని చెప్పిన ఈయన ఈరోజు వాలంటీర్లు కేవలం రెండు గంటలు పనిచేసి ఐదు వేల రూపాయలు తీసుకుంటున్నారని కబుర్లు చెప్పడం సరికాదని వాలంటీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉభయం బాష అన్నారు శుక్రవారం నెల్లూరులోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేవలం రెండు గంటల పని చేస్తున్నారని చంద్రబాబు నాయుడు అబద్ధాలు చెప్పడం సరికాదని అబద్ధాలకు ప్రతిరూపం ఏదైనా ఉందంటే అది చంద్రబాబు నాయుడు అని ఆయన ఆరోపించారు వాస్తవానికి వాలంటీర్లు కరోనా సమయంలో కానీ మరి ఇతర సమయంలో కానీ ప్రతి నిత్యం ప్రజలకు అందుబాటులో ప్రజా సేవకు అంకితమై పని చేశారని గతంలో ఏ సర్టిఫికెట్ కావాలన్నా మున్సిపల్ ఆఫీసు తాలూకా ఆఫీసులు చుట్టూ తిరిగే ప్రజలు ఇబ్బంది లేకుండా ఈరోజు వాలంటీర్లుగా వారి ఇళ్ల మధ్యకే వారు కోరిన వివిధ రకములైన సర్టిఫికెట్లను అందజేస్తున్న వ్యవస్థ వాలంటీర్ల వ్యవస్థ అటువంటి వ్యవస్థను నిర్లక్ష్యం చిన్నచూపు చూస్తున్న చంద్రబాబు నాయుడు ఇది నీకు తగదు ఈరోజు మీ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందంటే అది కేవలం వాలంటీర్లు అందరూ కూడా కలిసి మిమ్మల్ని గెలిపించారు అనే విషయాన్ని మీరు మర్చిపోయి ఈరోజు ఈ విధంగా విమర్శ చేయడం సరి కాదని ఆయన అన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మున్నా మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన కూటమి పాలకులు ఈరోజు గత ప్రభుత్వం కంటే ఇంకా దర్పనంగా నిర్లక్ష్యంగా ముఖ్యంగా యువతను నిర్లక్ష్యం చేస్తున్నారని ఎక్కడ వారు చెప్పిన విధంగా డీఎస్సీ లేదు ఉద్యోగ నియామకులు లేదు ఏమీ లేకుండా యువతను రోడ్లో మీద పడేవిధంగా చేస్తున్నటువంటి మీరు మల్ల వాలంటీర్లను విమర్శ చేయడం సరి కాదని ఇప్పటికైనా మీ పంద మార్చుకొని వాలంటీర్లకు తక్షణం ఎన్నికల ప్రచారంలో చెప్పిన విధంగా నియామకాలను ఇవ్వాలని అదేవిధంగా వాలంటీర్లను పై మీరు చేసిన కామెంట్స్ ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో వాలంటీర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్కె నాగూర్ భాష నెల్లూరు జిల్లా వాలంటీర్ల సంఘం నాయకుడు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాష

# వింజమూరు ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం

### విశ్వాసం కోల్పోయిన ఎంపీపీ ఇనగనూరి మోహన్ రెడ్డి.. ఆధిపత్య పోరులో వనిపెంట సుబ్బారెడ్డి విజయం..

**ఉదయగిరి(వింజమూరు) అక్టోబర్ 31:**
వింజమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నాడు జరిగిన ఎంపీపీ అవిశ్వాస తీర్మానం నాటకీయ పరిణామాల నడుమ కావలి ఆర్డీవో వంశీకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. మండలంలో మొత్తం 12 మంది ఎంపీటీసీలు ఉండగా 11 మంది అవిశ్వాసంలో పాల్గొన్నారు. వారిలో 8 మంది అవిశ్వాసం వైపు మొగ్గు చూపి ఓటు వేశారు. దీంతో అవిశ్వాసం నెగ్గింది. టిడిపి నాయకులు వనిపెంట సుబ్బారెడ్డి ఎనిమిది మంది ఎం పీ టీ సీ లతో క్యాంపు నిర్వహించారు. వారిని సమావేశానికి వెళ్లకుండా కావలి వింజమూరు రోడ్డులో ఎంపీపీ వర్గం కాపు కాసింది. ఇది తెలుసుకున్న క్యాంపు లోని ఎంపీటీసీలు కలిగిరి సీఐ వెంకటనారాయణ వాహనంలో దారి మళ్లించి వింజమూరు పట్టణంలో నుండి బంగ్లా సెంటర్ మీదుగా ప్రజా పరిషత్ కార్యాలయానికి చేరుకున్నారు. కార్యాలయానికి చేరుకున్న ఎంపీపీ మోహన్ రెడ్డి ఆగ్రహంతో ఊగిపోయారు. తనపై కుట్ర చేస్తున్నారని, నా పరువు తీయాలని చూస్తున్నారని ఆవేశంతో రగిలిపోయారు. ఇరుపక్షాలు తెలుగుదేశంనాయకులమే కాబట్టి కూర్చొని మాట్లాడుకుంటే సరిపోతుందనిమండిపడ్డారు. అవసరమైతే తన పరువు పోతే ఆత్మహత్య చేసుకుంటానంటూ తీవ్ర భవోద్వేగానికి లోనయ్యారు.ఆగ్రహావేశంలో కాటేపల్లి ఎంపీటీసీ పల్లా పురుషోత్తం తో తాను ఖర్చుపెట్టిన డబ్బులు ఇచ్చి మీరు ఎక్కడికైనా వెళ్లిపోండి అసహనం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో సమావేశం మందిరంలో కాలుతో కుర్చీని తన్ని ఆవేశంతో ఊగిపోయాడు. ఈ పరిణామాలతో సమావేశ ప్రాంగణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కొద్దిసేపు అరుపులు కేకలు మధ్య అవిశ్వాసం ఆమోదం పొందింది. దీంతో సుమారు 15 రోజుల నుండి, ఎదురుచూస్తున్న ఉత్కంఠకు తెరపడింది. వని పెంట సుబ్బారెడ్డి తమ వర్గంతో విజయం సాధించారు. అనంతరం ఆర్డిఓ వంశీకృష్ణ మాట్లాడుతూ అవిశ్వాసం నెగ్గిందని ,తదుపరి నివేదిక కలెక్టర్ కు పంపడం జరుగుతుందన్నారు. ఆయన ఆమోదం తెలిపిన వెంటనే తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు . వింజమూరు ఎంపీపీ అవిశ్వాస తీర్మానం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఇంతవరకు ఈ మండలంలో ఇటువంటి పరిణామాలు చోటు చేసుకోలేదని, మూడు నెలల పదవి కోసం కోటి రూపాయలు వరకు ఖర్చు చేసినట్లు, చర్చించుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు ఆనంగి రమణయ్య,బసిరెడ్డి సుమలత, వనిపెంట హైమావతి, పల్లా పురుషోత్తం, కాటం ప్రసన్న, ఉంటా రత్తమ్మ, సాదం మౌనిక, గవ్వల మల్లికార్జున, ఇనగనూరి మోహన్ రెడ్డి,పల్లాల కొండారెడ్డి, యాకసిరి భవాని,ఎంపీడీవో శ్రీనివాసులు రెడ్డి, తహసిల్దార్ హమీద్, ఆర్ ఐ సిరాజ్, కలిగిరి సీఐ వెంకట నారాయణ, ఉదయగిరి సీఐ, వెంకట్రావు, ఆత్మకూరు సిఐ గంగాధర్ వింజమూరు ఎస్ ఐ వీర ప్రతాప్ మూడు సర్కిల్ పరిధిలోని 11 మంది ఎస్ఐలు, 70 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఆర్డీవో వంశీకృష్ణ




విజయచిహ్నం చూపిస్తున్న ఎంపిటిసిలు. సంబరాలు జరుపుకుంటున్న దృశ్యం

## వివాహ వేడుకల్లో పాల్గొన్న ప్రసన్న కుమార్ రెడ్డి

**నెల్లూరు, అక్టోబరు 31**
:కోవూరు పట్టణం, గాంధీ పార్క్ సెంటర్ లోని శ్రీ కోదండ రామస్వామి దేవస్థానం నందు కోవూరు మండలం, గమళ్ళపాళెం గ్రామానికి చెందిన బండ్ల శ్రీనివాసులు , సుగుణ దంపతుల కుమారుడు వినయ్ కుమార్, శరణ్య కుమారి ల కళ్యాణ మహోత్సవం పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి,వైసీపీ రాష్ట్ర పిఎసి సభ్యులునల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు పచ్చిపాల రాధాకృష్ణ రెడ్డి ,వైసీపీ జిల్లా పార్టీ రైతు విభాగం అధ్యక్షులు శివుని నరసింహారెడ్డి ,ఇందుకూరుపేట మండల పార్టీ అధ్యక్షులు మవులూరుశ్రీనివాసులురెడ్డి, కోవూరు మండల పార్టీ అధ్యక్షులుఅత్తిపల్లి అనూప్ రెడ్డి, జడ్పిటిసి సభ్యురాలు కవరగిరి శ్రీలత,వైసీపీ సీనియర్ నాయకులు కలువ బాలశంకర్ రెడ్డి, వైసిపి వాలంటీర్ల విభాగం జిల్లా కార్యదర్శి కవరగిరి ప్రసాద్ మరియు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



వధూవరులను ఆశీర్వదించిన నల్లపరెడ్డి, మావులూరు



వివాహ వేడుకల్లో పాల్గొన్న నల్లపరెడ్డి, మావులూరు

## సమైక్య సారథి "సర్దార్ పటేల్"

**నెల్లూరు, అక్టోబర్ 31 :**
స్వేచ్ఛ, సమగ్రత, సమత, ఐక్యతతో సుదృఢ భారతదేశాన్ని నిర్మించిన సమైక్య సారథి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని ప్రధానోపాధ్యాయురాలు పి. వేదవతి అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో భారతదేశ మొట్టమొదటి హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 565 సంస్థానాలను ఏకబిగిన విలీనం చేసి ఉక్కు మనిషిగా చరిత్రలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారన్నారు. సహాయ నిరాకరణ, క్విట్ ఇండియా, దండి ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. భారత రాజ్యాంగ రచనలో ప్రముఖ పాత్ర పోషించడమే కాకుండా ప్రాథమిక హక్కుల కమిటీ చైర్మన్గా వ్యవహరించి నవభారతవారధిగా నిలిచారన్నారు. ఆయన సేవలను గుర్తించి పటేల్ జయంతిని ప్రభుత్వం ప్రతి యేడు జాతీయ సమైక్యతా దినోత్సవంగా నిర్వహిస్తున్నదని పేర్కొన్నారు. సర్దార్ పటేల్ పురస్కార గ్రహీత గండికోట సుధీర్ కుమార్, ఉపాధ్యాయులు అరుణ కుమారి, బ్రహ్మారెడ్డి, రసూల్, గంగాధర్,అహ్మదున్నిసా బేగం, పాల్గొన్నారు.



రామచంద్రపురం ప్రాథమికోన్నత పాఠశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

## కొడవలూరు పోలీస్ స్టేషన్‌లో సంతకాలు పెట్టిన ప్రసన్న కుమార్ రెడ్డి, చలపతిరావు

**నెల్లూరు, అక్టోబర్ 31:**
సెప్టెంబర్ 20న డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ వీరి చలపతిరావు తోపాటు, మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి పై, మరియు మరో 18 మంది వైసీపీ నాయకులపై నమోదైన కేసులో నెల్లూరు జిల్లా కోర్టులో బెయిల్ మంజూరైన నేపథ్యంలో కోర్టు ఆదేశాల మేరకు మాజీ మంత్రి, వైసీపీ రాష్ట్ర పిఎసి సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ,డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్, వైసీపీ జిల్లా పార్టీ అధికార ప్రతినిధి వీరి చలపతిరావు శుక్రవారం కొడవలూరు పోలీస్ స్టేషన్ కి వెళ్లి పోలీసుల సమక్షంలో సంతకాలు పెట్టారు.




పోలీస్ స్టేషన్లో సంతకాలు పెడుతున్న మాజీ మంత్రి నల్లపరెడ్డి, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ చలపతిరావు

## వివాహమహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

**ఉదయగిరి, అక్టోబర్ 31 :**
కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణంలో జరిగిన ఉదయగిరి నియోజకవర్గం అబ్జర్వర్ పెరుంబుదూరు వికాస్ హరికృష్ణ,శ్రీమతి వసుంధర దంపతుల కుమార్తె లక్ష్మీ లహరి, హరికృష్ణ వివాహ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.ఈ వివాహ వేడుకలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ముఖ్య అతిథిగా హాజరై, నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మీ లహరి హరికృష్ణ దంపతుల జీవితం ఆనందం, ఐకమత్యం, పరస్పర గౌరవంతో నిండిపోవాలని హృదయపూర్వకంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉదయగిరి హాస్పిటల్ కమిటీ చైర్మన్ బొజ్జ నరసింహులు, మండల కన్వీనర్ బయన్న, హాస్పటల్ కమిటీ మెంబర్, సీతారాంపురం మాజీ జెడ్పిటిసి సభ్యురాలు కలివేల జ్యోతి, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అలాగే రెండు కుటుంబాల బంధుమిత్రులు, సన్నిహితులు, రాజకీయ ప్రముఖులు, స్థానిక విశిష్టులు భారీ సంఖ్యలో హాజరై, కొత్త దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న శాసనసభ్యులు కాకర్ల సురేష్



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే సురేష్



ఉరవకొండ పట్టణంలో పర్యటిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్, స్కూలు పిల్లలు, మహిళలతో మహిళలతో మాట్లాడుతున్న మంత్రి కేశవ్

# ఉరవకొండలో మరో 25 ఏళ్లు తాగునీటి సమస్య లేకుండా చేస్తాం

### ఉరవకొండలో రెండవ రోజు "ఇంటింటికి మంత్రి" కార్యక్రమం ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్న మంత్రి..

**బెళుగుప్ప, అక్టోబర్ 31 :**
"ఇంటింటికి మంత్రి" కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు శుక్రవారం ఉరవకొండ పట్టణంలో రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. పట్టణంలోని అంబేద్కర్ నగర్, ఇందిరా నగర్, తదితర కాలనీలలో పర్యటించి నేరుగా ప్రజల ఇంటి వద్దకే వెళ్లి మహిళలు, ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించాలని అక్కడికక్కడే అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ఉరవకొండ పట్టణంలో మరో 25 ఏళ్లు తాగునీటి సమస్య లేకుండా చేస్తామని, ఇందుకోసం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. పట్టణంలో 30 ఏళ్ల కిందటి పైప్ లైన్ లు ఉన్నామని, వాటిని మారుస్తామన్నారు. అవసరమైన డ్రైనేజీలు ఏర్పాటు చేస్తామన్నారు. వర్షం వల్ల మగ్గం గుంతల్లో నీళ్లు వచ్చి ఉపాధి కోల్పోయామని పలువురు చేనేతలు తెలుపగా, వెంటనే ఫోన్ ద్వారా చేనేత జౌళి శాఖ ఏడితో మంత్రి మాట్లాడుతూ నష్టం నివేదికలను కలెక్టర్ కు పంపించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు. ఉరవకొండ పట్టణంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేసేందుకు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలనేది ప్రజలతో సలహాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



మంత్రి కేశవ్‌తో సెల్ఫీ దిగుతున్న చిన్నారి



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న మంత్రి కేశవ్



మహిళలతో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్



ఉరవకొండ పట్టణంలో రెండవ రోజు పలు కాలనీలలో విస్తృతంగా పర్యటించి, ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్



లక్ష్యంపల్లి గ్రామంలో నీటి తొట్లను పరిశీలిస్తున్న డాక్టర్ అప్పయ్య. మలేరియా అధికారి శ్రీనివాసులు.

## మలేరియాపై ప్రజలకు అవగాహన

### వైద్యులు అప్పయ్య..

**యాడికి, అక్టోబర్ 31:**
మలేరియా వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు అప్పయ్య అన్నారు. యాడికి మండలం చందన, లక్ష్యంపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆయన ప్రజలకు అవగాహన కలిగించారు. డాక్టర్ అప్పయ్య. తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు ఫ్రైడే డ్రై డే , వ్యక్తిగత పరిశుభ్రత , పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. ఫ్రైడే డ్రై డే సందర్భంగా ఇళ్ల వద్ద ఉన్న నీటి తొట్లలో దోమల లార్వాను తొలగించాలని, పాత టైర్లలో లార్వా తొలగించి తొట్లను శుభ్రంగా ఉంచాలని, గంట ఆరబెట్టిన తర్వాత తొట్ట నింపుకోవాలని సూచించారు.



హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌లో ఎమ్ఎల్‌హెచ్‌పి, డెంగ్యూ కిట్టు మలేరియా కిట్లు, రికార్డులను పరిశీలించారు. జ్వరంతో వచ్చిన ప్రతి ఒక్కరికి కిట్ల ద్వారా డెంగ్యూ , మలేరియా పరీక్షలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో .ఎమ్ ఎల్ హెచ్ పి హేమీమా ఆశా కార్యకర్త బాల కుళ్లాయమ్మ పాల్గొన్నారు.



# అంగరంగ వైభవంగా కసాపురం ఆలయ కలశ ప్రతిష్ఠ

### హాజరైన ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు.

**గుత్తి, అక్టోబర్ 31:**
జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం జరిగిన ఆలయ శిఖరం కలశ ప్రతిష్టాపన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. కసాపురం ఆలయాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కల శుక్రవారంతో నెరవేరటం ప్రారంభమైంది. ఈ గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి అనంతపురం జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరవ్వడంతో కసాపురం ఆలయ ప్రాంగణమంతా అంగరంగ వైభవంగా పండగ వాతావరణాన్ని సంతరించుకుంది. కార్యక్రమంలో రాప్తాడు శాసన సభ్యురాలు శ్రీమతి లిపరిటాల సునీత రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు, మరియు కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు,మరియు పుట్టపర్తి శాసన సభ్యురాలు పల్లె సింధూర రెడ్డ, మరియు మాజీ శాసనసభ్యులు పల్లె రఘునాథ్ రెడ్డి,మరియు సింగణమల శాసన సభ్యురాలుబండారు శ్రావణి మరియు అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, మరియు ఎమ్మెల్యే గారి సోదరులు గుమ్మనూరు నారాయణ స్వామి, మరియు గుమ్మనూరు శ్రీనివాసులు, మరియు ఎమ్మెల్యే తనయుడు పామిడి మరియు గుత్తి ఇంచార్జ్ . గుమ్మనూరు ఈశ్వర్ హాజరవ్వడం జరిగింది.. ఈ సందర్భంగా పలువురు శాసనసభ్యులు మాట్లాడుతూ గుంతకల్లు నియోజకవర్గం శాసనసభ్యులు శ్రీ గుమ్మనూరు జయరాం ఆధ్వర్యంలో శ్రీ కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి వారి దేవాలయం ఎంతో శోభాయ మానంగా తీర్చిదిద్దడం ఆయనకు ఎంతో గర్వకారణం అని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుమ్ముడు విజయ్ రామ్ పేరు చరిత్ర పుటల్లో నిలిచిపోయిందని ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్యేలు తెలియజేశారు అనంతరం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ కసాపురం గ్రామ ప్రజలు మరియు దాతలు సహకారంతో కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి వారి దేవాలయంలో అభివృద్ధి పథంలో నడిపినందుకు ఆ కార్యక్రమంలో నేను భాగమైనందుకు చాలా సంతోషంగా ఉందని రాష్ట్ర రాష్ట్రవ్యాప్తంగా కసాపురం ఆలయం ప్రముఖ పుణ్యక్షేత్రంగాను పర్యాటక కేంద్రంగానూ అభివృద్ధి చెందే అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. ఆహ్వానాన్ని మన్నించి జిల్లాలోని వివిధ నియోజకవర్గాల నుండి హాజరైన ప్రతి ఒక్క ఎమ్మెల్యేలకు ప్రజాప్రతినిధులకు ఆయన పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె, ఎంపి అంబికా



లక్ష్యంపల్లి గ్రామంలో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ అప్పయ్య



ఎమ్మెల్యే సునీతకు స్వాగతం పలుకుతున్న దృశ్యం. స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సునీత. టిడిపి నాయకులు

# బాహుబలి ఎపిక్‌తో కొత్త అనుభూతి




'బాహుబలి' సినిమాల్లో కథ అందరికీ తెలిసిందే. ఈసారి కథ కంటే కూడా మహిష్మతి ప్రపంచాన్ని మరోసారి పెద్ద తెరపై చూడటానికీ, రెండు భాగాలు కలిపి చూసినప్పుడు పాత్రలు పంచే ఆ అనుభూతి ఎలా ఉంటుందో అస్వాదించడానికీ వెళతారు ప్రేక్షకులు. అయితే కథ తెలిసినవాళ్లకయినా.. తెలియని వాళ్లకైనా సరే 'బాహుబలి : ది ఎపిక్' ఓ కొత్త సినిమా చూసిన అనుభూతిని పంచుతుంది. అందరినీ మరోసారి మాహిష్మతి ప్రపంచంలో లీనం చేసి, పాత్రలతో కలిసి ప్రయాణం చేయించారు దర్శకుడు రాజమౌళి. అలాగని ఇందులో కొత్త సన్నివేశాలేమీ జోడించలేదు. ఒకట్రెండు డైలాగులు తప్ప అదనంగా ఏమీ ఉండవు. రాజమౌళి తెరపై చూపించిన మాహిష్మతి రాజ్యాన్ని దాని పాలనకు సంబంధించిన రెండు పార్ట్‌లను కలిపి ఒక్కటిగా చూపారు. ఇప్పుడు ఆ రెండు భాగాల్ని కలిపి చూస్తున్నప్పుడు.. ఒకవైపు థ్రిల్ చేసే హీరోయిక్ హై మూమెంట్స్, మరోవైపు కథలోని భావోద్వేగాలు మనసుల్ని కట్టిపడేస్తూ ఎపిక్ అనుభవాన్ని పంచుతుంది. సినిమాని కొత్తగా ఎడిట్ చేసినా.. స్క్రీన్‌ప్లేలో మార్పులేమీ లేవు. తొలి భాగం సినిమాని ప్రథమార్ధంలోనూ, రెండో సినిమాని ద్వితీయార్ధంలోనూ చూపించారు. ప్రథమార్ధంలో పచ్చబొట్టేసినా పాటతోపాటు, శివుడు, అవంతిక పాత్రల మధ్య లవ్ ట్రాక్‌కి కోత పెట్టారు. ఆ ఎపిసోడ్ కథనంతా రాజమౌళి తన వాయిస్ ఓవర్‌తో చెప్పేశారు. ఆ తర్వాత కీలక సన్నివేశాల్ని చూపిస్తూ కథని వేగంగా చెప్పే ప్రయత్నం కనిపిస్తుంది. ప్రథమార్ధంలో యుద్ధం ఎపిసోడ్స్‌నీ కొంచెం కుదించి చూపించారు. దాంతో అవి మరింత పదునుగా అనిపిస్తాయి. కట్టప్ప బాహుబలిని ఎందుకు చంపాడో తెలుసుకునేందుకు ఇప్పుడు రెండేళ్లు ఎదురు చూడాల్సిన అవసరం లేదని సూచిస్తూ తొలి భాగాన్ని ముగించారు. 'బాహుబలి: ది కన్‌క్లూజన్' కథతో ద్వితీయార్థాన్ని భావోద్వేగ భరితంగా చూపించి ప్రేక్షకులను మరోసారి కట్టిపడేశారు. ప్రతి ఎపిసోడ్ హైలెట్‌గా నిలుస్తుంది. రెండు భాగాల్లో తొంభై నిమిషాలకుపైగా సన్నివేశాలను తొలగించినా ఆ ప్రభావం సినిమాపై పెద్దగా కనిపించనివ్వకపోవడం విశేషం. ఒక సినిమాలో అమాంతం సన్నివేశాలు మారినప్పుడు సంగీతం పరంగానూ, విజువల్ కోణంలోనూ సమస్యలొస్తుంటాయి. ఆ విషయాలపై ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకుని రీవర్క్ చేసినట్టు అనిపిస్తుంది. చాలా రోజుల తర్వాత పెద్ద తెరపైన ప్రభాస్ రాయల్ లుక్‌ని చూడటం అభిమానులకైతే ఓ పండగ అనుభవమే. ప్రభాస్ ని మళ్లీ అలాంటి డైనమిక్ లుక్‌లో, అంత హుషారుగా ఎప్పుడెప్పుడు చూస్తామా అనే ఆశని, ఉత్సుకతని రేకెత్తిస్తుందీ చిత్రం. భల్లాలగా రానా దగ్గుబాటిని తప్ప మరొకరిని ఊహించుకోలేం అన్నట్టుగా ఆయన అభినయం మరోసారి మైమరిపిస్తుంది. కీరవాణి సమకూర్చిన సంగీతం కొత్త హంగుల్ని అద్దుకుని మరింత కొత్తగా వినిపించింది. నేపథ్య సంగీతం మరో స్థాయిలో ఉంది. మారిన సాంకేతికతకి అనుగుణంగా సంగీతం, విజువల్స్‌కు కొత్త హంగుల్ని సంతరించుకోవడం 'ది ఎపిక్'కి మరింతగా కలిసొచ్చింది. ఎడిటింగ్ బాగా కుదిరింది.

రెండు భాగాలను కలిపి ఒక సినిమాగా తీసుకొచ్చే ఓ కొత్త దారిని 'బాహుబలి: ది ఎపిక్' చూపించింది.

# పెద్ది కొరియోగ్రాఫర్‌గా జానీ



పెద్ది కొరియోగ్రాఫర్‌గా జానీ మాస్టర్‌ను ఎంపిక చేయడంపై పలువురు డ్యాన్సర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇండస్ట్రీలో ఆయన బాగా రాణిస్తున్న సమయంలో కొంతమంది కక్షగట్టి ఆయనపై కేసు నమోదు అయ్యేందకు కారకులయ్యారు. దీంతో ఆయన జైలు జీవితం కూడా గడిపారు. ఇలాంటి వ్యక్తిని మళ్లీ అవకాశం కల్పించడంపై పలువురు నెటిజన్లు జానీకి వ్యతిరేకంగా మండిపడుతున్నారు. కాగా సినీ ఇండస్ట్రీలో బహిర్గతం గానినేరాలు అనేకం వున్నాయనీ, పెద్దపెద్ద డైరెక్టర్లు, పెద్ద హీరోలు కూడా చాలా తప్పులు చేసి వున్నారనీ, అవన్నీ బైటికి రాకుండా చేసుకుని ఇండస్ట్రీలో మాస్టర్‌గా ఓ రేంజ్‌లో రాణిస్తున్నాడన్న కక్షతోనే జానీని ఇరికించారన్న వార్తలు వినిపిస్తున్నాయి. కాగా జానీకి అండగా ముందునుంచీ మెగా ఫ్యామిలీ అండగా నిలుస్తూనే వచ్చింది. ఈనేపథ్యంలో జానీకి పెద్ది కొరియోగ్రాఫర్‌గా అవకాశం కల్పించిందన్న చర్చలు జరుగుతున్నాయి. కాగా బైట పడితే ఇండస్ట్రీలో అందరి జాతకాలూ అధ్వాన్నంగానే వుంటాయని, జానీని టార్గెట్ చేయడం అవసరమా అని కొంతమంది ఇండస్ట్రీవాసులే అనుకుంటున్నారు. ఏదేమైనా జానీ మళ్లీ తన కొరియోగ్రఫీతో ప్రేక్షకులను అలరించనున్నాడని ఆయన అభిమానులు ఆనందిస్తున్నారు.

# అఖండ -2 కోసం మాస్ థీం




నందమూరి బాలకృష్ణ హీరోగా, బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'అఖండ 2: తాండవం' చిత్రంపై భారీ అంచనాలు అంతకంతకు పెరుగుతూ ఉన్నాయి. ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్, గ్లింప్స్ చిత్రంపై భారీ హైప్ క్రియేట్ చేశాయి. ఇప్పటికే థమన్ 'అఖండ' సినిమా మ్యూజిక్‌తో ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసి ఇప్పుడు 'అఖండ 2' కోసం మరింత పవర్‌ఫుల్, డివైన్ టోన్ సృష్టిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాటలు, సంగీతంపై దృష్టి పెట్టిన తమన్ శ్లోకాలు వల్లించడంలో ఉద్దండులైన వారిని రంగంలోకి దింపుతున్నాడు. ఇప్పటికే ఉత్తరాది నుంచి మిశ్రా బ్రదర్స్ ను తీసుకు రాగా తాజాగా సర్వేపల్లి సిస్టర్స్ ను తెర మీదకు తీసుకు వచ్చాడు. 'అఖండ 2: తాండవం' కోసం థమన్ అందిస్తున్న శక్తిమంతమైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌ను మరింత అద్భుతంగా మార్చేందుకు సర్వేపల్లి సిస్టర్స్ గాత్రాన్ని పాటల కోసం వాడుతున్నట్లు చిత్రబృందం తెలిపింది. ప్రస్తుతం ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. బాలయ్య ఎంట్రీ సీన్స్ కోసం ప్రత్యేకమైన శివతాండవ రాగాల కలయికతో థమన్ ఒక ఆధ్యాత్మిక మాస్ థీమ్ రూపొందిస్తున్నారు.

# వేడుకగా నారారోహిత్ వివాహం



హాజరైన నారా చంద్రబాబు దంపతులు

టాలీవుడ్ యంగ్ హీరో నారా రోహిత్ ఓ ఇంటి వాడయ్యాడు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య అతిరథ మహారాథుల సమక్షంలో ప్రేయసి శిరీష మేడలో మూడు ముళ్ళు వేసాడు నారా రోహిత్. గతేడాది అక్టోబర్ లో నారా రోహిత్- శిరీష్ ల నిశ్చితార్థం జరిగింది. సరిగ్గా ఏడాది తర్వాత ఇప్పుడు పెళ్లి బంధంతో ఒక్కటి అయ్యారు. శిరీషా స్వస్థలం పల్నాడు జిల్లా రెంటచింతల. ఆస్ట్రేలియాలో ఉన్నత విద్యని అభ్యసించిన శిరీష నటన పై మక్కువతో టాలీవుడ్ లో అడుగుపెట్టింది. నారా రోహిత్ ప్రధాన పాత్రలో నటించిన ప్రతినిధి-2 సినిమాలో రోహిత్ ప్రియురాలిగా నటించింది. అదే సమయంలో వీరిద్దరూ ప్రేమలో పడ్డారు. అదే విషయాన్ని ఇంటి సభ్యులకు చెప్పారు. వారి అంగీకారంతో ఇప్పుడు వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టారు. కాగా ఈ వేడుకకు అటు రాజకీయ, సినీ ప్రముఖులు హాజర్యయారు. రోహిత్ వివాహ వేడుకకు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆయన సతీమణి భువనేశ్వరి దగ్గరుండి అన్ని కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే నారాలోకేష్ దంపతులు, నందమూరి బాలకృష్ణ దంపతులు నూతన జంటను ఆశీర్వదించారు. యంగ్ హీరోలు మంచు మనోజ్, బెల్లంకొండ శ్రీనివాస, శ్రీ విష్ణు ఈ వేడుకకు హాజరయి రోహిత్ దంపతులకు విషెష్ తెలిపారు. వీరితో పాటు తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు ఈ వేడకలో పాల్గోని వధూవరులను దీవించారు.



# వివాహ బంధంలోకి అభిసన్ జీవింత్

'టూరిస్ట్ ఫ్యామిలీ' చిత్రంతో దర్శకుడిగా తొలి అడుగులోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న అభిషన్ జీవింత్ . తాజాగా వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. శుక్రవారం ఉదయం తన ప్రియురాలు అక్కీలతో కలిసి ఏడడగులు వేశాడు. 'టూరిస్ట్ ఫ్యామిలీ' ప్రీ-రిలీజ్ వేడుకలో అభిషన్ తన ప్రియురాలు అక్కీలపై ప్రేమను వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అక్టోబర్ 31న నన్ను పెళ్లి చేసుకుంటావా? అంటూ ప్రపోజ్ చేసి అందరిని షాక్‌కి గురిచేశాడు. అయితే చెప్పిన డేట్ ప్రకారమే నేడు అక్కీలను వివాహం చేసుకున్నాడు అభిషన్. ఈ జంటకి పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలుపుతున్నారు. మరోవైపు ఈ యువ దర్శకుడికి 'టూరిస్ట్ ఫ్యామిలీ' చిత్ర నిర్మాత మాగేశ్ రాజ్ పాసిలియన్ ఒక అద్భుతమైన బహుమతి ఇచ్చారు. తమ తొలి చిత్రానికి మెగా విజయాన్ని అందించినందుకు కృతజ్ఞతగా ఆయన అభిషన్‌కు లగ్జరీ బీఎండబ్ల్యూ కారును వెడ్డింగ్ గిఫ్ట్‌గా అందించారు. దర్శకుడిగా మెప్పించిన అభిషన్ ఇప్పుడు నటుడిగా మెప్పించేందుకు సిద్ధమవుతున్నారు. మలయాళ నటి అనస్వర రాజన్‌తో కలిసి హీరోగా నటిస్తున్న తన తదుపరి చిత్రం షూటింగ్ కూడా పూర్తయింది. రజనీకాంత్ కుమార్తె సౌందర్య రజనీకాంత్ నిర్మాణ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.



Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.